ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 21, సెప్టెంబరు 2025


ఒంగోలులోని పప్పు బజారులో కనీసం సెట్ బ్యాక్ కూడా లేకుండా నిర్మించిన భవనం

గత వైసీపీ పాలనలో ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన అధికారి ప్రజాప్రతినిధుల నుంచి, తన పై అధికారుల వరకు అందరినీ అన్నగారూ అంటూ ఆకట్టుకున్నారు. మంచి మాటకారిగా పేరు ఉన్న ఆయన అవినీతిలో ఆరితేరారు. ఆయనకు సహకరించిన టౌన్ ప్లానింగ్ అధికారి (ప్రస్తుతం రిటైర్డ్) చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. రూ.వేలు, లక్షలు కాదు.. ఏకంగా కోట్లలో అవినీతి జరిగినట్లు సమాచారం. ఆదాయ వనరులు అధికంగా ఉండే విభాగంలో తనదైన పాత్ర పోషించి, టౌన్ 'ప్లానింగ్'నే మార్చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదును దోచేసి, సొంత ప్లానింగ్‌లు ఇచ్చేసి భారీగా స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ, విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి పలు కీలకమైన ఫైళ్లను స్వాధీనం చేసుకోవడంతో వాస్తవాలు బయటపడుతున్నాయి.

అన్నగారంటూ.. దోచేశారు!

వైసీపీ హయాంలో అక్రమ కట్టడాలకు ఆయన ఆశీస్సులు

- అపార్ట్‌మెంట్‌ల నుంచి ఆసుపత్రుల వరకు అడ్డగోలుగా అనుమతులు
- ఓ విల్లాకు తక్కువ పన్ను విధింపునకు భారీగా ముడుపులు
- కార్పొరేషన్ ఖజానాకు భారీగా గండికొట్టిన మాజీ కమిషనర్
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అక్రమాలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఒంగోలు నగర పాలక సంస్థలో 'అన్నగారు..' హయాంలో అవినీతి అడ్డూఅదుపు లేకుండా సాగింది. అక్రమాలకు పునాదులు పడ్డాయి. ఆ అధికారి చెప్పిందే వేదంగా ఫైళ్లు కదిలాయి. అంతా తానై నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా కార్పొరేషన్‌లో అనుమతులు ఇచ్చేశారు. అప్పటి వైసీపీ పెద్దల ఆదేశాలు.. కొందరు ఉన్నతాధికారుల ఆశీస్సులతో కార్పొరేషన్ ఖజానాకు భారీగానే గండికొట్టారు. అపార్ట్‌మెంట్‌ల నుంచి ఆసుపత్రుల నిర్మాణాల వరకు నిబంధనలకు నీళ్లొదిలారు. 38 ఎకరాలలో నిర్మిస్తున్న విల్లాలకు సంబంధించి కిరికిరి చేసి పన్ను తగ్గించి భారీగా ముడుపులు తీసుకున్నారు.

నిబంధనలు ఒకలా.. అనుమతులు మరొకలా..!

నగరంలో గత పదేళ్ల నుంచి అపార్ట్‌మెంట్ రంగానికి ఆదరణ పెరిగింది. బహుళ అంతస్థులు భారీగా నిర్మాణం చేపట్టారు. గతంలో నడిబొడ్డుకే పరిమితమైన అపార్ట్‌మెంట్లు శివార్లకు విస్తరిస్తున్నాయి. దీంతో నగరంలో చాలామంది బిల్డర్ల అవతారం ఎత్తారు. ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి 60+40 పద్ధతిన నిర్మాణాలు చేపట్టారు. అప్పటివరకు స్థానికంగా ఉండే కొందరు ప్రముఖులు బిల్డర్లుగా వ్యవహరిస్తుండగా, తాజాగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పలువురు నగరంలో అపార్ట్‌మెంట్ రంగంలో అడుగుపెట్టారు. దీంతో వారి మధ్య పోటీ పెరిగింది. 50+50 విధానంతో వ్యాపారాలు మొదలయ్యాయి. దీంతో లాభాల కోసం ప్రభుత్వం ఆదేశించిన ప్రమాణాలను విస్మరించి ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించారు. అలాంటి సమయంలో ప్రత్యేక దృష్టిపెట్టి నిబంధనలు పాటించేలా చూడాల్సిన కార్పొరేషన్ అధికారులు ఇదే అదనుగా మామూళ్ల దందాతో రెచ్చిపోయారు. ఒక్కో అపార్ట్‌మెంట్‌లో ఫ్లోర్‌కు రూ.10లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. అధికారుల లెక్కల ప్రకారం

మిగతా 4వ పేజీలో

భవన నిర్మాణ రంగంలో పేరున్న ఓ సంస్థ సమ్మర్ స్టోరేజీ ట్యాంక్-1 వద్ద నిర్మిస్తున్న పాత బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న విల్లాలకు అనుమతుల కోసం భారీగా నొక్కేశారని తెలుస్తోంది.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

వాస్తవానికి 38 ఎకరాలలో 21 మందికి సంబంధించిన ఆ స్థలంలో విల్లాలు నిర్మిస్తుండగా, కేవలం ఇద్దరు ఆస్తులకు మాత్రమే పన్ను విధించి, ఆ స్థలం మొత్తానికి ప్లాన్ ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రూ.కోట్లల్లోనే కార్పొరేషన్ ఖజానాకు గండిపడిందని విజిలెన్స్ విచారణలో తేలినట్లు సమాచారం. అలాగే శర్మా కాలేజీ సమీపంలో నిర్మించిన మరో అపార్ట్‌మెంట్‌లోనూ నిబంధనల ఉల్లంఘనకు ఆయన తనవంతు సహకారం అందించి ఆ యజమానుల నుంచి భారీగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఒంగోలు కమిషనర్‌గా నగర అభివృద్ధి గురించి పట్టించుకోని ఆయన అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. గత కమిషనర్, ఏసీపీ అవినీతి పునాదులు. అక్రమ కట్టడాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం నగరంలో ఇప్పుడు చర్చనీయాంశమైంది

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర మొక్కుబడి

- మొక్కలు నాటడంపై కనిపించని ఉత్సాహం
- మంత్రి స్వామి మినహా కీలక ప్రజాప్రతినిధులు దుమ్మా
- పలుచోట్ల మమ అనిపించిన ఉద్యోగులు


టంగుటూరులో మొక్కను నాటుతున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రతినెలా మూడో వారం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఒక్కో నెలలో ఒక్కో అంశానికి ప్రాధాన్యం ఇచ్చి తదనుగుణంగా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. జిల్లాల్లో మంత్రి స్థాయి నుంచి సర్పంచ్ వరకు, కలెక్టర్ నుంచి సచివాలయ ఉద్యోగి వరకు అందరూ భాగస్వాములు కావాలని ఆదేశించింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో ప్రతినెలా ఏదో ఒక జిల్లాలో పాల్గొంటున్నారు. అలా ఈసారి గ్రీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్దేశించారు. పల్నాడు జిల్లా మాచర్లలో సీఎం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర కీలక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. అందుకోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు కూడా విరామం ఇచ్చారు. అంతటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అంతగా పట్టించుకోలేదు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామితోపాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు అధికారపార్టీ వారు ఉన్నారు. మరో రెండు చోట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిలు అన్ని అధికార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కాగా శనివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ స్వామి టంగుటూరులో పాల్గొన్నారు. కలెక్టర్ రాజాబాబు ఇతర అధికారులు అక్కడ హాజరయ్యారు. జిల్లాలో మిగిలిన ఐదుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలో ఒక్కరు కూడా ఆ కార్యక్రమాన్ని పట్టించుకోలేదు. మరికొందరు అసలు నియోజకవర్గానికే రాలేదు. ఇక వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలు మాత్రం వారి పరిధిలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని వివిధ పట్టణాలు, గ్రామాల్లో పేరుకు ఈ కార్యక్రమం జరిగినా అత్యధిక ప్రాంతాల్లో మొక్కుబడిగానే సాగినట్లు సమాచారం.


ముందస్తుగానే ఇళ్లకు బయల్దేరిన విద్యార్థులు

రేపటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

- వచ్చేనెల 3న పునఃప్రారంభం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలలు తిరిగి అక్టోబరు 3న పునఃప్రారంభం కానున్నాయి. ఎస్సీఈఆర్టీ ప్రకటించిన 2025-26 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలకు ఈనెల 24 నుంచి అక్టోబరు 2 వరకు సెలవులు ప్రకటించారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 22 నుంచి దసరా సెలవులు ప్రకటించారు. గతంలో మన రాష్ట్రంలోనూ దసరా పండుగకు 11 రోజులు సెలవులు ఇవ్వడం అనవాయితీగా వస్తోంది. దీనికి తోడు ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా ఈనెల 22నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కోరారు. వీరి విజ్ఞప్తి మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దసరా సెలవుల్లో మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు మాత్రం ఈనెల 27 నుంచి అక్టోబరు 2 వరకు సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ పాఠశాలలకు తాజా మార్పులతో సెలవులు 9 నుంచి 11 రోజులకు పెరిగినట్లు అయింది.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చీపురు పట్టాల్సిందే

వినూత్న కార్యక్రమం చేపట్టిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

వివరాలు 4వ పేజీలో


వర్షాలకు దర్శిప్రాంతంలో కళకళలాడుతున్న పత్తి పైరు

సాగుకు జీవం

నాలుగు రోజులుగా పలుచోట్ల వర్షాలు

ఒంగోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు సాగుకు జీవం పోశాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి వర్షాలు సజావుగా లేక పంటలు పెద్దగా వేయలేదు. మొత్తం వ్యవసాయ శాఖ పరిధిలో లక్షా 29వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 65శాతం మాత్రమే సాగయ్యాయి. అలా 84వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు కాగా తొలకరిలో వేసిన నువ్వు కోతలు జరిగాయి. సజ్జ కూడా కోస్తున్నారు. ఇక 75 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు పొలంలో ఉన్నాయి. ప్రధానంగా 44 వేల హెక్టార్లలో సాగైన కంది, 7,560 హెక్టార్లలో వరి, 14,500 హెక్టార్లలో పత్తి, 5,706 హెక్టార్లలో మొక్కజొన్న అలాగే మరో పదివేల హెక్టార్లలో మిర్చి ప్రస్తుతం పొలంలో ఉండగా ఈనెల తొలిపక్షంలో సరైన వర్షం లేక ఆ పంటలు కూడా పలుచోట్ల వాడుముఖం పట్టాయి. కొన్నిచోట్ల ఎదుగుదల లోపించింది. ఇంకా చాలా విస్తీర్ణంలో పంటలు సాగు చేయాల్సి ఉంది. ఇలాంటి సమయంలో జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు సాగుకు ఊతమిచ్చాయి. ఈనెలలో ఇప్పటివరకు 76.20 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా అందులో ఈ నాలుగు రోజుల్లోనే 53 మి.మీ పడింది. అందులో కొన్ని మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అలా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పొలంలో ఉన్న పైర్లకు జీవం పోయడమే కాక విస్తారంగా వరి సాగుకు, అలాగే పశ్చిమ ప్రాతంలో పొగాకు నాట్లు వేసేందుకు కూడా ఉపకరించనున్నాయి. మరోవైపు రబీ సీజన్‌లో పంటల సాగుకు వీలుగా రైతులు భూములను సిద్ధం చేసుకునేందుకు ఈ వర్షాలు కలిసొచ్చాయి. ఇదిలా ఉండగా శనివారం పగటి పూట కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం నినాదంతో వైద్య శిబిరాలు
- అన్ని రకాల వైద్య పరీక్షలకు శ్రీకారం



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. స్వస్థ్ నారి సశక్త్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ- శక్తివంతమైన కుటుంబం) అనే నినాదంతో జిల్లాలో వైద్యశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా దీన్ని ప్రారంభించింది. జిల్లాలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యుపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా వైద్యశాలలు, జిల్లా వైద్యశాలలు కలిపి 634 కేంద్రాల్లో వైద్యశిబిరాలను నిర్వహించేందుకు వైద్యశాఖ చర్యలు తీసుకుంది. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే కాకుండా పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి తగుజాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. మరోవైపు ఈ కార్యక్రమం ద్వారా విస్తృతంగా రక్తదాన శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు సమయానుకూల వైద్యసేవలు అందించడంతోపాటు వారు పౌష్టికాహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించడం ద్వారా ఆ కుటుంబాన్ని బలోపేతం చేయనున్నారు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి ఆధారం అనే నినాదంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు. వచ్చేనెల 2వతేదీ వరకు జరగనున్న ఈ ప్రత్యేక శిబిరాల్లో వైద్యనిపుణులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొంటారు. ప్రధానంగా ఈ వైద్యశిబిరాల్లో మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లను పరీక్షల ద్వారా గుర్తిస్తారు. తగిన వైద్య చికిత్సలతోపాటు రెఫరల్ సేవలను అందిస్తారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్సలను అందిస్తారు. గర్భిణులను పరీక్షించి పోషకాహారం ఆవశ్యకతను వివరిస్తారు. రక్తహీనత ఉన్న వారికి చికిత్సలు చేసి ఎంసీపీ కార్డులు అందజేస్తారు. పిల్లల్లో సికిల్‌సెల్ అనీమియా గుర్తించి వారికి అవసరమైన వైద్యసేవలు అందించడంతోపాటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. ఇలా జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళలతోపాటు కిశోర బాలికలను ఈ వైద్య పరీక్షల ద్వారా సంరక్షించేందుకు దోహదపడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి.

'మహిళా మార్ట్' మూతపై విచారణ ప్రారంభం

- రికార్డులు స్వాధీనం చేసుకున్న విచారణాధికారులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌లో అవినీతిపై ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై మెప్మా ఎండీ భరత్‌తేజ్ స్పందించారు. విచారణకు ఆదేశించారు. నెల్లూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలా రాణితోపాటు, నెల్లూరు మెప్మా ఏవో, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన నలుగురు అధికారులను విచారణ అధికారులుగా నియమించారు. వారు శనివారం ఒంగోలు వచ్చి విచారణ ప్రారంభించారు. మార్ట్ ప్రారంభమైనప్పటి నుంచి మూసివేసిన

మిగతా 4వ పేజీలో


విచారణాధికారులను మార్టులో కలిసి న్యాయం చేయాలని కోరుతున్న ఆర్పీలు

గురుకులాలకు రూ.64 లక్షలతో మెడికల్ కిట్లు

- మంత్రి డాక్టర్ స్వామి వెల్లడి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలకు రూ.64 లక్షల విలువైన మెడికల్ కిట్లను అందజేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి గురుకులంతోపాటు, జిల్లాలోని పలు గురుకులాలకు కిట్‌లను మంత్రి స్వామి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గురుకులాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు రాబట్టేవిధంగా అవసరమైన శిక్షణ ఇస్తున్నదన్నారు. దసరా తర్వాత విద్యార్థులకు నీట్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్ల బలోపేతానికి రూ.143 కోట్లతో మరమ్మతులు, రూ.100 కోట్లతో కొత్త భవనాలు నిర్మించామన్నారు. త్వరలోనే మరో రూ.200 కోట్లతో భవనాల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణ పనులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో డీసీవో జయ, డబ్ల్యూహెచ్‌వో శ్రీనివాసాచారి, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


మెడికల్ కిట్లను, పరికరాలను అందజేస్తున్న మంత్రి స్వామి



ఓఎంసీ కమిషనర్‌కు ముఖ్యమంత్రి ప్రశంస

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ఈ వేస్ట్ వ్యర్థాల సేకరణలో రాష్ట్రంలోనే ఒంగోలు ప్రథమ స్థానంలో నిలిచింది. మాచర్లలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా సన్మానించి, అవార్డు అందజేశారు. కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పురపాలక శాఖప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)


చెరువులా కనిపిస్తున్న ఒంగోలులోని ఓ కాలనీ


కొత్తపట్నం బస్టాండ్ రోడ్డు ఇలా..

వానొచ్చెనంటే.. వణుకొస్తదీ..!

గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నగరం చెరువైపోతుంది. ఈ రోడ్డు చూసినా నీటి ప్రవాహమే కనిపిస్తోంది. కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షానికి నగరం నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో ప్రధాన డ్రెయిన్లపై ఆక్రమణలు పెరిగిపోవడం కారణంగా కనిపిస్తోంది. వీటిపై మున్సిపల్ అధికారులు అప్పుడప్పుడూ హెచ్చరికలు చేసి వదిలేయడం మామూలైపోయింది.

- మూసుకుపోతున్న మురుగు కాలవలు
- చినుకు పడితే చెరువవుతున్న నగరం
- ప్రధాన డ్రెయిన్లపై ఆక్రమణలు
- పదేపదే ప్రజలకు తప్పని పాట్లు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధి పెరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కార్పొరేషన్ హోదా కల్పించింది. కానీ అందుకు అనుగుణంగా నగరంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చలేదు. ఒంగోలు మునిసిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి ఇరుకైన కాలవలే కనిపిస్తున్నాయి. వాటిపై ఆక్రమణలు తప్ప మురుగునీరు పారుదల వ్యవస్థ మెరుగుపడటం లేదు. దీంతో ఎప్పటికపుడు తాత్కాలిక పనులకే పరిమితమైపోయాయి. ప్రతి ఏడాదీ ఓపెన్ డ్రెయిన్‌ల నిర్మాణం కోసం రూ.50-60 లక్షల వరకు ఖర్చు చేస్తున్న అధికారులు శాశ్వత పరిష్కార దిశగా ప్రతిపాదనలు చేపట్టడంలో విఫలమౌతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం హయాంలో కనీస ప్రగతి వైపు కన్నెత్తి చూడకపోగా, కొద్దిపాటి వాన కురిసినా నగరం చెరువులా మారిపోతుంది. వర్షాకాలం కావడంతో మురుగునీరు సమస్యను అధిగమించేందుకు అధికారుల ముందస్తు చర్యలు చేపడుతున్నా, పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతంలో పూడిక తీత పనులతో కాలం గడిపేస్తున్న యంత్రాంగం శాశ్వత పరిష్కారం కోసం మురుగునీరు పారుదల వ్యవస్థ మెరుగునకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మెయిన్ డ్రెయిన్‌లన్నీ ఆక్రమణలే..!

నగరంలో కొద్దిపాటి వర్షం కురిసినా రహదారుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. ప్రధాన రోడ్లలో బురదనీరు పేరుకుపోతోంది. దీంతో ప్రజలు పడుతున్న పాట్లు అధికారులకు తెలిసినా ప్రత్యేక దృష్టిసారించి, సమస్య పదే పదే పునరావృతం కాకుండా చూడంలో విఫలమౌతున్నారు. ఆయా వ్యాపార సముదాయల ముందు వాహనాల పార్కింగ్ కోసం, ఫుట్‌పాత్ వ్యాపారాల కోసం కాలువల పైకప్పు మూసివేయడంతో కనీస పారిశుధ్యం, పూడిక తీత పనులు కూడా జరగడం లేదు. కాలువల్లో ఏదైనా వ్యర్థ పదార్థాలు అడ్డుపడి మురుగు రోడ్లపైకి చేరినప్పుడు మొక్కుబడి చర్యగా తాత్కాలిక పారిశుధ్యం నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు కోసం వాటిపై నిర్మించిన ర్యాంప్‌లు, స్లాబ్‌లు, ఇతరత్రా ఆక్రమణలు తొలగించి, వర్షం పడినపుడు సమస్య ఎదురు కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బహిరంగ మద్యపానం చేస్తే చీపురు పట్టాల్సిందే

- వినూత్న కార్యక్రమం చేపట్టిన ఎస్పీ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిలో సత్ప్రవర్తన తీసుకువచ్చేందుకు ఎస్పీ హర్షవర్ధనరాజు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు రెండు రోజులుగా జిల్లా వ్యాప్తింగా క్లీన్అండ్‌గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని అదే ప్రదేశంలో క్లీన్‌అండ్ గ్రీన్ చేయిస్తున్నారు. తాగిన మందు దిగేవరకు ఈ కార్యక్రమం చేయిస్తున్నారు. దీంతోపాటు మందు బాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకూడదంటూ హితవు చెబుతున్నారు. అంతే కాదు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేసిన పోలీసులు అసాంఘిక కార్యక్రమాలను అదుపు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు.

విద్యుత్‌కు అంతరాయం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని మంగమూరు రోడ్డుజంక్షన్ నుంచి మంగమూరు వెళ్లే ప్రాంతంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో విద్యుత్ మెయిన్‌లైన్‌పై చెట్టుకొమ్మలు విరిగిపడటంతో సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేసి కరెంట్‌ను పునరుద్ధరించారు.

విశ్వగురువుగా భారత్

- బీజేపీ రాష్ట్ర నాయకుడు కల్యాణ చక్రవర్తి

ఒంగోలు(విద్య),సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషితో భారతదేశం ప్రపంచంలో విశ్వగురువుగా ఆవిర్భవించిందని బీజేపీ రాష్ట్ర సెల్స్ కోకన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ చక్రవర్తి తెలిపారు. ప్రధాని మోదీ జన్మదినాని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాలలో భాగంగా స్థానిక క్విస్ ఇంజనీరింగ్‌కళాశాలలో శనివారం మేధావుల సదస్సు నిర్వహించారు. సదస్సుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సూర్యకల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రధాని మోదీ ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్రనాయకులు కె.నరసింగరావు, ఇందిరాప్రియదర్శిని లా కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ రామకృష్ణ ,జిల్లా మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు

డీఏవోకు విచారణ నివేదిక అందజేత

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): గతంలో ఉలిచి గ్రామ వ్యవసాయ సహాయకుడిగా పని చేసిన ఈ.బాలకృష్ణ రైతుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేసిన సంఘటనపై విచారణ పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ బండ్లమూడి రమేష్‌బాబు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో రమేష్‌బాబు మాట్లాడుతూ ఆ విచారణ నివేదికను జిల్లావ్యవసాయ శాఖ అధికారికి అందజేసినట్లు తెలిపారు. ఉలిచి గ్రామ వ్యవసాయ సహాయకుడుగా పనిచేసిన బాలకృష్ణ ఉలిచి, టీవీపాలెం, వలేటివారిపాలెం, చేజర్ల ,ఆలూరు గ్రామాల రైతులకు వ్యవసాయ పరికరాలు ఇప్పిస్తానని రూ. 5,30,560 లు వసూలు చేసినట్లు తెలిపారు. మొత్తం 12 మంది రైతుల నుంచి ఈ నగదు వసూలు చేసినట్లు విచారణలో రైతులు చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఉలిచి గ్రామంలో విచారణలో రైతుల నుంచి వ్యవసాయపరికరాలకు నగదు వసూలు చేసినట్లు రైతులు లిఖితపూర్వకంగా ఇచ్చినట్లు తెలిపారు. నివేదికను పరిశీలించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ రెవెన్యూసహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఒంగోలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో వివేకానంద మాట్లాడుతూ గత ఎన్నికలముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి అమలు చేయని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినా ఏ సమస్యనూ పరిష్కరించలేదన్నారు.

కలెక్టర్‌ను సత్కరించిన సత్య



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజాబాబును మారిటైం బోర్డురాష్ట్ర చైర్మన్ దామచర్ల సత్య సత్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సత్య శనివారం కలెక్టర్ రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన్ను శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్‌తో సత్య చర్చించారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి

పొన్నలూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.నారాయణ శనివారం వెలుగు కార్యాలయంలో తెలిపారు. అయన మాట్లాడుతూ ఆర్థిక ఎదుగుదలకు స్త్రీ నిధి రుణాలు ఉపయోగపడతాయని, గతంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన 20 సూత్రాల అమలు చైర్మన్ దినకర్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాజాబాబును 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజాబాబును దినకర్ శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు. ఒక ఏడాదిలో మొదటి దశ పనులు పూర్తి చేయడం ద్వారా లక్షా 30వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు అందించే లక్ష్యంతో పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్‌తో దినకర్ చర్చించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గ్రామాలు

- మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామి ● టంగుటూరులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు హాజరు ● పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు



ర్యాలీలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు తదితరులు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛగ్రామాలు, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు పంచాయతీ పరిధిలోని బాపూజీ కాలనీలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, స్థానికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలోని రోడ్ల వెంట, ఇళ్ల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. అందులో భాగంగా ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. ప్రజలు ప్రభుత్వ లక్ష్యాన్ని అర్థం చేసుకుని భాగస్వాములై ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ వైపు సాగాలని మంత్రి స్వామి పిలుపునిచ్చారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ అనే నినాదాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం నా ఇల్లు, నా వార్డు, నా గ్రామం, నా మండలం, నా జిల్లా, నా రాష్ట్రం, నా దేశం పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉండాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భావితరాల వారి ఆరోగ్యం, వారికి మంచి భవిష్యత్‌ను అందించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం క్లాప్ మిత్రలతో కలిసి మంత్రి, కలెక్టర్, అధికారులు ఫొటోలు దిగారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, టీడీపీ మండల అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, టంగుటూరు మండల నాయకులు బెల్లం జయంత్‌బాబు, కామని విజయ్‌కుమార్, జెజవాడ వెంకటేశ్వర్లు టంగుటూరు గ్రామ సర్పంచ్ మమత మండల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హక్కుల సాధనకు మరో జాతీయ ఉద్యమం

- ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన ● యూనియన్ మహాసభలో జాతీయ కార్యదర్శి సింధు పిలుపు


మహాసభలో మాట్లాడుతున్న ఏఆర్.సింధు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల హక్కుల సాధనకు మరో జాతీయ స్థాయి ఐక్య ఉద్యమాలకు పోరాటం చేపట్టాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరుగుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ 11వ రాష్ట్ర మహాసభల సందర్భంగా శనివారం స్థానిక కాపు కల్యాణ మండపంలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి అధ్యక్షతన జరిగిన సభలో సింధు మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడేళ్ల కాలంలో అంగన్‌వాడీలు చేపట్టిన ఉద్యమం ఎన్నో ఫలితాలను సాధించిందన్నారు. ఎస్మా వంటి నిర్బంధాలను ఎదురొడ్డి 42 రోజుల పాటు మిలిటెంట్ ఉద్యమం చేపట్టిన సంఘ పోరాటం స్ఫూర్తి అభినందనీయమన్నారు. పోరాట ఫలితంగానే అనేక జీవోలను సాధించినట్టు తెలిపారు. జూలై 9న గుజరాత్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన ఫలితంగా అంగన్‌వాడీలకు రూ.26వేలు, హెల్పర్లకు రూ.26వేలు కనీస వేతనం సాధించినట్టు పేర్కొన్నారు. అయినా ఆంధ్రప్రదేశ్‌తో సహా పలురాష్ట్రాల్లో అంగన్‌వాడీల శ్రమకు తగినవేతనం లభించడం లేదన్నారు. అంతకు ముందు రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి సంఘం పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కారుసాల సుబ్బరావమ్మ, సీహెచ్ నరసింగరావు, వి.ఉమామహేశ్వరరావు, కే ధనలక్ష్మీ, కాలం సుబ్బారావు పాల్గొన్నారు.

రైళ్లలో తనిఖీలు

- 855 గ్రాముల గంజాయి స్వాధీనం ● యువకుడి అరెస్టు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తు న్న సమయంలో 855 గ్రాముల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు రైల్వే సీఐ ఎస్‌కె.మౌలా షరీఫ్ తెలిపారు. శనివారం ఉదయం రైల్వేపోలీసు స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఈగల్ టీమ్, ఆర్పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బందితో కలిసి రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ బోగిలో ప్రయాణిస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన అబ్దుల్ అదుత్ షైక్ చిన్న చిన్న గంజాయి ప్యాకెట్లు కట్టి బ్యాగ్‌లో పెట్టుకొని ప్రయాణిస్తుండగా 855 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ రూ. 10 వేలు ఉంటుందని అన్నారు.

జాతీయస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

సింగరాయకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ జడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థినులు ఇరువులు జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి చదవుతున్న పి.సుప్రియ, ఎం.నిహారిక ఈ నెల 13, 14 తేదీల్లో విశాఖపట్నం ఆరివాలో జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా తరుపున ఉత్తమ ప్రదర్శనను కనబరిచారు. త్వాదారా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెలలో 26 నుంచి 30 వరకు మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను శనివారం హెచ్‌ఎం కె.మహాలక్ష్మి వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, లావణ్య అభినందించారు.

కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలి

- మంత్రి స్వామికి 'ఉపాధి' క్షేత్ర సహాయకుల వినతి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు నెలకు కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని క్షేత్ర సహాయకులు మంత్రి స్వామికి విజ్ఞప్తి చేశారు. శనివారం టంగుటూరులోని బాపూజీ కాలనీలో జరిగిన కార్యక్రమానికి హాజరైన మంత్రి స్వామిని కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. నైపుణ్యంలేని గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పిస్తూ గ్రామ పంచాయతీల్లో సుస్థిర, శాశ్వత వనరుల అభివృద్ధికి తాము కృషి చేస్తున్నామని వారు పేర్కొన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బదిలీ సౌకర్యం, అర్హత ఉన్న వారికి ఉద్యోగోన్నతి, బీమా కల్పించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు పి.జాన్‌బాబు, కె.శ్రావణి, వంశీకృష్ణ, ఎ.వెంకట్, రామారావు, పవన్ తదితరులు ఉన్నారు.

అన్నగారంటూ... దోచేశారు!

(3వ పేజీ తరువాయి)

ఇప్పటివరకు నగరంలో వెయ్యికిపైగా అపార్ట్‌మెంట్‌లు ఉండగా, సగానికిపైగా 'అన్నగారు' అనుమతులిచ్చినవే అని తెలుస్తోంది. మరోవైపు డీకే పట్టాలలో బిల్డింగ్ నిర్మాణాలకు ప్లాన్ పొందే అవకాశం లేకపోవడంతో వాటిని ఆసరాగా చేసుకుని నేరుగా ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు సమాచారం. మొత్తంగా ఒంగోలులో గత వైసీపీ పాలనలో కమిషనర్‌గా పనిచేసిన అధికారి, ఆయనకు సహకరించిన వారు భారీగానే దోచుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అపార్ట్‌మెంట్‌ల నుంచి ఆసుపత్రుల వరకు

అన్నగారు పలు ప్రభుత్వ శాఖల్లో కీలక అధికారిగా ఇరవై ఏళ్లకుపైగా ఒంగోలుతోపాటు, చుట్టుపక్కల మండలాల్లోనే పనిచేసిన అనుభవం ఉంది. ప్రజలతో సత్సంబంధాలు కూడా బాగానే ఉన్నాయి. దీంతో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన పెద్దలు కనిపిస్తే కాళ్ళ మీద పడటం, పలకరిస్తే అన్నగారూ అంటూ అందరినీ మాయ చేయడంలో దిట్ట అని అందరికీ తెలిసిన విషయం. దీంతో వైసీపీ హయాంలో ఆయనకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. అపార్టుమెంట్ల నుంచి ఆసుపత్రుల వరకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేశారు. వైసీపీ పెద్దలు, ప్రజాప్రతినిధుల ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతో వారి ఆదేశాలు రావడం ఆలస్యం, అదే అవకాశంగా భారీగానే గుంజేసేవారని తెలుస్తోంది. అందులోభాగంగానే పెళ్లూరు వైపు వెళ్లే జాతీయ రహదారిలో ఓ ఆసుపత్రికి అనుమతులు ఇవ్వడంతోపాటు, నెల్లూరు బస్టాండ్‌లోని ఓ పేరున్న హోటల్‌కు ఆయన ఆశీస్సులు పుష్కలంగానే ఉన్నాయని తెలుస్తోంది.

మహిళా మార్ట్ మూతపై విచారణ ప్రారంభం

(3వ పేజీ తరువాయి)

తేదీ వరకు సరుకుల కొనుగోలు, రోజువారీ అమ్మకాలు, లాభనష్టాలతోపాటు, ఇతర బ్యాంకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. క్రయ విక్రయాలు, బ్యాంకుల్లో జమ చేయడం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయనున్నారు. దీంతో మార్ట్ అవినీతిలో భాగస్వాములైన వారిలో కలవరం మొదలైంది. ఇదిలా ఉండగా పొదుపు సభ్యులు మార్టు కోసం చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఆర్పీలు విచారణ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- 72మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య సంరక్షణకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం సాయంత్రం తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో అర్హులైన 72మంది లబ్ధిదారులకు 46,06,737 రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలెవరూ అనారోగ్యం కారణంగా ఆర్థికంగా దెబ్బతిన కూడదన్న మంచి సంకల్పంతో సీఎం చంద్రబాబు సాయం అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ప్రజాప్రభుత్వం వచ్చాక 817 మందికి రూ.6 కోట్లా 95 లక్షలా 28వేల 782 సీఎంఆర్‌ఎఫ్ నిధులను అందించామన్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా వసతి కల్పిస్తున్నదన్నారు.

వచ్చేనెల 5లోపు దరఖాస్తుచేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి పండుగకు బాణసంచా విక్రయించేందుకు ఆసక్తి ఉన్న వ్యాపారులు తాత్కాలిక క్రాకర్స్ లైసెన్సుల కోసం ఆదివారం నుంచి వచ్చేనెల 5వతేదీలోపు మీసేవ కేంద్రాలు, గ్రామ,వార్డు సచివాలయ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేశు కోరారు. స్థానిక డీఆర్వో చాంబర్‌లో శనివారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు నగరంలో దుకాణాలకు నగర పాలక సంస్థ దుకాణాలకు నెంబర్లు కేటాయిస్తారన్నారు. మార్కాపురం, కనిగిరి, చీమకుర్తి, దర్శి, గిద్దలూరులలో కమిషనర్లు, ఇతర ప్రాంతాల్లో తహసీల్దార్లు కేటాయిస్తారన్నారు. దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల 18నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు బాణసంచా అమ్మకాలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థిని ఆందోళన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినికి ఒంగోలులోని ఒక జూనియర్ కాలేజీ యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేయడాన్ని నిరసిస్తూ తన తల్లితో కలిసి శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపింది. అదనపు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆ విద్యార్థిని ఆరోపించారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియేట్ ఆర్‌ఐవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని చేపట్టిన ఆందోళనకు ఎస్ఎఫ్ఐ నాయకులు వీరస్వామి, వినోద్, రాజశేఖర్, కార్తీక్‌రాజులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్యాస్ సబ్సిడీ జమయ్యేలా చూడాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ పథకంలో లబ్ధిదారులకు సబ్సిడీ త్వరగా జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శనివారం జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 3,070 మంది లబ్ధిదారులకు సబ్సిడీ రాలేదని గుర్తించామన్నారు. వారికి ఎందుకు రాయితీ జమ కావడం లేదో లబ్ధిదారులకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేయాలని సూచించారు. గ్యాస్ ఏజెన్సీల్లో ఏదైనా సమస్య ఉంటే త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో పద్మశ్రీ, ఐవోసీఎల్ సేల్స్ అధికారి రోహితాష్ బోగార్య, ఎల్‌డీఎం రమేష్, సహాయ పౌరసరాల అధికారి పుల్లయ్య ఉన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

సింగరాయకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో డి.జయమణి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుభాషిణి, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పేదలకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న విజయవాడలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల అంజనేయులు డిమాండ్ చేశారు, స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన సంఘం సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ప్రభుత్వం భూసేకరణ చేసిన ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో సాగుకు యోగ్యంగా మార్చి సాగు దారులకు పంపిణీ చేయాలన్నారు. ఆయా సమస్యలపై ఈనెల 24న జరిగే ధర్నాను విజయవంతంచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కేజీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య, ఉబ్బా వెంకటేశ్వర్లు, వేసపోగు మోజేష్, కే మాల్యాద్రి, జాలా అంజయ్య, తన్నీరు సుజాత, ఈదర సుబ్బారావు, శేషారావు తదితరులు ఉన్నారు.

సాయిబాబా స్కూలు విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండేందుకు సాయిబాబా సెంట్రల్ స్కూలులో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులు శనివారం కొండల అధిరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మందికి పైగా విద్యార్థులు యరజర్లకొండనుంచి మర్లపాడు కొండల మీదుగా కొణిజేడు కొండలను అధిరోహించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఇలాంటి క్షేత్ర స్థాయి పర్యటనలు విద్యార్థులకు సాధారణ దినచర్యనుంచి విరామాన్ని కలిగించడమే కాకుండా సమాజంలో పదిమందితో ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల కరస్పాండెంట్ జీవీ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశిలక్ష్మి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మనిషి ప్రశాంత వాతావరణంతో జీవనం సాగించాలని, ఉద్వేగాలకు లోనైతే సమస్యలు జఠిలమవుతాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఏ భారతి అన్నారు. శనివారం గిద్దలూరు పట్టణంలోని సబ్ జైలును ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా విచారణలో ఉన్న, డ్రంకెన్ డ్రైవ్‌లో శిక్ష పడిన ఖైదీలతో ఆమె మాట్లాడారు. న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు నేరాలకు కారణమవుతాయని, తద్వారా కుటుంబసభ్యులు ఎంతో వేదన చెందుతారని తెలిపారు. ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆమె ఆరా తీశారు. జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీంషరీఫ్, గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కె.భరత్‌చంద్ర, జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనరేజి వసూలు ప్రైవేటుపరంపై

ఫ్యాక్టరీ ఓనర్ల ఆందోళన

చీమకుర్తి,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):గ్రానైట్ క్వారీలనుంచి సీనరేజి వసూలు చేసే బాధ్యతను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయటంపై గెలాక్సీ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది.సీనరేజి వసూలు హక్కులను ఏఎంఆర్ సంస్థ దక్కించుకుంది.అక్టోబర్ 1నుంచి వసూలు చేసేవిధంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేసుకుంటోంది.మరో వైపు వసూలు చేసే కార్యక్రమానికి అంకురార్పణ కాకుండానే గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు ఆందోళన బాట పట్టడం గమనార్హం. శనివారం రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.దాదాపు ఐదువందల మందికి పైగా ఓనర్లు ఈ సమావేశానికి హాజరయ్యారంటే వీరి భయాందోళనలు ఏమేరకు ఉన్నాయే అర్థమవుతోంది. సీనరేజి హక్కులు దక్కించుకున్న సంస్థ ఇతర జిల్లాల్లో మాదిరిగా ఇక్కడా వసూలు మొదలుపెడితే ఫ్యాక్టరీలు మూతవేసి ఆందోళన బాట పట్టాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఆళ్ల రవి,కాట్రగడ్డ రమణయ్య,యద్రగుంట్ల శ్రీనివాసరావు,లగడపాటి శ్రీనివాసరావు,మలినేని వెంకటేశ్వర్లు,మస్తాన్‌రెడ్డి, చంద్రారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనసభలో శాసనసభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఛైర్మన్, సీనియర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పీ కృష్ణయ్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని జైశ్రీకృష్ణ బీసీ సమితి వ్యవస్థాపకులు, ద్రావిడ దేశం కృష్ణారావు డిమాండ్ చేశారు. స్థానిక సమితి కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను కించపర్చే విధంగా వ్యాఖ్యలు చేసిన బోండాపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యాదవ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ళ గోపీకృష్ణ, బీసీ సంఘం అధ్యక్షుడుచిరంజీవి, నాయకులు ఉన్నారు.



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో లోక కల్యాణ మేళా పథకం అవగాహన కార్యక్రమాన్ని శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ శ్రీహరి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే దామచర్ల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పొదుపు మహిళ మరింత ఆర్థికంగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లోక కల్యాణం మహిళలకు మరింత ప్రయోజనకరం అన్నారు. అలాగే వీధి వ్యాపారులు కూడా అవసరమైన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీడీ శ్రీహరి మాట్లాడుతూ పొదుపు సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తుందన్నారు. అందుకోసం జిల్లాలో లక్ష్యాలను చేరుకుని పొదుపు మహిళలకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు, పలువురు మెప్మా సీవోలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.


లోక కల్యాణ మేళా పథకం అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ తదితరులు

సీఎంఆర్ఎఫ్‌తో ఆరోగ్య భరోసా

పేదల ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తెలిపారు. శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు రూ. 20.38 లక్షల నగదు చెక్కులను అందజేశారు. అలాగే మత్స్య భరోసా పథకం కింద 30 మంది లబ్ధిదారులకు రూ. 10.35 లక్షల విలువ చేసే ట్రాన్స్ ఫౌండర్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే కఠిన చర్యలు

మద్దిపాడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు హెచ్చరించారు. శనివారం ఏడుగుండ్లపాడు వద్ద ఆయన వాహనాల తనిఖీ చేపట్టి హెల్మెట్ లేని 15 మంది వాహనదారులకు జరిమానా విధించారు. ఎస్సై వెంకట సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.




పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసిన తెలుగు మహిళా నేతలు,నాయకులు

ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పేదలకు నిత్యావసరాల పంపిణీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్‌కుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని ముందస్తుగా శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద తెలుగు మహిళా నాయకురాలు ఆరికట్ల సుమతి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు కేక్‌కట్ చేసి బీఎన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలుగు మహిళా నాయకురాలు ఆరికట్లసుమతి పలువురు పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు అధ్యక్షత వహించగా మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు మండలపార్టీ ఉపాధ్యక్షుడు మల్లవరపు రామకృష్ణారెడ్డి, గుమ్మళంపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొడ్డపాటి చంద్రశేఖర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోపి, నాయకులు నల్లూరిగోపి, చౌదరి, మాధవి, హరినాథ్, తిరుపతి స్వామి, డ్వాక్రాసంఘం మహిళలు పాల్గొన్నారు.


వికసిత్ భారత్ యువతతోనే సాధ్యం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ సాధనలో యువత చురుకైన పాత్రపోషించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ హర్షిణీ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జేసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అవరణలో జాయింట్ కలెక్టర్ మొక్కలు నాటారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, డీన్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.















ఆంధ్రజ్యోతి

ఆదివారం 21 సెప్టెంబరు 2025 ప్రకాశం 4 పేజీలు





'ఇటు ప్రజలు.. అటు పార్టీ శ్రేణులు! అందరికీ దగ్గర కావాలి.. వారితో అనుబంధం పెంచుకోవాలి! ప్రతి ఒక్కరికీ ఏదోరూపంలో చేయూతనివ్వగలగాలి! అవకాశం ఉన్న మేర నిధులు సమకూర్చుకొని అభివృద్ధిని సాధించాలి! తద్వారా మంచి మెజారిటీతో గెలిపించిన ప్రజలు, పార్టీ శ్రేణుల రుణం తీర్చుకోవాలి'.. ఇదీ ఏడాదిన్నర క్రితం గెలుపొందిన తర్వాత సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ నిర్దేశించుకున్న లక్ష్యం. తదనుగుణంగా ఆయన గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. నాటి తప్పుఒప్పులను ఎప్పటికప్పుడు మననం చేసుకుంటున్నారు. వీలైనంత మేరకు గత కాలపు పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగానే ఈ విడత తొలి అడుగు దిగ్విజయంగా వేయగలిగారు. అనేక అంశాల్లో ఆ విషయం నిరూపితమైంది. తొలి ఏడాదిలో 350 రోజులు ఆయన నియోజకవర్గంలో ఉండటాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. తద్వారా తాను అనుకున్న విధంగా ఎక్కువ మంది సామాన్య ప్రజలను, పార్టీ శ్రేణులను కలవగలిగారు. వారి ఈతిబాధలు వినగలిగారు. అందుకే సామాన్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ లాంటి చేయూత కార్యక్రమాలు అధికంగా అందాయి. పార్టీ శ్రేణుల్లో నిఖార్సుగా పనిచేసిన వారిలో కొందరికి పదవులు లభిస్తే, మరికొందరికి పనులు దక్కాయి. అందువల్లనే గతంలో మాదిరి నియోజకవర్గ టీడీపీలోనూ, కూటమి పార్టీల మధ్య అసంతృప్తులు, అలజడులు పెద్దగా కనిపించడం లేదు. సంక్షేమ పథకాలకు తోడు అభివృద్ధి పనుల సాధనలోనూ బీఎన్ ముందువరుసలో ఉన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యంతో దెబ్బతిన్న ఎన్నో రోడ్లు బాగుపడటమే కాక కొత్త రోడ్ల నిర్మాణం, ఉన్నవాటి అభివృద్ధి ప్రారంభమైంది. నాలుగు మండలాల్లో అనేక గ్రామాలను కలుపుతూ ఒంగోలు-నంద్యాల రహదారి నుంచి ఒంగోలు-దిగమర్రు రహదారి వరకు రోడ్డు అభివృద్ధికి పునాది పడింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే దశాబ్దకాలంగా స్థానిక అభివృద్ధికి వినియోగించని మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం పలికారు. ఒంగోలు కార్పొరేషన్‌లో అంతర్భాగమైన తన నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేషన్ నిధులు విడుదల చేయించారు. ఇలా ప్రజా సంబంధాలను మెరుగుపర్చుకుంటూ అభివృద్ధి సాధనలో విజయ్‌కుమార్ ముందడుగు వేస్తున్నారు. గతం కన్నా మిన్నగా ప్రభుత్వంలో, పార్టీలో పెద్దలతో మంచి సంబంధాలు కొనసాగించడమే కాక వారి మన్ననలు పొందగలగడం విశేషం. అందుకే కాబోలు ఆయన పుట్టినరోజున ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బంది కల్గించకూడదన్న ఉద్దేశంతో నియోజకవర్గానికి దూరంగా ఉంటారని తెలిసినా ఈ పర్యాయం ఆయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు పార్టీ శ్రేణులతోపాటు సాధారణ ప్రజలు కూడా పోటీ పడుతున్నారు.

విజయకుమార్

చీమకుర్తి టూ మద్దిరాలపాడు రోడ్డుకు పునాది

- కారుమంచి మేజర్ అభివృద్ధి
- మినరల్ ఫండ్ వాటా నిధులపై ప్రత్యేక దృష్టి
- వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్



సీఎం చంద్రబాబుకు నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ (ఫైల్)

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్ కుమార్ వ్యూహాత్మక అడుగులు అభివృద్ధి సాధనలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఆయన కృషి కారణంగా ఒంగోలు-నంద్యాల రహదారిలోని చీమకుర్తి నుంచి ఒంగోలు-దిగమర్రు జాతీయ రహదారిలోని మద్దిరాలపాడు వరకు రోడ్డు అభివృద్ధికి అడుగు ముందుకు పడింది. మూలనపడ్డ మినరల్ ఫండ్‌ను స్థానిక ప్రాంతాల అభివృద్ధికి వినియోగించడం, ఒంగోలు కార్పొరేషన్ సాధారణ నిధులను తన నియోజకవర్గానికి సాధించుకోవడం, సాగునీటి అవసరాలు తీర్చడంపై ప్రత్యేక దృష్టి సారించి విజయం సాధించారు. కారుమంచి మేజర్ కాలువ అభివృద్ధి, గుండ్లకమ్మ నీటి వినియోగం కోసం దిగువ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలకు చర్యలు తీసుకోవడాన్ని ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. సంతనూలపాడు నియోజకవర్గంలో ఆరంభం నుంచి ఇప్పటి వరకు ఏ ఎన్నికల్లోనూ, ఏ అభ్యర్థికి దక్కనంత భారీ అధిక్యంతో గత ఎన్నికల్లో విజయ్‌కుమార్ గెలుపొందారు. ఎవ్వరూ ఊహించని విధంగా 30 వేలకుపైన మెజారిటీ ఆయనకు దక్కింది. దానికితోడు వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని కూడా త్యజించి రాజకీయాలకే పరిమితం కావాలనుకున్న విజయ్‌కుమార్ ప్రజాసేవ పట్ల అంకితభావాన్ని మరింత పెంచుకున్నారు. ప్రజాసేవలో పార్టీ రహితంగా ముందుకుపోతున్న ఆయన సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాలకు శ్రీకారం పలికారు. హంగు, ఆర్భాటాలకు దూరంగా సాధారణ ప్రజలను కలవడం, రాజకీయాలకతీతంగా వారికి లేక వారి కుటుంబాలకు చేయూత నివ్వడం ద్వారా శాశ్వత అనుబంధాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో అభివృద్ధి అంశాలకు అవసరమైన ప్రాధాన్యం ఇస్తున్నారు.

నాలుగు మండలాల పరిధిలో లింక్ రోడ్లు

గత ప్రభుత్వ కాలపు చిహ్నాలుగా మిగిలిన గుంతల రోడ్ల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో

'విజయ'కుమార్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యం ఇచ్చిన విషయం విదితమే. అందులో భాగంగా నియోజకవర్గంలో కీలకమైన ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులు జరిగాయి. ఇదేసమయంలో గ్రామాల్లోని రోడ్లు, గ్రామాల మధ్య లింక్ రోడ్ల అభివృద్ధికి విజయ్‌కుమార్ ప్రాధాన్యం ఇచ్చారు. అందులో భాగంగా నాలుగు మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలకు ఉపయోగపడే రహదారి అభివృద్ధికి ఆయన చర్యలు తీసుకొన్నారు. ఒంగోలు, నంద్యాల రాష్ట్రీయ రహదారిలో ఉన్న చీమకుర్తి నుంచి ఆ మండలం, సంతనూతలపాడు మండలంలోని గ్రామాల నుంచి మద్దిపాడు మండలం వరకు, అక్కడ చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిని కలిపి బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామాల నుంచి ఒంగోలు-దిగమర్రు రహదారి వరకు నిర్మాణం ద్వారా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. ఆ రహదారి అభివృద్ధి చేయకపోతే ఆ నియోజకవర్గంలోని అయా మండలాల ప్రజల కలయిక, రవాణా కానీ జిల్లా కేంద్రమైన ఒంగోలు ద్వారానే జరగాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజయ్‌కుమార్ పరిస్థితిని వివరించారు. రహదారి అభివృద్ధికి ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు సవివరమైన సర్వేకు శ్రీకారం పలికారు.

మినరల్ ఫండ్ వినియోగంపై ప్రత్యేక దృష్టి

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్ నిక్షేపాలకు నియోజకవర్గంలోని చీమకుర్తి ప్రాంతం నిలయంగా ఉన్న విషయం విదితమే. దీనిద్వారా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో కొంతమేర స్థానిక సంస్థల అభివృద్ధికి కేటాయిస్తారు. సదరు నిధులను వీలైనంత మేరకు రాష్ట్ర ప్రభుత్వం, అంతోఇంతో మిగిలితే జిల్లా యంత్రాంగం తమ ఖాతాలో జమ చేసుకొని కొద్దిమేర మాత్రమే స్థానిక అభివృద్ధికి వినియోగించడం జరుగుతోంది. గడిచిన వైసీపీ ప్రభుత్వంలో అయితే ఆ నిధులను స్థానిక అభివృద్ధి పనులకు వినియోగించిన దాఖలాలు లేవు. ఆ ఖాతాలో ఉన్న నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంది. కాగా విజయ్‌కుమార్ ఎమ్మెల్యే అయిన తర్వాత స్థానిక సంస్థలకు దక్కాల్సిన సీనరేజీ అమౌంట్‌పై దృష్టి సారించారు. ఒక ఖాతాలో రూ.10 కోట్లు, మరో ఖాతాలో రూ.20 కోట్లు స్థానిక సంస్థలకు దక్కాల్సిన అవసరాన్ని గుర్తించారు. వెంటనే అయా ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఒత్తిడి పెంచారు. తదనుగుణంగా ఆ నిధుల వినియోగానికి అవసరమైన అభివృద్ధి పనులను ఎంపిక చేశారు. రూ.5 కోట్లు మండల కేంద్రమైన సంతనూతలపాడు అభివృద్ధి పనులకు, రూ.20 కోట్ల చీమకుర్తి రూరల్ మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా నుంచి రాష్ట్రం వరకు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి స్థానిక సంస్థల అభివృద్ధి పనులకు మినరల్ ఫండ్ వినియోగంలోకి తెచ్చిన నేతగా గుర్తింపు పొందుతున్నారు. అదేవిధంగా పేర్నమిట్టతోపాటు మరికొన్ని తన నియోజకవర్గంలోని ప్రాంతాలు ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. ఆ ప్రాంతాల అభివృద్ధి పనులకు ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని నిధులు రాబట్టడంలో సఫలీకృతులయ్యారు. ఇటు తన నియోజకవర్గ పరిధిలోనూ, అటు ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఉన్న పేర్నమిట్ట సమీప ప్రాంతాల అభివృద్ధి పనులకు ఒంగోలు కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.5కోట్లు మంజూరు చేయించుకోగలిగారు. ఇలా ప్రభుత్వపరంగానే కాక స్థానికంగా అయా వనరుల ద్వారా లభించే నిధులు కూడా గుర్తించి రాబట్టుకొని నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించుకోవడంలో దిట్టగా పేరొందారు.

కారుమంచి మేజర్ అభివృద్ధికి ప్రత్యేక కృషి

నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధికి కృషి చేస్తున్న విజయ్‌కుమార్ కారుమంచి మేజర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ కాలువ అభివృద్ధి ద్వారా ఆయకట్టుకు, అలాగే తాగుకు సక్రమంగా నీరందించవచ్చని భావించారు. అయితే గ్రానైట్ యజమానుల నుంచి అధికారుల ద్వారా సాగునీటి కాలువ అభివృద్ధికి ఆటంకాలు ఎదురయ్యాయి. విజయ్‌కుమార్‌పై ఒత్తిళ్లు పెరిగాయి. కానీ రైతుల ప్రయోజనం కోసం ఎస్ఎస్‌పీ కాలువను అభివృద్ధిపర్చడానికి ఆయన పూనుకొన్నారు.

జనంతో మమేకం.. వ్యక్తిగత సాయానికి ప్రాధాన్యం

- 15 మాసాలలో రూ.3 కోట్లపైగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత
- నిత్యం కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో
- గ్రామాల్లో విస్తృత పర్యటనలు
- నామినేటెడ్ పదవులలో సీనియర్లకు పెద్దపీట, పనిచేసిన వారికి గుర్తింపు
- అభివృద్ధి అంశాలపైనే దృష్టి
- ప్రజల్లో ఆదరణ పెంచుకొంటున్న ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్

ఒంగోలు, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటం.. పార్టీ శ్రేణులు, నాయకులతో సమన్వయం.. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టపడి పనిచేసిన వారికి ప్రత్యేక ప్రాధాన్యం.. వీటన్నింటితోపాటు పేద కుటుంబాలకు వ్యక్తిగత సాయం అందించడం ద్వారా నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజల్లో ఆదరణ పెంచుకొంటున్న నేత సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్. వరుస పరాజయాలు ఎదురైనా, తనకు అండగా పెద్దదిక్కుగా ఉన్న ముఖ్యనేత వేరే పార్టీలోకి వెళ్లినా, ఇతర కొందరు నేతల నుంచి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా అదరక, బెదరక టీడీపీని అంటిపెట్టుకొని ఉన్నారు. ఆర్థిక భారాన్ని అత్యధిక భాగం వ్యక్తిగతంగానే భరించి గత అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 30 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా గడిచిన 15 మాసాలలో మరింతగా ప్రజల ఆదరణ పొందుతున్నారు. పలు నియోజకవర్గాలకు, ఇతర ఎమ్మెల్యేలకు భిన్నంగా గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నిత్యం ఒంగోలులోని తన కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలలో అవసరమైన మేర వివిధ స్థాయిలలోని పార్టీ నేతలకు ప్రాధాన్యం ఇచ్చి సమన్వయంతో సాగుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో కొద్ది గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు వస్తున్న సమాచారం అధికార యంత్రాంగానికి అందగా ఆ కార్యక్రమాన్ని సంతనూలపాడు నియోజకవర్గంలో ఏర్పాటుకు అత్యధికులు మొగ్గుచూపారు. వారికి సంపూర్ణంగా సహకరించి సీఎం సభను విజయవంతంగా నడిపించడంలో బీఎన్ ప్రత్యేక కృషి చేశారు. తద్వారా పలు ప్రభుత్వ కార్యక్రమాలను జిల్లా స్థాయిలో ఆ నియోజకవర్గం నుంచే ప్రారంభించేందుకు నాటి కలెక్టర్ మొగ్గు చూపేవారు. నిత్యం తన కార్యాలయంలో అందుబాటులో ఉండి వివిధ పనుల కోసం వచ్చే వారి వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో పేదలకు తీవ్ర ఆర్థిక భారంగా ఉన్న వైద్య అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ 15 మాసాల కాలంలో సుమారు నాలుగు కోట్ల రూపాయలు మేర సీఎం సహాయ నిధి నుంచి రాబట్టారు. ఆ మొత్తాలను లబ్ధిదారుల గ్రామాలకు, ఇళ్లకు వెళ్లి అందించే వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 14 నుంచి 17 వరకు నాలుగు రోజుల్లో నియోజకవర్గంలోని సుమారు 70కిపైగా గ్రామాలలో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు తిరిగి 394 మంది లబ్ధిదారులకు రూ.2.23 కోట్ల మేర ఇంటింటికీ వెళ్లి ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే బీఎన్‌కు దక్కుతుంది.



మద్దిరాలపాడులో సీఎం, మంత్రులతో సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ (ఫైల్)

ప్రభుత్వం వద్ద అభివృద్ధి పనులకు నిధులు కొరత ఉన్నప్పటికీ స్థానికంగా అందుబాటులో ఉండే డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్), ఉపాధి పథకం మెటీరియల్ నిధులు, ఇరిగేషన్‌లో రెగ్యులర్ నిర్వహణ నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సఫలీకృతులయ్యారు. ప్రాధాన్యత గల పనులను సీఎం, ఇతర మంత్రుల దృష్టికి తీసుకెళ్లడంలో కృతకృత్యులయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ధ్వంసమైన కారుమంచి మేజర్ కాలువ మరమ్మతులకు నాటి కలెక్టర్‌ను ఒప్పించి డీఎంఎఫ్ నుంచి నిధులు సాధించారు. అయా పనుల విషయంలో స్థానిక నేతల మధ్య సమన్వయం సాధించి ఇబ్బందులు లేకుండా చేయగలిగారు.

పదవుల్లో నిబద్ధతతో పనిచేసిన వారికే ప్రాధాన్యం

పార్టీ, నామినేటెడ్ పదవుల విషయంలో వివాదాలకు తావులేకుండా పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికి బీఎన్ ప్రాధాన్యం ఇచ్చారు. ఇతర ప్రాంతాలకు భిన్నంగా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేని సీనియర్లకు ప్రత్యేక గుర్తింపునిచ్చారు. నియోజకవర్గంలో గుర్తింపు ఉండే ఏఎంసీ చైర్మన్ పదవిపై పలు ఒత్తిళ్లు వచ్చినా నిబద్ధతగా పనిచేసిన చీమకుర్తికి చెందిన మన్నం ప్రసాద్ కుటుంబానికి ఇవ్వడం, పలు పీఏసీఎస్‌లకు పీఐసీ చైర్మన్లుగా 70 ఏళ్లు దాటిన సీనియర్లను నియమించడం అందుకు నిదర్శనం. మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షుడుగా నిబ్ధతతో పనిచేసిన మండవ జయంత్‌బాబును రైతుల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న రాష్ట్రస్థాయి రైతు సహకార సంస్థకు ప్రతిపాదించారు. త్వరలో అతనికి పదవి రాబోతున్నట్లు సమాచారం. అలాగే రాష్ట్ర పార్టీ నిబంధనలకు ప్రాధాన్యం ఇస్తూ స్థానిక పరిస్థితులను సమన్వయం చేసుకొంటూ పార్టీ పదవుల ఎంపికను ఎలాంటి వివాదాలు లేకుండా చేయగలిగారు. మొత్తంగా ఈ 15 నెలల కాలంలో నియోజకవర్గంలో అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకోవడం ద్వారా అంతకుమించి ప్రజల వ్యక్తిగత సమస్యలపై దృష్టి సారించి సహాయం చేయడంతోపాటు పిలిచింది ఏస్థాయి వారు అన్నది పక్కనపెట్టి పేదల నుంచి పెద్దలు వరకు కుటుంబ కార్యక్రమాలకు ఎవరు పిలిచినా హాజరు కావడం వంటి అంశాలతో మరింతగా ప్రజల్లో ఆదరణ పొందే ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు.

సీసీరోడ్లు, డ్రెయినేజీలకు ప్రాధాన్యం

- భారీగా నిధులు సాధించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యేగా బీఎన్ విజయ్‌కుమార్ గెలుపొందినప్పటి నుంచి అలుపెరుగని శ్రామికుడిగా అహరహరం పనిచేస్తున్నారు. గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఉపాధి హామీ నిధులు రూ.5కోట్లు, జిల్లా మినరల్ ఫండ్ ద్వారా మరో రూ.5కోట్లను మండలంలోని సీసీరోడ్లకు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి మంజూరు చేయించారు. కార్పొరేషన్ పరిధిలోని పేర్నమిట్టలో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుకు మరో రూ.5కోట్లు మంజూరు చేయించారు. పేర్నమిట్ట కొండపై ఆంధ్రకేసరి యూనివర్సిటీ నిర్మాణానికి రూ.4కోట్లను సాధించారు. సంతనూతలపాడులో ఎస్సీ హాస్టల్‌కు నూతన భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రజాశ్రేయస్సే ప్రథమ ప్రాధాన్యంగా భావించి పని చేస్తూ అందరి మన్ననలందుకుంటున్నారు.





చీమకుర్తి అభివృద్ధిలో బీఎన్ మార్క్

- రూ.73కోట్లతో రామతీర్థం నుంచి నేరుగా తాగునీటి సరఫరాకు డీపీఆర్
- రూ.2.60కోట్ల డీఎంఎఫ్ నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు

చీమకుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గెలాక్సీపు రంగా ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చెరగని ముద్ర వేసుకున్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకున్న చీమకుర్తికి ప్రత్యేక తాగునీటి పథకం వైసీపీ హయాంలో అటకెక్కింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చీమకుర్తి పట్టణవాసుల దాహార్తి తీర్చడానికి ఏఐబీ సౌజన్యంతో రామతీర్థం జలాశయం నుంచి నేరుగా చీమకుర్తి పట్టణ వాసులకు శుద్ధిచేసిన తాగునీరు అందించే పథకానికి రూ.73కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారు. త్వరలోనే అన్ని అనుమతులు పూర్తిచేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధం కానుంది. డీఎంఎఫ్ నిధులు రూ.2.60కోట్లు విజయ్‌కుమార్ కృషితో మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు. వైసీపీ పాలనలో నిలిచిపోయిన అర్బన్ హెల్త్ ఆసుపత్రి నిర్మాణ పనులకు రూ.28లక్షల నిధుల కేటాయింపులో బీఎన్ మార్కు ప్రత్యేకంగా ఉంది. నిర్మాణ పనులు పూర్తిచేసుకొని త్వరలోనే ఆసుపత్రి సేవలు పట్టణవాసులకు అందనున్నాయి. ఇక డంపింగ్ యార్డ్ అభివృద్ధి, నూతన డంపింగ్ యార్డ్ నిర్మాణానికి కోటిన్నర నిధుల మంజూరు చేయించిన బీఎన్ పట్టణ పరిశుభ్రతకు పెద్దపీట వేశారు.











గౌరవనీయులు, సంతనూతలపాడు శాసనసభ్యులు శ్రీ బి.యన్.విజయ్‌కుమార్ గారికి జన్మదిన శుభాకాంక్షలు







విలేకరుల సమావేశంలో అరెస్టు అయిన దొంగ, స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో సీఐ సురేష్

దోపిడీ దొంగ అరెస్టు

● బంగారు ఆభరణాలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కత్తితో బెదిరించి బంగారు ఆభరణాలను దోచుకెళ్లే దోపిడి దొంగను ఒంగోలు సీసీఎస్, గిద్దలూరు పోలీసులు సంయుక్తంగా పట్టుకుని అరెస్టు చేశారు. దొంగ నుంచి 66 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను గిద్దలూరు సీఐ సురేష్ శనివారం విలేకరులకు వెల్లడించారు. తిరుపతి ప్రాంతంలోని తిరుచానూరుకు చెందిన ఇరగంరెడ్డి శ్రీనివాసులరెడ్డి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జల్సాలకు అలవాటుపడి వ్యాపారంలో లాభాలు రాక సులభంగా డబ్బులు సంపాదించేందుకు అడ్డదారులు వెతుక్కున్నాడు. సోషల్ మీడియాలో, సినిమాల్లో కత్తులతో బెదిరించి బంగారు లాక్కుని వెళ్లిపోవడాన్ని వృత్తిగా ఎంచుకున్నట్లు సీఐ తెలిపారు. గత ఏడాది అక్టోబరు 19న పట్టణంలోని జ్యూవెలరీ షాప్‌కు వెళ్లి తాను ప్రభుత్వ ఉద్యోగినని మాయమాటలు చెప్పి బంగారు వస్తువులను తీసుకుని గుమస్తాను పంపితే ఇంటి వద్ద డబ్బులు ఇస్తానని నమ్మబలికాడు. గుమస్తాను తీసుకుని కొంతదూరం వెళ్లిన తరువాత కత్తి చూపడంతో గుమస్తా పారిపోగా, గుమస్తా మెడలోని బంగారు చైన్‌ను లాక్కొని ఉడాయించాడు. వారం తర్వాత పట్టణంలోని మరో బంగారు షాప్‌నకు వెళ్లి ఆభరణాలు కాజేశాడు. కడప జిల్లా జమ్మలమడుగు, నెల్లూరు జిల్లా సీతారాంపురం, మర్రిపాడు, చేజర్ల గ్రామాలలో జ్యూవెలరీ షాపులకు వెళ్లడం, ఇంటికి రావాలని గుమస్తాను తీసుకెళ్లడం, మధ్యలోనే బెదిరించి పారిపోవడం చేశాడు. అనంతపురం, తెలంగాణ ప్రాంతాలలో కూడా ఈ దొంగ ఇలానే చేసినట్లు సీఐ తెలిపారు. ఎట్టకేలకు ఒంగోలు సీసీఎస జగదీష్, గిద్దలూరు సీఐ సురేష్, ఎస్సై ఇమ్మానియేలు, సీసీఎస్ ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై బాలాంజనేయులు, కానిస్టేబుళ్లు రవి, అంజిబాబు, రఘు రెండు బృందాలుగా ఏర్పడి టెక్నాలజీని ఉపయోగించి దొంగ శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేశారు. అతని నుంచి 66 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకున్న సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించి రికార్డులు కూడా ప్రకటించారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ



ఎక్సైజ్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

పొదిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కే విజయ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎక్కడా మద్యం అక్రమ విక్రయాలు జరగకుండా చూడాలని, మద్యం బెల్టు దుకాణాలు నడిపేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ అరుణకుమారి, సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ల సహాయంతో భక్తులు బయటికి..



ట్రాక్టర్ సహాయంతో భక్తులను బయటకు పంపిస్తున్న ఈఓ

రాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రంగనాయక స్వామి ఆలయానికి దర్శనానికి వచ్చి ఆలయంలో ఉండిపోయిన భక్తులను ట్రాక్టర్ల సహాయంతో ఆలయ అధికారులు, పోలీసులు బయటకు తరలించారు. ప్రతి శనివారం ప్రత్యేక పూజలు ఆనవాయితీగా జరుగుతున్నందున భక్తులు దర్శనానికి వచ్చారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా లక్ష్మమ్మ వనంలో వాగు ఉధృతి ఎక్కువా ఉండడంతో దర్శనానికి వెళ్లిన భక్తులు ఆలయంలోనే ఉండిపోవల్సి వచ్చింది. దీనికితోడు గుండానికి కూడా భారీగా నీరు చేరుతుండడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయని గ్రహించిన ఈవో మల్లవరపు నాగయ్య ముందు జాగ్రత్తగా స్వామివారి దర్శనాన్ని నిలిపివేశారు. సమస్యను భక్తులకు వివరించి వారిని ఆలయం నుంచి తిరిగి పంపించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై పీ కోటేశ్వరరావు తమ సిబ్బందితో ఆలయానికి చేరుకొని ఆలయ అధికారులకు తమవంతు సహకారం అందించారు.

ఆరోగ్యం కోసం కృషి చేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యం కోసం మన వంతు కృషి చేద్దామని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు జేవీ నారాయణ, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్ అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ కార్యక్రమంలో భాగంగా రాచర్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా వారు పాల్గొన్నారు. మహిళలు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని మంచి ఆరోగ్యంతో ఉండాలని వారు కోరారు. అనంతరం సంబంధిత అధికారులు, నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఐ వెంకటేష్, కార్యదర్శి ఎంవి నాయక్, వైద్యాధికారి ఖాదర్ బాషా, వైద్యసిబ్బంది ప్రసాద్, రవీంద్రారెడ్డి, వీరాకుమారి, రామాంజనేయులు, లక్ష్మీ, మూడు పార్టీల నాయకులు, అంగన్ వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజన జీవితాల్లో సౌర వెలుగులు

● అడవి బిడ్డలకు ప్రభుత్వం అండ
● పీఎం జన్‌మన్ ద్వారా వసతులు
● సోలార్ కోసం రూ.4కోట్లు ఖర్చు
● నల్లమలలో వేగంగా పనులు

నల్లమలలోని గిరిజన కుటుంబాల్లో సూర్య కాంతితో వెలుగు నిండుతోంది. అడవి బిడ్డలకు అండగా ఆదివాసీగూడేలకు ప్రాథమిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం జన్‌మన్ యోజన (ప్రధాన మంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం వేగంగా అడుగులు వేస్తూ గిరిజన జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడుతోంది. ఈ పథకం ద్వారా గిరిజనులకు నివాస గృహాలు, తాగునీరు, రహదారులు, విద్యుదీకరణ పనులు చేపట్టనుండగా అందులో భాగంగా పలు ఇళ్లకు సూర్యశక్తితో వెలుగులు అందించేలా రూపొందించిన కార్యక్రమం ప్రస్తుతం ప్రారంభమైంది.

త్రిపురాంతకం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పీఎం జన్‌మన్ యోజన పథకంలో భాగంగా పలు గూడేలలో ఉన్న 611 గృహాలకు సౌర విద్యుత్ అందించేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.4కోట్ల 5లక్షల 30 వేలను ఖర్చు చేయనుంది. ఈ 611 గృహాల్లో కూడా ఇప్పటికే 385 గృహాలకు గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయినట్లు అధికారుల నివేదిక ద్వారా తెలుస్తోంది. ప్రతి ఇంటికీ 0.3 కిలో వాట్స్ విద్యుదుత్పత్తి (ఒక ఫ్యాన్, రెండు బల్బులు) అయ్యేలా సోలార్ ఆఫ్ గ్రిడ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నారు. దీనిద్వారా సూర్యశక్తితో లభించే విద్యుత్‌తో గూడెంలో ప్రతి ఇంటిలో విద్యుత్ సమస్య లేకుండా ఉంటుంది. ఈ పనులను ఐటీడీఏ పర్యవేక్షిస్తోంది. ఈ పనుల్లో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల గిరిజన గూడెంకు సోలార్ సిస్టం పరికరాలను ఇటీవల తరలించారు. చాలా వరకు గృహాలకు కూడా వాటిని అమర్చే ప్రక్రియ పూర్తి కావస్తోంది. ఇవన్నీ పూర్తయితే గూడెంలో గుడిసెలకు చీకట్లు పోయి నిరంతరాయంగా వెలుగులు నిండుతాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ ప్రాంతంలోని ఎర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో అత్యధికంగా ఎర్రగొండపాలెం, దోర్నాల, పుల్లలచెరువు, పెద్దారవీడు మండలాల్లో 598 నివాస గృహాలను ఈ పథకం కింద నిర్మిస్తున్నారు. అర్ధవీడులో 69, గిద్దలూరులో 5, మార్కాపురంలో 14 గృహాలు నిర్మాణం జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం ఈ గృహ నిర్మాణాల ప్రక్రియ మందకొండిగా జరుగుతోంది. కేవలం ఇప్పటివరకు 36 గృహాలను మాత్రమే అధికారులు పూర్తి చేయగలిగారు. మరోవైపు మొత్తం 84 చెంచుగూడేలకు విద్యుత్ పునరుద్ధరణ చర్యల ద్వారా రూ.2 కోట్ల 22లక్షలతో విద్యుత్ సమస్యలు లేని గూడేలుగా పనులు పూర్తి చేశారు. ఇందులో ఎర్రగొండపాలెం మండలంలోని 19 చెంచుగూడేలు, పుల్లలచెరువు మండలంలో 15, దోర్నాల మండలంలో 33, పెద్దారవీడు మండలంలో 6, అర్ధవీడు మండలంలో 7, ముండ్లపాడులో 2 గూడేలు ఉన్నాయి. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక శ్రద్ధ చూపడంతో అధికారులు త్వరితగతిన పూర్తి చేశారు. అన్నిచోట్లా ఎన్నో ఏళ్లుగా ఉన్న పాత స్తంభాలను తొలగించి 623 కొత్త విద్యుత్ పోల్స్ ఏర్పాటుతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. ఈ పథకం ద్వారా అన్ని గిరిజన గూడేలలో ఇతర వసతులు కూడా పూర్తయితే గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలనే ప్రభుత్వం ఆశయం పరిపూర్ణమైనట్టేనని చెప్పవచ్చు.



సోలార్ ద్వారా వెలుగుతున్న విద్యుత్‌దీపాలు



పాలుట్లకు తరలిన సోలార్ కిట్లు

తీరనున్న విద్యుత్ సమస్య

● ఆర్డీఎస్ఎస్ ద్వారా 20 గ్రామాల్లో కొత్త లైన్‌లు ● నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన స్తంభాలు తొలగింపు

ముండ్లమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్య తీరనుంది. విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గ్రామాల్లో దశాబ్దాలకాలంగా ఉన్న విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. దీనికితోడు లైన్‌లు కిందకు వేలాడుతుండటంతో తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఆ లోపాలన్నీ లేకుండాచేసి వినియోగ దారులకు 24 గంటల పాటు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో త్రీఫేజ్ సౌకర్యం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రీ వ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్(ఆర్‌డీఎస్ఎస్) ద్వారా పాత విద్యుత్ లైన్‌లు, శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగిస్తున్నారు. వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు, లైన్‌లు ఏర్పాటు చేయటమే కాక ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేస్తున్నారు.

మండలంలోని పోలవరం, నాయుడుపాలెం, సింగనపాలెం, తమ్మలూరు, పెదరావిపాడు, ఉమామహేశ్వర అగ్రహారం, వేములబండ, చింతలపూడి, పూరిమెట్ల, భీమవరం, బొప్పూడివారిపాలెం, కొమ్మవరం, రమణారెడ్డిపాలెం, వేముల, పెద ఉల్లగల్లు, చిన ఉల్లగల్లు, కెల్లంపల్లి, వేంపాడు, పలుకురాళ్ళ తండా, నందమూరి నగర్, పసుపుగల్లు, అయోధ్య నగర్ గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ ద్వారా కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటుచేశారు. కొత్త లైన్‌లు ఏర్పాటుతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందనున్నాయి. గృహ వినియోగదారులు, చిన్న చిన్న పరిశ్రమల స్థాపన చేసుకొనే వారికి త్రీఫేజ్ సౌకర్యం 24 గంటలు అందుబాటులో ఉండనుంది.



పోలవరంలో ఆర్డీఎస్ పథకం కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



పసుపుగల్లులో పాత విద్యుత్ లైన్ తొలగించి ఏర్పాటుచేసిన కొత్త విద్యుత్ స్తంభాల లైన్

వినియోగదారులకు మెరుగైన సేవలు

గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటుచేస్తున్నాం. కొత్త లైన్‌లు ఏర్పాటు చేయటంతో గ్రామాల్లో ప్రధానంగా లో వోల్టేజీ సమస్య తొలగి పోవటమే కాక విద్యుత్ సరఫరాలో అంతరాయం తొలగిపోతుంది. తద్వార వినియోగ దారులకు ఎంతో మేలు జరుగుతుంది. కొత్త లైన్ ఏర్పాటు చేయటం వల్ల త్రీఫేజ్ సౌకర్యం 24 గంటల పాటు ఉంటుంది. వినియోగదారులకు ఈ పథకం వల్ల నాణ్యమైన విద్యుత్‌ను అందించి మెరుగైన సేవలు అందనున్నాయి. **- టి.చినఅంకబాబు, ఏఈ**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మనిషి ప్రశాంత వాతావరణంతో జీవనం సాగించాలని, ఉద్వేగాలకు లోనైతే సమస్యలు జఠిలమవుతాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఏ భారతి అన్నారు. శనివారం గిద్దలూరు పట్టణంలోని సబ్ జైలును ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా విచారణలో ఉన్న, డ్రంకెన్ డ్రైవ్‌లో శిక్ష పడిన ఖైదీలతో ఆమె మాట్లాడారు. న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు నేరాలకు కారణమవుతాయని, తద్వారా కుటుంబసభ్యులు ఎంతో వేదన చెందుతారని తెలిపారు. ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీంషరీఫ్, గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కె.భరత్‌చంద్ర, జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవాది ఎస్.అహల్య, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

● మార్కాపురం : మార్కాపురం సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న మెనూను పరిశీలించారు. కోర్టు ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న పలు భవనాలను ఆమె పరిశీలించారు.

శ్రీశైలం - దోర్నాల ఘాట్ చాలా ఇరుకు గురూ

● ఆ రోడ్డులో తరచూ రాకపోకలకు ఇబ్బందులు ● జాతీయ రహదారి అయినా విస్తరణకు నోచుకోని వైనం

పెద్దదోర్నాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రెండు బస్సులు ఒక్కసారి ఎదురు పడితే అంతే సంగతులు. గంటల కొద్దీ వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. రెండు వైపులా కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచి ప్రయాణికులు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. తరచూ ఇలా శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో చోటు చేసుకుంటోంది. ఈ రహదారి 2013-14లోనే జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ అయినా అటవీ శాఖ అడ్డంకులతో నేటికీ విస్తరణ పనులు చేపట్టడంలేదు. దీంతో ఉన్న రహదారికి ఒక పక్క ఎత్తైన కొండలు. మరో పక్క లోతైన లోయలు. పెద్ద వాహనాలు రెండు ఎదురు పడితే ఎవరూ రోడ్డు దిగేందుకు ఎవరూ సాహసించరు. వెళ్లే మార్గం లేక ఎక్కడి వాహనాలు అక్కడ నిలిపి వేస్తారు. గంటల సమయం రోడ్లపై నిరీక్షించాల్సిన పరిస్థితి శనివారం చింతల తుమ్మలబైలు మధ్యలో చోటు చేసుకుంది. ప్రైవేటు బస్సు ఆర్టీసీ బస్సు రెండూ ఒకేసారి దాటలేక ఇబ్బందులు తలెత్తాయి. ఈ రహదారిలో ప్రయాణం ఎన్ని మధురానుభూతులను అందిస్తుందో అలాగే ఘటనలు జరిగితే అంతే ఆవేదన కూడా మిగుల్చుతుందని ప్రయాణికులు అంటున్నారు.



శ్రీశైలం ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

వర్షాలకు పైర్లు కళకళ

● ముమ్మరంగా పొగనాట్లు

దర్శి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగు చేసిన పైర్లు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మెట్ట భూముల్లో కంది, పత్తి, ఆముదం, తదితర పైర్లు సాగు చేశారు. ఎదుగుదల సమయంలో మంచి వర్షాలు కురవటంతో ఏపుగా పైర్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలకు భూములు బాగా పదునెక్కాయి. రైతులు ముమ్మరంగా వైట్ బర్లీ పొగాకు, మిర్చి సాగు చేస్తున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. వర్షాలతో చివరి భూములకు కూడా పుష్కలంగా నీరు ఉండటంతో అన్నిప్రాంతాల్లో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. ఈ ఏడాది మాగాణి, మెట్ట పైర్లు కళకళలాడుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దర్శి ప్రాంతంలో పొగమొక్కల సాగు

అడుగు వేయాలంటే నరకమే..!

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణం ఆక్రమణలతో కుంచించుకుపోయింది. అవసరానికి తగ్గట్టు రహదారుల విస్తరణ లేకపోవడంతో నడవాలంటే నరకంగా మారింది. పాతబస్టాండ్ నుంచి అయ్యప్ప స్వామి గుడి వీధి మరింత ఆక్రమణలతో నిండి పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన ఆ వీధిలో ఆక్రమణదారులు రెండువైపులా 5 అడుగుల మేర ఆక్రమించి రోడ్లపైనే వారి సామగ్రి పెడుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వివిధ వాహనాలు, తోపుడు బండ్లు, లగేజీ ఆటోలు, లారీలు కూడా నడిరోడ్లపై నిలబెడుతున్నారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఈ వీధిలోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రశ్నిస్తున్న పాదచారులపై దుకాణదారులు దౌర్జన్యాలు చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని రోడ్లపై ఉన్న ఆక్రమణలు తొలగించి నడిచేందుకు వీలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆక్రమణలతో నిండిన అయ్యప్ప స్వామి గుడి వీధి



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చెన్నుని శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మద్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

పెద్దదోర్నాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హిందీ ఉపాధ్యాయులు మండ్ల శ్రీని వాసులును రామచంద్రకోట ఉపాధ్యాయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని చిన్నదోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసులు హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రామచంద్రకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ చైర్మన్ మహంత్ నాయక్ అధ్యక్షతన ఉపాధ్యాయ సిబ్బంది శ్రీనివాసులకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కోడల్ అధికారి పేరయ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెద్దదోర్నాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో గెలుపొంది డివిజన్ స్థాయి పోటీలకు దోర్నాల విద్యార్థులు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్యామ్ ప్రసన్నతాంజలి శనివారం ప్రకటనలో తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ



విజేతలతో ఉపాధ్యాయులు

గిద్దలూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనపరచి ఉన్నత పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 కబడ్డీ పోటీలలో రహేనా, అనూష, సుహాన, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సమీరా, హర్షవర్ధిని, అండర్-14 ఖోఖోలో షాహిన్, కీర్తి, వైష్ణవి, కబడ్డీలో శృతి, నబీబున్నీసా, సుహానా, యోగాలో నజురున్, షటిల్ బ్యాడ్మింటన్‌లో అమ్ములు, హసీఫా నైపుణ్యతను కనపరిచారు. అండర్-17లోని 100 మీటర్ల పరుగు పందెంలో నిహారిక, 400 మీటర్ల పోటీలో నాగేశ్వరి, లాంగ్ జంప్‌లో రహేనా, 800 మీటర్ల పందెంలో నాగేశ్వరి ప్రతిభ కనపరచి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. వీరందరినీ పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాశాఖాధికారి పి.నాగభూషన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు శోభన్‌బాబు, సువర్ణలత, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించవద్దు



తోపుడు బండ్ల వారికి సూచనలు చేస్తున్న సీఐ

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కల్గించవద్దని సీఐ సీహెచ్ ప్రభాకరరావు తెలిపారు. శనివారం సీఐ సిబ్బంది కలిసి రోడ్డుకు ఇరువైపులా అడ్డదిడ్డంగా ఉన్న తోపుడు బండ్లు, బైకులను తొలగించే చర్యలు చపట్టారు. రోడ్డుపైకి తోపుడు బండ్ల తెచ్చి వ్యాపారాలు చేయొద్దని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కంభం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కంభం మండల సర్వసభ్య సమావేశం 21వ తేదీ ఆదివారం జరుగునని ఎంపిడిఓ వీరభద్రాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపిపి అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ సమస్యలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జరుగును అని ఆయన తెలిపారు. కావున ఈ సమావేశానికి మండల జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

అభ్యసన ఫలితాలపై అవగాహన

రాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అభ్యసన ఫలితాల అనుభవాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవోలు వీ గిరిధర్‌శర్మ, షేక్ మొయినుద్దీన్ అన్నారు. శనివారం ఆకవీడు, ఎడవల్లి (చోళవీడు) కాంప్లెక్స్ పరిధిలో సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎఫ్ఏ-1, పరీక్ష నిర్వహణ, ఎఫ్ఏ-2 నిర్వహణపై ప్రణాళిక తయారీ భావాలు, మోడల్ లెసన్ 2025 కార్యకలాపాలు, పీర్ గ్రూప్స్‌పై చర్చ, మల్టీపుల్ చాయిస్ క్వచ్చన్స్‌పై శిక్షణ, నిరంతర మూల్యాంకనంపై కాంప్లెక్స్ నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్‌మాస్టర్ బీఎల్ రామానాయక్, సెక్రటరీ పీ వెంకటేశ్వర్లు, హెడ్‌మాస్టర్ వెంకటరామిరెడ్డి పర్యవేక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గిరిధర్ శర్మ

కంభంలో ఏదీ స్వచ్ఛత..?

- రోడ్డు పక్కన పేరుకున్న చెత్త
- కంపుతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

కంభం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కంభంలో స్వచ్ఛత కానరావడం లేదు. స్వచ్ఛాంధ్రపై విస్తృత ప్రచారం, ఫొటోలకు ఫోజులిచ్చే అధికారులు ప్రధాన రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త, వాటి కోసం వచ్చే పందుల గురించి పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా పంచాయతీ పరిధిలో కాప వీధిలో తురిమెళ్ళకు వెళ్ళే ప్రధాన రహదారి ప్రక్కన వ్యర్థాలు పేరుకుపోయి, ఆ వ్యర్థాలను తినేందుకు పందులు గుంపులు గుంపులుగా వస్తుంటాయి. ఒక్కోసారి అవి వాటిలో అవి పోట్లాడుకుంటూ



కంభం పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన పేరుకున్న చెత్త

రోడ్డుపై వెళ్లే ద్విచక్రవాహనదారులకు అడ్డు వస్తుండడంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక కందులాపురం పంచాయతీ పరిధిలో తహసీల్దార్, ఎంపీడీవో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉండే ప్రహరీ గోడకు ఇవతల తర్లుపాడు, మార్కాపురం వెళ్లే రోడ్డు పక్కన పంచాయతీ వారు చెత్త వేస్తుండడంతో వాటి కోసం పందులు వస్తున్నాయి. పైగా ఆ వ్యర్థాల నుంచి వచ్చే కంపుతో రోడ్డు వెంట వెళ్లే ప్రజలు, ప్రయాణికులు భరించలేక ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. మురుగు కాల్వలలో మురుగు, రోడ్లపై చెత్త పేరుకుపోతుండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పలువురు సీజనల్ వ్యాధుల బారినపడి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్ల ప్రక్కన వ్యర్థాలను పడవేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కందులాపురం రోడ్డులో చెత్త వద్ద పందులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వైపాలెం గురుకులంలో మొక్కలు నాటుతున్న ఎరిక్షన్‌బాబు



మార్కాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ అధికారులు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు పెంచడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నదే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమ ఉద్దేశమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం ఎర్రగొండపాలెం గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. పక్కనున్న బాలుర పాఠశాల మైదానంలో డ్రోజర్‌తో చెత్త తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు వేగినాటి శ్రీను, శనగా నారాయణరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, తోట మహేష్, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, అచ్యుతరావు, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇళ్లతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కంపోస్టు యార్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలు నాటి సంరక్షిస్తే ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు విరివిగా నాటాలని మార్కాపురం అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి నాగరాజు అన్నారు. స్థానిక ప్రాజెక్టు టైగర్, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌వో జాన్సన్, ఎస్ఏ వెంకటరమణ, జేఏ మల్లికార్జున్, అరుణ్, ఖాశిం, బ్రహ్మారెడ్డి, ప్రసాద్, నరేష్, నిరంజన్, అనిల్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పెద్దారవీడు : పర్యావరణ పరిరక్షణతో అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో జాన్ సుందరం అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. ఎంపీడీవో జాన్ సుందరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఒక్క మొక్కను నాటడంతోపాటు దానిని పరిరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

దోర్నాల : యువత స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యులు కావాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వ్యక్తి గత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని సావిత్రి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలు నాయక్ కోరారు. మండలంలోని రాయవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గజ్జలకొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గ్రామ కూడలిలో ర్యాలీ చేశారు. గ్రామంలో చెత్త ఉన్న ప్రదేశంలో శ్రమదానం చేసి పరిశుభ్రం చేశారు. టీడీపీ నాయకులు నారు వెంకటేశ్వరరెడ్డి, అశోక్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మీ పరిసరాలలో మొక్కలు నాటాలని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. శనివారం ఎంపీడీవో వీరభద్రాచారి కందులాపురం సచివాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ విజయలక్ష్మీ, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల : ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో ఎస్.వెంకట రామిరెడ్డి అన్నారు. కాల్వపల్లి, గ్రామాల్లో ఆయన సంబంధిత అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఐ వెంకటేష్, కార్యదర్శులు నాయక్, విష్ణువర్ధనాచారి, కూటమి నాయకులు యోగానంద్, డాక్టర్ జేవి నారాయణ, సనావుల్లా ఖాన్, కాశిరెడ్డి, కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.

గురజాడకు నివాళి

గిద్దలూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి ఉత్సవాలను రాజు పారా మెడికల్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి స్వరూపారెడ్డి, డివిజన్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజు, ప్రైవేటు విద్యా సంస్థల సంఘం మాజీ అధ్యక్షులు రామిరెడ్డి, లెక్చరర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

రాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈనెల 22 నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని రామాలయం అర్చకులు కట్ట సతీష్ శాస్త్రి శనివారం ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ సోమవారం బాలాత్రిపుర సుందరి అలంకారం, 23 మంగళవారం గాయత్రీ దేవీ అలంకారం, 24వ తేదీ బుధవారం అన్నపూర్ణ దేవీ అలంకారం, 25వ తేదీ గురువారం కాత్యాయని దేవీ అలంకారం, 26వ తేదీ శుక్రవారం మహాలక్ష్మీదేవీ అలంకారం, 27వ తేదీ శనివారం లలిత త్రిపుర సుందరి అలంకారం, 28వ తేదీ ఆదివారం మహాచండీ దేవీ అలంకారం, 29వ తేదీ సోమవారం సరస్వతి దేవీ అలంకారం, 30వ తేదీ మంగళవారం దుర్గాదేవీ అలంకారం, అక్టోబర్ 1 బుధవారం మహిషాసుర మర్ధిని అలంకారం, 2వ తేదీ గురువారం శ్రీ రాజరాజేశ్వరి దేవీ అలంకారంలో అమ్మవారు భక్తులు దర్శనమిస్తారని తెలిపారు. కార్యక్రమాల విజయవంతానికి భక్తులు సమకరించాలని ఆయన కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షలు

లాడ్జీల తనిఖీల్లో సీఐ సుబ్బారావు

మార్కాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షలు తప్పవని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. శనివారం మార్కాపురం పోలీసులు పట్టణంలోని లాడ్జీలు, వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా పట్టణంలోని పలు అనుమానాస్పద లాడ్జీలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్థానిక కాలేజీ రోడ్డులోని ఓ లాడ్జీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి నుంచి రూ.27,050 స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ఇకపై ప్రతి రెండు రోజులకు ఒకసారి ప్రతి లాడ్జీని పోలీసులు తనిఖీ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఎస్సై ఎం.సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



లాడ్జిలో సోదాలు చేస్తున్న పోలీసులు

పొదిలి : పట్టణంలో ఉన్న లాడ్జీలను సీఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ వేమన శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలిలోని పలు లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేసినట్లు తెలిపారు. లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధిగా రికార్డులను మెయిన్‌టైన్ చేయాలని సూచించారు. కార్యక్రమలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కాలేయ రోగికి రూ.10లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

మార్కాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాలేయ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని బోడపాడు గ్రామానికి చెందిన ముక్కామల రామసుబ్బారెడ్డికి రూ.10లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం అందజేశారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడ స్టార్ హాస్పటల్‌లో కొద్ది రోజులుగా రామసుబ్బారెడ్డి చికిత్సపొందుతున్నారు. ఆయన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి రూ.10 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను మంజూరు చేయించారు. స్వయంగా హైదరాబాద్ వెళ్లి హాస్పటల్‌లో రామసుబ్బారెడ్డిని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించి లెటర్‌ను అందించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి ఉన్నారు.

దసరా సెలవులతో విద్యార్థుల ఇంటిబాట



హాస్టల్ నుంచి ఊరికి వెళ్తున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అక్టోబరు 2వ తేదీ దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సెలవులు ప్రకటించింది. శనివారం పాఠశాలలు ముగిసిన తర్వాత ఇటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులంతా ఇంటిబాట పట్టారు. 21 ఆదివారం కావడంతో శనివారం సాయత్రం నుంచి హాస్టల్ విద్యార్థులను వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వచ్చి పిల్లలను ఊళ్లకు తీసుకెళ్లారు.

నేడు మెడికల్ కళాశాల సందర్శన

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ సమీపంలో రాయవరం గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదివారం సందర్శిస్తారని పార్టీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. మెడికల్ కాలేజీ వాస్తవ పరిస్థితులను ఎమ్మెల్యే ప్రజలకు తెలియజేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్శనలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొంటున్నట్లు చెప్పారు.

రెండో రోజు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లేఖరులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో పెట్టిన ఆధార్ ఓటీపీని వ్యతిరేకిస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరుల సంఘం రెండో రోజు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టింది. ఓటీపీ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి ఇతర పద్దతుల ద్వారా సవరించి ప్రజలకు దస్తావేజు లేఖరులకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు.

మార్కాపురం రూరల్ : రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఓటీపీ విధానం రద్దు చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్ కార్యలయం వద్ద దస్తావేజు లేఖరులు నిరసన తెలిపి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజలు ఆస్తులను పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు సుబ్బారావు, మస్తాన్ పాల్గొన్నారు.

నేడు బీసీ మహాసభ

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు పాఠశాల ఆవరణలో ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు డాక్టర్ జేవీ నారాయణ, వెంకటయ్య తెలిపారు. సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావుతోపాటు అన్ని కులాల రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని, సమావేశంలో బీసీ సంక్షేమంపై సభ జరుగనున్నదని, ప్రతి ఒక్కరూ హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

పెద్దదోర్నాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక శివసదన్‌లో రైతు సంఘం మహాసభను నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుపతిరెడ్డి సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమయ్య, వెంకటరామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ, నాయకులు పిచ్చయ్య, ఏసేబు పాల్గొన్నారు.

రామాపురం రోడ్డుకు మోక్షమెప్పుడో..?

పొదిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పొదిలి, సూదనగుంట, రామాపురం రోడ్డుకు ఏడేళ్లుగా మోక్షం కలుగలేదు. కంకర తోలి వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. 2014లో టీడీపీ ప్రభుత్వం తారురోడ్డు వేసేందుకు ప్రణాళిక వేసి టెండర్లు పిలిచింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కంకర పరిచే వరకు పనులు పూర్తి చేశారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ రోడ్డును పట్టించుకోలేదు. ఐదేళ్లు కంకర దారిపైనే ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. కంకర వేసిన రోడ్డుపై తారు వేయడంలో వైసీపీ పాలకుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం రావడంతో మా రోడ్డు బాగుపడుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.




కంకరతో ఉన్న పొదిలి - రామాపురం రహదారి

ముఖాముఖి

నెలాఖరులోగా ఈ-పంట నమోదు

బాలకృష్ణానాయక్, ఏవో, దొనకొండ



ప్రశ్న: ఖరీఫ్‌లో మండలంలో ఎన్ని ఎకరాల్లో పంటల సాగయింది?

జవాబు: 4900 హెక్టార్లల్లో పంటలు సాగయ్యాయి. 1270 హెక్టార్లలో కంది, 1950 హెక్టార్లలో పత్తి, 248 హెక్టార్లలో వరి, 111 హెక్టార్లలో సజ్జ, 240 హెక్టార్లలో మిర్చి, 18 హెక్టార్లలో మొక్కజొన్న, 67 హెక్టార్లలో ఆముదం సాగయింది.

ప్ర: ఈ-పంట నమోదుకు ఎప్పటివరకు అవకాశం ఉంది?

జ: గ్రామాల్లో పంటలను సాగుచేసిన రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా ఈనెల 30వరకు ఈ పంట నమోదు చేసుకునే అవకాశం ఉంది.

ప్ర: మండలంలో ఎంతమంది కౌలు రైతులకు కార్డులు మంజూరయ్యాయి ?

జ: మండలంలో 902 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే 744 మందికి మంజూరయ్యాయి. ఇంకా 158 మందికి మంజూరు కావాల్సి ఉంది.

ప్ర: అన్నదాత సుఖీభవ పథకం ఎంతమంది రైతులకు వర్తించింది ?

జ: మండలంలో 6744 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరైంది. కొందరు రైతులకు ఈకేవైసీ, 2019 ఫిబ్రవరి తర్వాత అనువంశకం కింద ఉన్నవారి రైతులకు సంబంధించి ప్రాసెస్‌లో ఉన్నాయి. త్వరలో వారికి మంజూరవుతాయి.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ముండ్లమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణం పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో షేక్ అబ్దుల్ కరీం అన్నారు. శనివారం మండలంలోని పెదఉల్లగల్లు గ్రామ సచివాయం వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య, కార్యదర్శి రాజరాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో సుందరరామయ్య, ఏపీవో బి.మాల్యాద్రి, కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, ఎం.శివరామయ్య పాల్గొన్నారు.

తాళ్లూరు: పర్యావరణ పరిరక్షణకు తమవంతు తోడ్పాటు నందించాలని తూర్పు గంగవరం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మహేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని మాధవరంలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ నాగఅంజిని, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముండ్లమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుగ్రామాలకు ఆదివారం విద్యుత్ సరపరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టి.చినఅంకబాబు తెలిపారు. పసుపుగల్లు, చినఉల్లగల్లు, ముండ్లమూరు, వేంపాడు, కెల్లంపల్లి, నందమూరినగర్, లంబాడీ తండా గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో అరగంటకు పైగా వర్షం కురిసింది. ముండ్లమూరు, పసుపుగల్లు, ఉల్లగల్లు, కెల్లంపల్లి, పులిపాడు, వేముల, వేములబండ, చింతలపూడి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం మెట్ల పైర్లకు మేలు చేకూర్చింది.

వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం కోవిలంపాడు జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతిచెందాయి. సర్పంచ్ ఖాదర్‌బుజ్జి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ ద్వారా మృతి చెందిన పశువులను తొలగించారు.

పోలీసుల తనిఖీలు

పామూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, గంజాయి తదితర అక్రమ రవాణను అరికట్టేందుకు జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు శనిఆరం పామూరు జాతీయ రహదారులపై తనిఖీలు చేసినట్టు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. పట్టణంలోని జాతీయ రహదారి జంక్షన్ పాయింట్‌లవద్ద వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ టి కిశోర్‌బాబు పోలీసులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ఏర్పాటులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించటంతో పాటు స్వచ్ఛాంధ్ర - గ్రీన్ ఆంధ్రగా తయారుచేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, దర్శి, తూర్పువెంకటాపురం సొసైటీల అధ్యక్షులు కె.చంద్రశేఖర్, దామా కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

కాగా, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏసురాజు మృతదేహానికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నివాళులర్పించారు. మండలంలోని తూర్పుచౌటపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి ఏసురాజు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా స్కూల్ బస్సు ఢీకొట్టడంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థి మృతిచెందటం బాధాకరమన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె.వెలుగొండారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దర్శి బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

మహిళల అభివృద్ధితో సమాజాభివృద్ధి

దొనకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని భావించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళల ఆరోగ్యంలో భాగంగా రక్తహీనత, తల్లి శిశు సంరక్షణ, మంచి పోషకాహారం, పరిశుభ్రత, జీవనశైలిపై అవగాహన కల్పించటమే ఈ పథకం ఉద్దేశమన్నారు. అనంతరం మహిళలకు పండ్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీవాణి, వైద్యాధికారులు చంద్రమౌళి, ప్రశాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు మోడి అంజనేయులు, మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, రిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునశర్మ, నాయకులు మన్నెం గాలయ్య, పత్తి వెంకటేశ్వర్లు, కుందుర్తి లక్ష్మణ్, దుగ్గెంపూడి చెంచయ్య, షేక్ తోహీద్, వడ్లమూడి చెన్నయ్య, విప్పర్ల లక్ష్మీరావు, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిని హరితవనంగా తీర్చిదిద్దుదాం!

» మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కొత్తూరు బైపాస్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. రోడ్డు కిరువైపులా చెత్తచెదారాలను తొలగించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కనిగిరి పట్టణాన్ని హరితవనంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బైపాస్ రోడ్డు వెంట మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గార్లపేట రోడ్డులోని మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహనక కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఎస్‌హెచ్ఎస్ - 2025 ఆకారంలో ప్రదర్శించిన తీరు అలరించింది.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, యారవ శ్రీనివాస్, చిరంజీవి (వీవీఆర్ మనోహరరావు), తమ్మినేని వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, చైర్మన్ తదితరులు

ఆరోగ్యాంధ్ర ప్రభుత్వం లక్ష్యం

» ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.మౌనిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిగ్రామం స్వచ్ఛ పల్లెగా ఉండాలన్న ధ్యేయంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ రహిత వస్తువులను వాడాలన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో ఎంపీపీ, సొసైటీ అధ్యక్షుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్‌లు మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నేత షేక్ మీరా మొహిద్దీన్, హెచ్‌ఈవో చంద్రశేఖర్, పీహెచ్ఎన్ రమణమ్మ, హెచ్‌వీ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన కలిగిఉండాలని మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి(సమర) అన్నారు. శనివారం మండలంలోని దారంవారిపాలెం గ్రామంలో జరిగిన స్వస్థ్‌నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 175 మందికి పరీక్షలుచేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి, ఆయుర్వేద వైద్యుడు పి.మల్లికార్జునరావు సీహెచ్ రమణ, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ

అర్హులందరికీ భూముల పంపిణీకి చర్యలు

» తహసీల్దార్ బీవీ రమణారావు

» ఏకలవ్యనగర్ కాలనీలో విచారణ

తాళ్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :తూర్పుగంగవరం పంచాయతీ ఏకలవ్యనగర్ ఎస్టీ కాలనీవాసులకు ప్రభుత్వభూముల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం కాలనీలో విచారణ చేపట్టారు. గత 37 ఏళ్లగా తాము సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు విచారణ జరిపి ఆకాలనీకి చెందిన ఎస్టీలకు భూములు పంపిణీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు తహసీల్దార్ కోర్టును ఆశ్రయించిన జాబితా ప్రకారం అందరిని పిలిపించి వారి ఆధార్‌కార్డు, స్థానికత, అర్హుల వివరాలను సేకరించారు. విచారణలో కాలనీవాసులు తహసీల్దార్‌కు పలు సమస్యలు విన్నవించారు. అటవీ భూముల హక్కుల చట్టం ప్రకారం ఆ భూములను పట్టాలుగా పొందిన వారికి మరలా అసైన్డ్ భూములు పంపిణీ చేయవచ్చా అని ప్రశ్నించారు. ఇతర జిల్లా, ప్రాంతాలకు చెందిన వారికి పట్టాలు పంపిణీ ఎలా చేస్తారని, ఎంతో కాలంగా ఈ ప్రాంతాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి చదును చేసుకుని సాగు చేపట్టిన భూమిని కాదని మరో భూమికి పట్టా ఇస్తే తమకు ఇబ్బందులు తప్పవని వాపోయారు.

ఈక్రమంలో తహసీల్దార్ ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించారు. ఎంత భూమి సాగులో ఉంది, ఎవరు సాగు చేస్తున్నారు , ఏఏ పంటలు సాగు చేస్తున్నారో గుర్తించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత గల వారందరికి పట్టాలు పంపిణీ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కోర్టును ఆశ్రయించిన వారిలో అర్హులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనంతరం మిగిలిన ఎస్టీలకు భూములు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మహేష్, ఆర్ఐ ఎం.సుధీర్‌కుమార్, వీఆర్‌వోలు రమణారెడ్డి, చంద్రశేఖర్‌రావు, విలేజ్ సర్వేయర్ భవాణి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీల సాగు భూముల వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణారావు

కుటుంబ కలహాలతో కుమారుడిపై దాడి

కనిగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో కుమారుడిపై తల్లి, సోదరి దాడి చేసిన ఘటన శనివారం రాత్రి కనిగిరిలో జరిగింది. ఎస్ఐ శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఒంగోలు బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న షేక్ నజీర్‌బాషా అనే వ్యక్తి తోపుడు బండిపై చిరువ్యాపారం చేస్తుంటాడు. 8నెలల క్రితం ఆతనికి వివాహమైంది. తన భార్యకు, తల్లికి పొసగకపోవటంతో అత్త వారింట్లో ఉంటున్నారు. ఆయన తండ్రికి అనారోగ్యంతో మంచం పట్టగా పట్టించుకోవటం లేదు. దీంతో వృద్ధుల పోషణ గడవటం కష్టంగా మారింది. ఈక్రమంలో నజీర్‌బాషా శనివారం రాత్రి తల్లిదండ్రుల వద్దకు వెళ్ళినక్రమంలో స్వల్పవివాదం ఏర్పడింది. తల్లి, సోదరి దాడిచేయడంతో గాయపడగా స్థానిక ప్రభుత్వా సుపత్రిలో చేర్పించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీరాం వివరాలు సేకరించి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల మద్యం అమ్మకాలపై నిఘా పెంచాలి

కనిగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాల అమ్మకాలపై నిఘా ఉంచాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నూతన మద్యం విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నమోదు చేసిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నమోదు చేసిన కేసులు రికార్డులను పరిశీలించి చార్జిషీట్‌లను వెంటనే కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. బెల్టు షాపులపై నిఘా పెంచాలని సూచించారు. ఇతర రాష్ట్రాల మద్యం అమ్ముతున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి, సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెం డెంట్ ఏ.జనార్దన్‌రావు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర కంటి వైద్య నిపుణులు

కనిగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జననీ చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి 340 మంది హాజరయ్యారు. వారిలో 169 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని నిర్ధారించారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిని ఈనెల 21వ తేదీ 60 మంది, 23న 103 మంది శంకర కంటి ఆసుపత్రికి ఆపరేషన్‌కు తరలించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం

దర్శి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కంప్యూటర్ ఆపరేటర్ ఏసేబుకు ఉపాధ్యాయులు రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎంఈవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఏపీటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.రఘురామయ్య, పి.రమాదేవి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తూము శ్రీనివాసరావు, నక్కా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు ఎంపీడీవోగా పి.అజిత

తాళ్లూరు,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు ఎంపీడీవోగా పి.అజితను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో బి.చిరంజీవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఏవో సానికొమ్ము సత్యంను ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ కొమరోలు మండలానికి బదిలీ చేశారు. చీమకుర్తిలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న పి.అజితకు పదోన్నతి కల్పిస్తూ తాళ్లూరు ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వెలిగొండ ఆయకట్టు పరిధిలోకి పీసీపల్లిని చేర్చాలి

పీసీపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ఆయకట్టు పరిధిలో పీసీపల్లి మండలాన్ని చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం జరిగిన ఆపార్టీ మండలశాఖ సమావేశంలో పి.మహేష్ మాట్లాడుతూ వెలిగొండ జలాలతోనే పీసీపల్లి మండలంలో నీటి సమస్య తీరుతుందన్నారు.



ఇరిగినేని విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దివి శివరాం, కోటపాటి జనార్దనరావు తదితరులు

ఇరిగినేనికి నివాళి

పామూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జన హృదయనేత ఇరిగినేని తిరుపతినాయుడని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఇరిగినేని తిరుపతినాయుడు 87వ జయంతి కార్యక్రమాలను మండలంలోని మోపాడు, బొట్లగూడూరు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మోపాడు గ్రామంలో ఇరిగినేని ఘాట్ వద్ద, బొట్లగూడూరులోని ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీను, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎం.గిడ్డయ్యయాదవ్, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మోపాడు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇరిగినేని తనయుడు రవీంద్ర పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయల చెక్కును ఎంఈవో పి.కోటిరెడ్డి, కె.కరుణకుమారికి అందజేశారు. అనంతరం మద్దినేని ఎరుకలయ్య నిర్మించిన కుకింగ్ షెడ్డును, కె నసీబ్‌వలి, వంశీలు అందించిన 17 కుర్చీలు, అంబవరపు సురేష్ సమకూర్చిన వాటర్‌ఫిల్టర్, వెంకటేశ్వర్లు బహూకరించిన కూలింగ్ బాక్స్‌లను ప్రారంభించారు.

కనిగిరి: పేదల పెన్నిధిగా మాజీ ఎమ్మెల్యే తిరుపతినాయుడు ప్రజాదరణ పొందారని డీసీసీ అధ్యక్షుడు సైదా అన్నారు. స్థానిక చర్చి సెంటరులో శనివారం ఇరిగినేని 87వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇరిగినేని నరసయ్య ఆధ్వర్యంలో తిరుపతినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ఇరిగినేని తనయుడు రవి, కోటపాటి జనార్దన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, బొట్టు శ్రీను, సిద్దాంతి బారాయిమాం, సీపీఐ నాయకుడు వై .రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

తేలు కుట్టి విద్యార్థి మృతి



మృతి చెందిన శ్రీనివాసరావు

ముండ్లమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తేలు కుట్టి విద్యార్థి మృతిచెందాడు. ఈఘటన శనివారం మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని బలరామ్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. షేక్ సాయి, మస్తాన్‌బీ కుటుంబసభ్యులు శుక్రవారం రాత్రి కాలనీలో జరిగిన ఓవిందు కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి ఇంటికి వస్తుండగా దారిలో వారి ద్వితీయ కుమారుడు షేక్ శ్రీనివాసరావు(13) కాలికి తేలు కుట్టింది. వెంటనే బంధువులు మారెళ్ళలోని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అద్దంకి, అనంతరం ఒంగోలులోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడు ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారావు తదితరులు నివాళులర్పించారు.

రైల్వే ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం

దొనకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దొనకొండలో రైల్వే లోకో పైలట్, అసిస్టెంట్ పైలట్, ట్రైన్ మేనేజర్లు విధులు మారే క్రూచేంజ్ ఏర్పాటుతో పాటు వారు విశ్రాంతి తీసుకునేందుకు రన్నింగ్ రూమ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని గుంటూరు రైల్వే డివిజనల్ సీనియర్ ఆపరేటింగ్ మేనేజర్ జె.శ్రీనాథ్ పేర్కొన్నారు. వివరించారు. రైల్వే శాఖలో ఆపరేటింగ్ బ్రాంచ్ ఉద్యోగులకు సేఫ్టీ సెమినార్‌ను దొనకొండలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా డీవోఎం శ్రీనాథ్‌ను రిటైర్ట్ రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.జయరాజ్, వ్యాపారవేత్తలు మాడిశెట్టి రమేష్, షేక్ గఫూర్, బీజేపీ నాయకుడు వెంకటరామయ్యలు శాలువా కప్పి సత్కరించారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

పామూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమతుల ఆహారంతో మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏసీడీపీవో పి.లావణ్య తెలిపారు. శనివారం మండలంలోని దూబగుంట అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషకాహార మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దైండే శివశంకర్, డి.గోపి, సూపర్‌వైజర్ జి.పద్మజ, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని రావిగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రవళిప్రియాంక, సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగిఉండాలి

పామూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై మహిళలు అవగాహన కలిగిఉండాలని ఆరోగ్య న్యూట్రిమిక్స్ అధినేత్రి డీవీ మౌనిక అన్నారు. శనివారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. 90 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించగా 12 మందికి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. కార్యక్రమంలో సూర్యచంద్రసేవా సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, వైద్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

పీసీపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని పెదఅలవలపాడు గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

టీడీపీ నేత కొర్రపాటి రవి మృతి



రవి మృతదేహాన్ని సందర్శిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

తాళ్లూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) కొర్రపాటివారిపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నేత కొర్రపాటి రవి(56)అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో తీవ్ర అస్వస్థతకు గురై కోమాలోకి వెళ్లాడు. హుటాహుటీన ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడు సోదరుని భార్య శ్రీదేవి గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవి మృతి చెందాడన్న సమాచారం తెలియగానే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జానార్దన్ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బి.ఓబుల్‌రెడ్డి, గొల్లపూడి వేణుబాబు, మానం రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పీసీపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సచివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఏపీవో కసుకుర్తి కొండయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కోటయ్య, ఈసీ జహంగీర్‌బాషా, ఏవో ఎస్.రంగాక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



చీపురు పట్టి శుభ్రం చేస్తున్న సీఎం చంద్రబాబు



ఆప్యాయంగా పలకరింపు..

"చెడు చేయడానికి ఒక నిమిషం చాలు. మంచి చేయాలంటే చాలా సమయం పడుతుంది. నా శేష జీవితం పేదలకే అంకితం. సంక్షేమ పథకాలను ఒక బాధ్యతగా ఇస్తున్నాను. నిరుపేదలను ఆదుకునేందుకు సూపర్ సిక్స్ తీసుకువచ్చాను. పేదల సమస్యల పరిష్కారం కోసం.. వారు ఆర్థిక ఎదుగుదల కోసమే పీ-4ను అమలు చేస్తున్నాను.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు బంగారు కుటుంబాల కార్యక్రమంపై తన ఆలోచన విధానాన్ని స్పష్టం చేశారు."





యాదవుల బజారు వాసులతో మాట్లాడుతున్న సీఎం



స్వచ్ఛరథాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



స్వచ్ఛరథాలను పరిశీలిస్తూ..



స్టాల్‌లో రైతుతో మాట్లాడుతూ

మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది



చాలా కాలం తర్వాత మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చిందని, ఈ ఆనందం అందరి ముఖాల్లో కనిపిస్తోందని.. ఇది శాశ్వతంగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మాచర్లలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇక్కడ మళ్లీ టీడీపీ జెండాను ఎగురవేశారని.. మాచర్ల వచ్చినపుడు అఖండ స్వాగతం పలికారని సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడో రాజీవ్ గాంధీ హత్య జరిగిన సందర్భంగా మాచర్లలో ఉండే రౌడీలు, ముఠా నాయకులు ఇక్కడి ప్రజల ఆస్తులను విధ్వంసం చేశారని గుర్తుచేసుకున్నారు. ఎన్నికల ముందు వరకు మాచర్లలో ప్రజాస్వామ్యం, ఎన్నికలు లేవన్న చంద్రబాబు నాయుడు.. చరిత్రలో డిక్టేటర్లకు పట్టిన గతే ఇక్కడి నేతలకు పట్టిందన్నారు. ఇకనైనా ఆ నేతలు పద్ధతులు మార్చుకోకపోతే వారిని ప్రజాస్వామ్యం క్షమించదని తీవ్రంగా హెచ్చరించారు.

- ప్రతి ఒక్కరి ముఖాల్లో ఆ ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది
- చాలా కాలం తర్వాత ఇక్కడ టీడీపీ జెండా ఎగుర వేశారు
- చెత్త క్లీన్ చేసినట్లే.. చెత్త రాజకీయాలను క్లీన్ చేస్తా..
- గత ఐదేళ్లలో నాలాంటి నాయకుడే మాచర్లకు రాలేకపోయారు..
- ఇప్పుడు అందరూ స్వేచ్ఛగా వస్తున్నారు..
- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ప్రాంతంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన వారిని గ్రామం నుంచి వెళ్లగొట్టారు. వారిని ఆత్మకూరుకు తీసుకొస్తుంటే నన్ను అడ్డుకున్నారు. నా నివాసానికే తాళ్లు కట్టారు. ఆ తాళ్లే వారికి ఉరి తాళ్లుగా మారాయి. గతంలో ఇక్కడ చాలానే అరాచకాలు జరిగాయి. మాచర్ల మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ నేతలపై దాడి చేశారు. అందుకే నేను చెబుతున్నాను రాయలసీమలో ముఠాలు లేకుండా చేశాను. పల్నాడులో ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండండి (మిగతా 6వ పేజీలో)







- దత్తత తీసుకున్న కుటుంబాలతో సీఎం చంద్రబాబు, మార్గదర్శకులు

రెండు బంగారు కుటుంబాలు దత్తత

- ముందుకు వచ్చిన మార్గదర్శకులు
- పిల్లలను చదివించాలని సీఎం సూచన

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాచర్లలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర సభ పేద కుటుంబాలను ఆదుకునేందుకు వేదికైంది. సీఎం చంద్రబాబు నాయుడి సమక్షంలో రెండు బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకున్నారు. ఆ కుటుంబాల ఆర్థిక పురోగతికి ప్రణాళికలు రూపొందించాలని చంద్రబాబు మార్గదర్శకులకు సూచించారు. మాచర్ల పట్టణంలోని 11వ వార్డుకు చెందిన బత్తుల నీలావతిని బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. ఆమె పడుతున్న ఇబ్బందులను చంద్రబాబు సమక్షంలో తెలియజేసింది. తల్లిదండ్రులు చిన్న వయస్సులో పెళ్లి చేశారని.. తన భర్త మరణించాడని, ముగ్గురు మగ పిల్లల పోషణకు కూలీ పనులకు వెళ్తున్నట్లు గోడు వెళ్లబోసుకుంది. ముగ్గురు పిల్లలకీ 'తల్లికి వందనం' లబ్ధి చేకూరిందని చెప్పింది. తన తల్లిదండ్రులు కూడా కూలికి వెళ్తుంటారని, అత్త మామలు కూడా సహకరించడం లేదని బాధపడింది. వితంతు పింఛను (మిగతా 6వ పేజీలో)



వివిధ సంఘాలకు చెక్కు అందజేస్తూ..



వైద్యులతో మాట్లాడుతూ..

బీచ్ ఫెస్టివల్‌ను జయప్రదం చేయాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



బాపట్ల, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): సూర్యలంకలో బీచ్ ఫెస్టివల్‌ను జయప్రదంగా నిర్వహించడానికి అధికారులంతా సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ ఆదేశించారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అధికారులతో శనివారం రాత్రి కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు. తీరంలో కిలోమీటరు పొడువున 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యాటకులకు కనువిందు చేసేలా లేజర్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నదని తెలిపారు. 80 ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. తొలిరోజు 2 లక్షల మంది పర్యాటకులు హాజరయ్యేలా, వారి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పేరలి కెనాల్ నుంచి నూతనంగా మరో మార్గాన్ని ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, ఉపకలెక్టర్ సాయిబాబా, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బాపట్లలో భారీ వర్షం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్లలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో పలు రహదారులు తటాకాలను తలపించాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి బాపట్ల, చీరాల, అద్దంకి పట్టణాల్లోని వీధులన్నీ జలమయమయ్యాయి. శనివారం సాయంత్రం కూడా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శుక్ర, శనివారాలలో మధ్యాహ్నం పూట భానుడు ప్రకోపం చూపగా సాయంత్రం భారీ వర్షం నమోదైంది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు వరద ముంచెత్తి వరి పైరుకు నష్టం వాటిల్లింది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు పైర్లకు మేలు జరిగేదనేది రైతులు చెప్తున్నారు. గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 21.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా చుండూరు మండలంలో 78.6 మి.మీ. వాన కురిసింది. బల్లికురవ మండలంలో 67.2, జె.పంగులూరు మండలంలో 53.2, బాపట్ల 42.6, కర్లపాలెం మండలంలో 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



పాత బస్టాండ్ వద్ద వర్షపు నీరు

వైద్య కళాశాలను త్వరలో నిర్మిస్తాం

- నాడు ఏమీచేయక.. ఇప్పుడు విమర్శలా?
- మూడేళ్లలో అని పునాదులతో సరిపెట్టారని ధ్వజం

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి ప్రజల మనసులు గెలుస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. స్థానిక జమ్ములపాలెంరోడ్డులో వైసీపీ హయాంలో పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన కళాశాలను శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం పీపీపీ విధానంలో కళాశాలను త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. తన వల్లే జిల్లా, వైద్య కళాశాలలు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పుకుంటున్నారే కానీ చేసింది శూన్యమన్నారు. 2021లో శంకుస్థాపన సమయంలో మూడేళ్లల్లో పూర్తి చేసి 100 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తామని ప్రగల్భాలు పలికారని కానీ ఇప్పటికే కళాశాల పునాదులనూ అంతంతమాత్రంగా నిర్మించారన్నారు. 2024 వరకు అధికారంలో ఉన్నవారు ఏమీ చేయలేక ఇప్పుడు జెండాలు పట్టుకుని వైద్య కళాశాల అంటూ రావడం, విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తొలుత నాబార్డు రూ.252 కోట్లు మంజూరు చేయగా రూ.65 కోట్లు పనులు చేస్తే కేవలం రూ.20 కోట్లు మాత్రమే కాంట్రాక్టర్‌కు గత పాలకులు చెల్లించారన్నారు. మిగిలిన డబ్బులు ఏమి చేశారని వేగేశన ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, బీజేపీ నాయకులు కొత్రా వెంకటరామకృష్ణ, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి కిశోర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, కూచిపూడి శ్యామ్ సుందర్, మాడా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల ఫిల్లర్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, కూటమి నేతలు

చీరాలలో.. స్వయంభు సందడి

చిత్ర యూనిట్‌కు ఎమ్మెల్యే కొండయ్య అభినందనలు



నిఖిల్ చిత్ర యూనిట్‌ను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చీరాల - వాడరేవు రోడ్డులోని నగరవనం అటవీ ప్రాంతంలో స్వయంభు చిత్రం షూటింగ్ జరుగుతోంది. నిఖిల్ కథానాయకుడిగా చిత్రం క్లైమాక్స్‌కు సంబంధించి ఆధ్యాత్మిక సన్నివేశాలు మూడు రోజులుగా చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమర్నాథ్‌తో కలిసి షూటింగ్ స్పాట్‌కు చేరుకుని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల వైపు తెలుగు చలనచిత్ర సీమ దృష్టి సారించాలన్నారు. చీరాల పరిసర ప్రాంతాల్లో సినిమాల చిత్రీకరణలకు అన్ని హంగులు ఉన్నట్లు చెప్పారు.

చెక్‌పోస్టులకు రంగం సిద్ధం

- వచ్చే నెల 1 నుంచి గ్రానైట్ సీనరేజ్ వసూళ్లు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ఏఎంఆర్ కంపెనీకే బాధ్యత

బల్లికురవ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో బాగంగా గ్రానైట్ సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ఏఎంఆర్ కంపెనీకి అప్పగించింది. గత నెలలో జరిగిన టెండర్లలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి రూ.47.29 కోట్లు చెల్లించేలా ఏఎంఆర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అద్దంకి, పర్చూరు, చీరాల నియెజకవర్గాల పరిధిలోని పలు మండలాల సరిహద్దులో సుమారు 54 ప్రైవేట్ చెక్‌పోస్టుల ఏర్పాటుకు సంబంధిత కంపెనీ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ చెక్‌పోస్టులతో అక్రమంగా తరలిస్తున్న ఖనిజ సంపదకు ఫుల్‌స్టాప్ పడుతుందని అధికారులు అంటున్నారు. బల్లికురవ మండలంలోని వీర్లకొండ సమీపంలో, గ్రానైట్ ఫ్యాక్టరీల ప్రాంతాల్లో చెక్‌పోస్టుల కంటైనర్లను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పరిధిలో ఏఎంఆర్ కంపెనీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీనరేజ్ వసూళ్లు చేస్తోంది. ప్రభుత్వానికి ఈ కంపెనీ ద్వారా ఆదాయం వస్తుండటంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ఆ కంపెనీకే ప్రభుత్వం అప్పగించింది. ఇక నుంచి అక్రమ మార్గంలో గ్రానైట్ ఖనిజ సంపదకు తరలింపునకు అవకాశం ఉండదని, తప్పనిసరిగా సీనరేజ్ కట్టాల్సి వస్తుందని గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల యజమానుల్లో ఇప్పటి నుంచే ఆందోళన మొదలైంది. పొలాలకు తాము మట్టిని తోలుకోవాలంటే ఇక నుంచి ఇబ్బందేనని రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు.



చెక్ పోస్టు ఏర్పాటుకు దించిన కంటైనర్

కాఫీ విత్.. క్లాప్ మిత్ర

- కార్మికుల యోగక్షేమాలు తెలుసుకున్న కలెక్టర్, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆత్మీయ పలకరింపులతో పారిశుధ్య కార్మికులు పరవశించారు. ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూ, కుటుంబ బాగోగులపై ఆరా తీసి.. విధి నిర్వహణలో ఎలాంటి సమస్య, ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటామని, ఆరోగ్య భద్రత తమదే అంటూ వారిలో భరోసా నింపారు. క్లాప్ మిత్రలతో కలసి కాఫీ తాగుతూ అందరూ ఒక్కటే అన్న భావనను వారిలో కల్పించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే ఏలూరితో కలసి కలెక్టర్ పర్చూరులో పర్యటించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సేవలను కలెక్టర్ కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరితో కలిసి కార్మికులను సన్మానించి, వారితో ప్రత్యేకంగా ముచ్చటించారు. పారిశుధ్య కార్మికులకు త్వరలో వైద్య శిబిరాలను నిర్వహించి మందులు, మెరుగైన చికిత్సలను ఉచితంగా అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



క్లాప్ మిత్రలతో కాఫీ తాగుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఏలూరి

నేడు బల్లికురవలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బల్లికురవలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించాలని ఆయన కోరారు. గ్రామంలో ఆర్డీఎస్ఎస్ వర్కు పనులు జరుగుతున్నాయని వారం రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తి అవుతాయని తెలిపారు.

టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా చేపడుతున్న టీకాల కార్యక్రమాన్ని శనివారం బాపట్ల డీఏహెచ్‌వో బి.వేణుగోపాల్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏడీ మాధవి పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

మార్టూరు,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి శనివారం స్థానికంగా వెలుగు కార్యాలయంలో ఫ్రెండ్స్ న్యూ జనరేషన్ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూట్రియేషన్ కిట్లు పంపిణీ చేశారు. న్యూట్రియేషన్ డొనేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 40 మందికి అందజేశారు. డాక్టర్ భాగ్యలక్ష్మి, హనుమంతు, ఏపీఎం సురేంద్ర, సీసీలు మహేష్, శోభన్, కానిస్టేబుల్ రమేష్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలను పెంచేలా కృషి చేయాలి

మార్టూరు,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యాప్రమాణాలను పెంచేవిధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో వస్రాం నాయక్ చెప్పారు. శనివారం మండలంలోని ద్రోణాదుల జడ్పీ హైస్కూలులో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. అదేవిధంగా వలపర్ల కాంపెక్స్ సమావేశానికి ఎంఈవో ప్రేమలత, కోలలపూడిలో చలపతి, మార్టూరులో ఏ శ్రీనివాసరావులు నోడల్ అధికారులుగా వ్యవహరించారు. అదేవిధంగా యద్దనపూడిలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు చైర్మన్‌గా దేవేంద్రరావు వ్యవహరించారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం అవసరం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థి అన్ని విధాల అభివృద్ధి సాధిస్తారని ఎంఈవో శ్రీనివాసరావు చెప్పారు. శనివారం మండలంలోని ధర్మవరం ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం హెచ్ఎం సోమేపల్లి హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. అనంతరం విద్యలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తెలుగు వాచకం, అభ్యసన దీపిక పుస్తకాలను ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ధర్మవరం హెచ్ పాఠశాల హెచ్ఎం సుబ్బరాజు, ఎస్ఎల్‌వీ దేవి, విద్యా కమిటీ చైర్మన్ ఉప్పు వెంకట్రావు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సంతమాగులూరు సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : సముతుల్య ఆహారంతోనే గర్భిణులకు, బాలింతలకు, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సంతమాగులూరు ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.ప్రమీల చెప్పారు. రాష్ట్రీయ 8వ పోషణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏల్చూరి గ్రామంలో పోషక విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు దుర్గ, చిన్నమ్మాయి, షకీరా, బసవమ్మ, బోడెమ్మ, పద్మ, తిరుమల, మస్తాన్‌బీ, మస్తానమ్మ పాల్గొన్నారు

ఆహ్లాదకరం.. ఎకో-టూరిజం


ఎకో-టూరిజం ప్రధాన ద్వారం

1 సూర్యలంకలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా కాటేజీలు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో ఎకో-టూరిజం కాటేజీలను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. జీడిమామిడి తోటల మధ్య 45 రకాల చెట్లు, మొక్కల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడముచ్చటగా ఉన్న కాటేజీలలో సేద తీరేందుకు దూర ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని పర్యాటకులు వస్తున్నారు. సూర్యలంక నేచర్ క్యాంపు రిసార్ట్స్‌గా ఏర్పాటు చేసిన వీటిలో పర్యాటకుల కోసం బీచ్ సఫారీ, సైకిల్ సఫారీ సదుపాయం కూడా కల్పించారు. కాటేజీల చుట్టూ 45 రకాల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో కూడా చల్లటి వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కాటేజీలలో సరదాగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎకో-టూరిజం కాటేజీలకు ఆ తర్వాత వైసీపీ పాలనలో ఆదరణకు కరువైంది. వీటి అభివృద్ధిని వైసీపీ పాలకులు గాలికి వదిలేశారు. మొక్కుబడిగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మరలా దృష్టి సారించింది. ఇక్కడ మొత్తం 6 కాటేజీలు, ఒక డార్మెటరీ, రెస్టారెంట్, వాటర్‌ప్లాంట్ ఉండగా.. ప్రస్తుతం మరో 6 కాటేజీలను అత్యాధునికంగా ఏర్పాటు చేశారు.

కొరవడిన ఆదరణ

సముద్రానికి కొంత దూరంలో ఎకో-టూరిజం కాటేజీలు ఉండటంతో పర్యాటకుల ఆదరణ కరువైంది. సముద్రం ఎదురుగా ఉండే కాటేజీలకే పర్యాటకులు మొగ్గు చూపుతున్నారు. అయితే ఇక్కడ పచ్చటి మొక్కలు, చెట్లు, ఆహ్లాదాన్ని పంచే విధంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రకృతి మధ్య ఉండాలనుకునే వారు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. సముద్రాన్ని సందర్శించిన తర్వాత ఇక్కడకు వచ్చి మంచి నీటితో స్నానాలు చేసి సేద తీరే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది.




నూతనంగా నిర్మించిన కాటేజీలు


ఎకోటూరిజంలో పర్యాటకులు తిరిగేందుకు ఏర్పాటు చేసిన సైకిళ్ళు

కాటేజీలకు సంబంధించిన ధరలు

సూర్యలంక తీరంలోని ఎకో-టూరిజం కాటేజీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. సోమవారం నుంచి గురువారం వరకు 24 గంటలకు పాత కాటేజీలకు రూ.3,472, కొత్త కాటేజీలకు రూ. 2,912 ధరను నిర్ణయించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు పాత కాటేజీలకు రూ. 3,819, కొత్త కాటేజీలకు రూ. 3,203 ధరను నిర్ణయించారు. డార్మేటరీలో మొత్తం 6 బెడ్‌లు ఉండగా.. దీనికి రూ. 4,816 ధరను నిర్ణ యించారు. ఎక్స్‌ట్రా బెడ్‌కు విడిరోజుల్లో రూ.998ని, వారాం తాల్లో రూ. 1098 ధరను నిర్ణయించారు. ఇక్కడ చిన్న చిన్న ఫంక్షన్‌లకు, ఫొటో షూట్‌లకు అవకాశం కల్పిస్తున్నారు.


ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ఫంక్షన్‌గ్రౌండ్

టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు

ఎకో-టూరిజం కాటేజీలను మరింత అభివృద్ధి చేసేందుకు అనేక ప్రతిపాదనలు చేశారు. ఇక్కడ సేద తీరే పర్యాటకులు సముద్రానికి వెళ్ళేందుకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పిల్లల పార్కు అభివృద్ధి, గ్రీనరీ డెవలప్‌మెంట్, మినీ థియేటర్ సౌకర్యంతోపాటు కాటేజీలు పెంచే ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వం దీనికి సంబంధించి నిధులు మంజూరు చేసిన వెంటనే అన్ని రకాల వసతులతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన కాటేజీలు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి.

భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణం

చీరాల్లో ఘనంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణ కల్పన ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి సంరక్షించాలని ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం కొత్తపేట జిల్లా పరిషత్ ఇంజనీరింగ్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా మొక్కలు నాటి నీళ్ల పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పారిశుధ్య కార్మికులకు నిత్యవసరాలు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విధిగా చెత్త సేకరణ జరగాలని సూచించారు. బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్‌బాబు, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఆర్డీవో ఆధ్వర్యంలో..

పట్టణంలో ఆర్డీవో ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పట్టణంలో యువనాయకులు గౌరీ అమర్నాథ్, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్‌లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాలుష్య రహిత చీరాలగా రూపుదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. మానవహారం నిర్వహించారు.

ఎస్పీని కలిసిన చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు

ఎస్పీ ఉమమాహేశ్వర్‌ను శనివారం చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, నరేంద్రవర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లాకు బాధ్యతలు చేపట్టిన ఎస్పీకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గంజాయి, మాదక ద్రవ్యాల కట్టడికి కృషి చేయాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులందరూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చెప్పారు. పర్చూరులోని ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన గోదాములను శనివారం శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకును రానున్న సంవత్సరంలో సాగు చేయవద్దని సూచించారు. ఇప్పటి వరకు రూ.92 కోట్లు విలు చేసే 12,500 టన్నుల బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేసినట్లు చెప్పారు. అనధికారికంగా సుమారు 30వేల టన్నులు పొగాకు రైతుల వద్దనే ఉంటుందని ప్రాథమిక అంచనాలు వేశామన్నారు. రైతులు సంక్షోభం నుంచి బయటకు తీసుకురావాలంటే ప్రభుత్వ ప్రణాళిక మేరకు పంటల సాగు ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. మిగిలిన పొగాకు సమస్యను ఎమ్మెల్యే ఏలూరి కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రమేష్‌బాబు, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై అవగాహనా ర్యాలీలో కలెక్టర్, ఎమ్మెల్యే

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్చూరులో ఆయా పాఠశాలల విద్యార్థులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. తొలుత స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి బొమ్మల సెంటర్‌లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో డీపీవో ప్రభాకర్, ఎంపీడీవో వెంకటస్వామి, తహసీల్దార్ బ్రహ్మయ, ఈవోఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి, వేదికపై కలెక్టర్ వినోద్‌కుమార్

మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

(5వ పేజీ తరువాయి)

రౌడీయిజం.. నేరాలు ఘోరాలు చేస్తే ఊరుకునేది లేదు. మంచి కార్యక్రమాలు చేసి ప్రజల అభిమానాలు పొందాలి. ప్రజల ఆస్తులకు రక్షణ నిలబడతాం. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర మంచి కార్యక్రమంలో పాల్గొన్నాను. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలి. ఇక్కడ నేతల మనసుల్లో ఉన్న చెత్తను కడిగేస్తే తప్ప ఈ మాచర్ల బాగుపడదు. గత ప్రభుత్వంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తంతా రోడ్లపై వేశారు. ఈ చెత్తను క్లీన్ చేసే బాధ్యతను తీసుకున్నాను. చెత్తను క్లీన్ చేసినట్టే చెత్త రాజకీయాలను క్లీన్ చేస్తాను. మాచర్ల ఎన్నికల్లో చశాను. ప్రజాగ్రహం ఎలా ఉంటుందో 33 వేల మేజార్టీతో గెలిపించి చూపించారు. మాచర్ల అనగానే.. రోడ్డుపై అతి కిరాతకంగా కత్తితో జగన్‌కు జై కొట్టాలని బెదిరించినా జై చంద్రబాబు అన్న చంద్రయ్యను హత్య చేశారు. జాలయ్యకు రక్షణ లేకపోతే ఎక్కడకో పోయి తలదాచుకుంటే అతి కిరాతకంగా చంపేశారు. నంబూరు శేషగిరి రావు కూడా వీరోచితంగా పోరాడారు. అలాంటి ప్రజాస్వామ్య వీరులకి శ్రద్ధాంజలి ఘటించి.. చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇస్తున్నాం. ఎవరికి అన్యాయం జరిగినా ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. న్యాయం చేసే వరకు అండగా ఉంటాం. ఐదేళ్ల నాలాంటి నాయకుడే మాచర్లకు రాలేకపోయిన పరిస్థితి. నేడు ఏవరైనా మాచర్లకు స్వేచ్ఛగా రాగలుగుతున్నారు. ఆది అప్పటి పరిపాలన, ఇది ఇప్పటి పరిపాలన.' అని సీఎం చంద్రబాబు పరోక్షంగా పిన్నెల్లి సోదరులను చంద్రబాబు హెచ్చరించారు. సభలో రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి, ప్రభుత్వ కార్యదర్శి సురేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ డి.వేణుబాబు పాల్గొన్నారు.

రెండు బంగారు కుటుంబాలు దత్తత

(5వ పేజీ తరువాయి)

రావడం లేదని ఆమె తెలపడంతో..వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు.. వితంతు పింఛన్ అమెకు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

నీలావతి కుటుంబాన్ని పీ4 కింద దత్తత తీసుకొవడానికి కేసీపీ సంస్థ ముందుకొచ్చింది. నీలావతికి తమ సంస్థలో పని కల్పిస్తామని సీనియర్ జనరల్ మేనేజర్ వైకుంఠం వెంకటరమణ వేదికపై ప్రకటించారు. ఆమెతో పాటు 50 మందికి కుట్టు మిషన్లు అంస్తామని తెలిపారు. పిల్లలను ఉన్నత చదువుల బాధ్యతను కేసీపీ తీసుకొవాలని సీఎం కోరడం, వెంటనే అందుకు అంగీకరించడంతో.. కేసీపీ సంస్థను చంద్రబాబు అభినందించారు. సంస్థ ఇంకా ఎన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటుందో తెలపాలని, ఈ విషయంలో నాస్పేర్దని చంద్రబాబు కోరారు. దీంతో మరికొన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటామని మేనేజర్ ప్రకటించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంతోనే సరిపోందని, ఆ కుటుంబాల తలసరి ఆదాయం పెరగాలన్నారు. భవిష్యత్‌లో దీనిని పరిశీలించడం జరగుతుందని చంద్రబాబు చెప్పారు.

కూతురు, చెల్లిని చదివించాలి : నజీరున్

మాచర్లకు చెందిన షేక్ నజీరున్‌ను మరో బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. ఈమె తను పడుతున్న కష్టాలను చంద్రబాబుకు విన్నవించింది. తన భర్త చనిపోయాడని, కుతురు ఉందని.. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నానని పేర్కొంది. తనకు చెల్లి ఉంది. కుతురుతో పాటు తన చెల్లిని చదివించే బాధ్యత తనపై ఉందని చెప్పుకొచ్చింది. తల్లి ఇటీవలే మరణించిందని, తండ్రికి అనారోగ్యంతో ఉన్నారని.. కూతురు, చెల్లి ఇద్దరు డిగ్రీ చదువుతున్నారని.. ఇద్దరి చదువుకు సాయం అందించాలని కోరింది. నజీరున్ బంగారు కుటుంబాన్ని దుర్తికి చెందిన విత్తన కంపెనీ యజమాని యాగంటి వెంకటేశ్వర్లు మార్గదర్శిగా నిలిచారు. ఆ ఇద్దరి చదువుకు సాయం అందిస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ ఇద్దరు ఎంత వరకు చదువుతారో చదివించి వారిని సెటిల్ చేయాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారిని అదుకుని అభివృద్ధిలోకి తీసుకురావడమే పీ-4 లక్ష్యం అని చంద్రబాబు తెలిపారు. ఈ కుటుంబాన్ని దత్తత తీసుకున్న వెంకటేశ్వర్లును అభినందించారు. అమె తండ్రికి పింఛన్‌కు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలి

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించటం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఎంపీడీవో కుసుమ కుమారి చెప్పారు. మండలంలోని అంబడిపూడి గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వప్న, హెచ్ఎం లింగారావు, ఉపాధ్యాయులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

శింగరకొండలో హుండీల ద్వారా రూ.5.35 లక్షలు

అద్దంకి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోని హుండీల కానుకలను శనివారం లెక్కించారు. 2025 మార్చి 15వ తేదీ నుంచి శనివారం వరకు హుండీల ద్వారా 5,35,165 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయశాఖ అద్దంకి డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అందరి సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్ అద్దంకి

అద్దంకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్ అద్దంకిగా మారుస్తామని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కోర్టు భవనాల సముదాయం వద్ద పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రం చేయించారు. పాత తహసీల్దార్ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, హౌసింగ్ ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

పంగులూరులో...

పంగులూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచాలని ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ వి.సింగారావు కోరారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని స్థానిక ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణాలలో నిర్వహించారు. తొలుత ర్యాలీచేపట్టారు. మొక్కలు నాట్టారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలరాజేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, ఎంఈవో వీరాంజనేయులు, ఏవో సుబ్బారెడ్డి, హౌసింగ్ ఏఈ కిషోర్‌కుమార్, ఏపీఎం సంతోషం, హెచ్ఎం శ్రీనివాసరావు, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. హెచ్ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పూర్వ ఎన్‌సీసీ అధికారి ఎస్.నరసింహారావు, ఏసీసీ అధికారి సుబ్బారావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు రామకోటిరెడ్డి, జ్యోతి, పీడీ గంటా అంకమ్మ, కృష్ణారావు పాల్గొన్నారు. చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు ఆధ్వర్యంలో అధికారులు గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు స్వరాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీని సచివాలయం-2 వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.




అద్దంకిలోని రాజీవ్‌కాలనీ సమీపంలో మొక్కను నాటుతున్న డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు


పంగులూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

వీర్ల చెరువుకు జలకళ

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీర్ల చెరువు ఒక్క రాత్రి కురిసిన భారీ వర్షానికి నీటితో కళకళలాడుతోంది. బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలలో ఉన్న పంట భూములకు నీటిని అందించే ఈ చెరువు కొన్ని నెలల నుంచికళావిహీనంగా ఉంది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతిగా రావటంతో చెరువుకు నీరు పుష్కలంగా చేరుతోంది. దీంతో చెరువు కింద ఆయకట్టులో ఉన్న రెండు గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 350 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువుకు నీరు నిండుగా చేరిందని ఈ ఏడాది వరి, ఇతర పంటల సాగుకు ఎలాంటి ఢోకా లేదని చెబుతున్నారు. చెరువులో ఉన్న చేపలు బయటకు వెళుతుండడంతో చేపలు పెంచుతున్న కాంట్రాక్టర్ వెంటనే చెరువుకు నలువైపులా కూలీలతో వలలను ఏర్పాటు చేయించారు.


నిండు కుండలా ఉన్న వీర్ల చెరువు

కారు ఢీకొని అన్న మృతి.. తమ్ముడికి గాయాలు

స్వర్ణ రోడ్డులో ప్రమాదం



అపస్మారక స్థితిలో శేఖర్‌బాబు



శ్రీనివాసరావు(ఫైల్)

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ శుభకార్యానికి చీరాల వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కారంచేడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జె పంగులూరు మండలం ఆరికట్లవారిపాలేనికి చెందిన కొమరబత్తిన శ్రీనివాసరావు(50), శేఖర్‌బాబు అన్నదమ్ములు. ఇద్దరు వ్యవసాయ కూలీలు. శనివారం చీరాల పట్టణంలో బంధువుల శుభకార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. సాయంత్రం తిరిగి స్వర్ణ రోడ్డులో వెళుతుండగా మార్గమధ్యలోని టపాసుల ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్న శ్రీనివాసరావు అక్కడికక్కడే మతి చెందగా, తమ్ముడు అపస్మారక స్థితిలోకి చేరాడు.స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కారంచేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఒక రోజు ముందే చీరాల సమీపంలో కారు ఢీకొని ఒకరు మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. వరుస ఘటనలతో ప్రజలు భీతిల్లుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మార్టూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : స్థానికంగా కొణిదెన రోడ్‌లో మద్యం షాపులు దాటిన తర్వాత రోడ్డు సమీపంలోని తుమ్మచెట్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉంది. ఆ మేరకు శనివారం సమాచారం వచ్చినట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం... మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటాయన్నారు. మృతుని పక్కనే ఖాళీ మద్యం సీసా, గడ్డిమందు డబ్బా ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుడు మద్యంలో గడ్డిమందు తాగి మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు చెప్పారు. ఒంటిపై తెల్లని చొక్కా, నల్ల ప్యాంట్ ఉన్నాయన్నారు. వీఆర్‌వో మోహనరావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు.

కోటపాడు పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

పంగులూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చందలూరుకు చెందిన అజిత్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ రెండు సీసీ కెమెరాలను బహూకరించారు. వీరనారాయణకు ఎస్‌ఎంసీ చైర్మన్ బుల్లిబాబు, హెచ్‌ఎం వేణుబాబు, కట్టా శ్రీనివాసరావులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌డ్యూటీలోనే...



చీరాల పోలీస సబ్ డివిజన్ పరిధిలో సిబ్బంది కొరత.. ఆపై బయట ప్రాంతాల్లో విధులకు..

తిరుపతి బ్రహ్మోత్సవాలకు, అసెంబ్లీ విధులకు రక్షక భటులు

సమస్యల పరిష్కారానికి బాధితుల పడిగాపులు

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ స్టేషనలో సిబ్బంది కొరత వేధిస్తోంది. బయట ప్రాంతాల విధులకు కేటాయిస్తుండడంతో సమస్య జటిలంగా మారుతోంది. సబ్‌డివిజన్ పరిధిలో ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు ఉన్నారు. వారితో పాటు సుమారు 350 - 400 వరకు కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సుమారు 100 మందికి పైగా ప్రస్తుతం సెలవుల్లో ఉన్నారు. ప్రతి స్టేషన్‌కు సుమారు 50 మంది ఉండగా.. వీరిలో సెలవుల్లో ఉన్నవారు, రికార్డు వర్క్‌లు, దర్యాప్తు, ట్రాఫిక్ వగైరాతో పోల్చుకుంటే ముప్పావు భాగం బయటకు వెళ్తున్నారు. దీంతో స్టేషన్లను ఆశ్రయించిన ఫిర్యాదుదారులు న్యాయ పరిష్కారంలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 24నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు నలుగురు ఎస్సైలు, 12 మంది సిబ్బంది విధులకు హాజరు కానున్నారు. అలాగే అసెంబ్లీ సమావేశాలకు సంబంధించిన విధులకు సుమారు 70 మంది పోలీసులు తరలి వెళ్లనున్నారు.

- చీరాల ఒకటో పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, కూరగాయల మార్కెట్, ముంతావారి సెంటర్ నిత్యం ప్రజలు, వాహనదారులతో రహదారులు రద్దీగా ఉంటాయి. ఈక్రమంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. అలాగే వాహనాలు చోరీలతో పాటు, రోడ్డు ప్రమాదాల వివాదాలు అధికమే. అలాగే చీరాల చుట్టుపక్కల ఎక్కడ సమస్య జరిగినా సంబంధిత కుటుంబ సభ్యులు, మద్దతుదారులు, లేదా పార్టీలు, వ్యక్తులు గడియార స్తంభం కూడలిలోనే ధర్నాలు చేస్తుంటారు.
- అలాగే రెండో పట్టణ పరిధిలో ఒక ఎస్‌హెచ్‌వో, ఇద్దరు ఎస్సైలు ఉండగా సుమారు 50 మంది సిబ్బంది ఉన్నారు. ఇక్కడ పేరాల, జయంతిపేట, జాన్‌పేట, ఐక్యనగర్, కొత్తపేట రోశయ్య నగర్, ఐఎల్‌టీడీ కాలనీతోపాటు శృంగారపేట, రామనగర్, ఆదినారాయణపురం వంటి ప్రాంతాలు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో కొన్ని ప్రాంతాల్లో నాటుసారా, కొట్లాట కేసులతోనే పోలీసులు తలమునకలవుతుంటారు. ఈక్రమంలో చాలీచాలని సిబ్బందితో పోలీసులు రోజులు గడుపుతున్నారు. అలాగే చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, వేటపాలెం స్టేషన్లు పేరుకు చిన్నవే అయినా లా అండ్ ఆర్డర్ సమస్యలు అధికం. నిత్యం సివిల్, క్రిమినల్ కేసులు వస్తుంటాయి. అక్రమ ఇసుక రవాణా, జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికమే. అంతేకాకుండా ఈ రెండు స్టేషన్లకు ప్రొటోకాల్ డ్యూటీలు కోకొల్లలు.
- అంతేకాకుండా సబ్ డివిజన్ పరిధిలో అద్దంకి, మేదరమెట్ల, కొరిశపాడు, పంగులూరు, ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు స్టేషన్‌లు ఉన్నాయి. ఈ విధంగా పరిశీలిస్తే వచ్చే 15 రోజుల్లో స్టేషన్‌లో పది మంది సిబ్బంది ఉండటం అతికష్టమే అనిపిస్తోంది. ఇప్పటికే సిబ్బంది కొరతతో స్టేషన్లను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులు తలలు పట్టుకుంటున్నారు. పరిష్కారాల కోసం రోజులు, రోజులు స్టేషన్ల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పుడు అదనపు డ్యూటీ కారణంగా నేరగాళ్లకు కలిసొచ్చే కాలం అన్న చందంగా ఉంది. ఈక్రమంలో అవసరం మేరకు సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుతున్నారు.

రైతుల వద్దకు రెవెన్యూ సేవలు

మంత్రి రవికుమార్ ఆదేశాలతో అన్ని గ్రామాలలో అధికారుల సమావేశాలు

గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ వెల్లడి

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా ఉన్న రెవెన్యూ సమస్యలను ప్రజల వద్దకే వెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ రవి నాయక్ చెప్పారు. పలు గ్రామాలలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రైతులు మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి వెంటనే స్పందించి అన్ని గ్రామాలలో సమావేశాలు పెట్టాలని ఆదేశించారు. దీంతో శనివారం నక్కబొక్కలపాడు గ్రామంలో తహసీల్దార్ రవినాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 17 మంది రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎవరు కార్యాలయాల చుట్టూ తిరగవద్దని తహసీల్దార్ చెప్పారు. అన్ని గ్రామాలలో ఈసమావేశాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.



నక్కబొక్కలపాడులో రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ రవినాయక్

పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చెప్పారు. శనివారం పర్చూరు ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలసి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా డీపీవో ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సేవలకు విలువ కట్టలేని వన్నారు. కోడి కూతకూయకముందే గ్రామాల్లోని చెత్తా చెదారాన్ని శుభ్రంచేసి అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లానే లక్ష్యం : కలెక్టర్ వినోద్ కుమార్

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా బాపట్లను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దటమే తన ముందున్న లక్ష్యమని, దీనికి ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ వినోద్ కుమార్ కోరారు. స్వచ్ఛత ప్రతి రంగంలోనూ ఉండాలన్నారు. అన్ని జిల్లా కార్యాలయాలు, మండల కార్యాలయాలను స్వచ్ఛ కార్యాలయాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఇంటా బయట స్వచ్ఛంగా ఉండాలన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడే ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం సంపూర్ణంగా నెరవేరుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆహ్లాదకరమైన ప్లాంటేషన్ జరగాలని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం పర్చూరులో చేపట్టామన్నారు. జిల్లా సామాజిక అటవీశాఖ ద్వారా ఖాళీగా ఉన్న ప్రతి చోట మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, డీఎంహెచ్‌వో విజయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఎంఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు పాల్గొన్నారు.

మూడు రోజులుగా వర్షం జల్లులు

పగలు ఎండ... సాయంత్రం వర్షం

అద్దంకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా అద్దంకిలో పగలు ఎండలు కాస్తుండగా, సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షపు జల్లులు పడుతున్నాయి. గురు, శుక్రవారాలలో భారీ వర్షాలు కురవగా, శనివారం సాయంత్రం కూడా వర్షపు జల్లులు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి.



అద్దంకిలో కురుస్తున్న వర్షం

బల్లికురవలో దంచి కొట్టిన భారీ వర్షం

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో శనివారం వర్షం దంచి కొట్టింది. గంటపాటు ఉరుములు, మెరుపులు గాలులతో భారీ వర్షం కురవటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది. శుక్రవారం రాత్రి కూడా భారీ వర్షం పడింది. వరుసగా రెండురోజులపాటు వర్షాలు పడటంతో వీధులన్నీ నీటితో నిండిపోయాయి. ఈ ఏడాదికి ఇంత పెద్ద వర్షం ఎప్పుడూ కురవలేదని ప్రజలు అంటున్నారు. ఈ వర్షం మెట్ట పంటలకు ఎంతో ఉపయోగం అని రైతులు చెబుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో మురుగు కాలువలు సరిగా లేక రోడ్డుపై మురుగు నీరు పారింది. వర్షం తగ్గాక గ్రామాలలో పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద జంగిల్ క్లియరెన్స్ ప్రారంభం

అద్దంకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ సమీపంలోని అద్దంకి కొండ వద్ద అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల పరిసరాలలో పెరిగిన చిల్లచెట్లు, జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. మొదటగా పరిసరాలను మొత్తం శుభ్రం చేయించనున్నారు. సుమారు ఆరున్నరేళ్లుగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించేందుకు ముందస్తుగా ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. చిల్లచెట్లు తొలగింపు పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ రవీంద్ర పరిశీలించారు.



పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అవీఇవీ

ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల దేవతామూర్తుల వేషధారణలు



దేవతామూర్తుల వేషధారణలో విద్యార్థులు

అద్దంకి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో ఉన్న ఎల్ఆర్ ఎయిడెడ్ స్కూలులో శనివారం ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ పిల్లల వేషధారణలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

అటవీ శాఖ తరపున మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్

మార్టూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అటవీశాఖ తరపున ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామని కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. రమేష్ చెప్పారు. ఆయన శనివారం మండల పరిధిలోని బొబ్బేపల్లి రిజర్వ్ ఫారెస్ట్ కొండ దగ్గర ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలో పెంచుతున్న మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 40 వేల మొక్కలైన జామ, సీతాఫలం, ఉసిరి, బాదం, వేప, కానుగ, పనస, చింత, వెదురు తదితర మొక్కలను నర్సరీలో పెంచామన్నారు. ఈ మొక్కలలో 10 మొక్కలు అవసరమైన వారు ఆధార్ కార్డుతో, లేదా ఎక్కువ మొక్కలు అవసరమైన వారు ఎంపీడీవో ద్వారా లెటరు తీసుకొని వచ్చి మొక్కలను పొందవచ్చన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు వీరాంజనేయులుకు సత్కారం



వీరాంజనేయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గాలం వీరాంజనేయులను శనివారం పలువురు సత్కరించారు. బల్లికురవ ఎంఆర్‌సీలో జరిగిన కాంప్లెక్సు సమావేశం సందర్భంగా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వీరాంజనేయులను పలు పాఠశాలలకు చెందిన టీచర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ నోడల్ చైర్మన్ లింగారావు, డేవిడ్‌పాల్, ప్రధానోపాధ్యాయులు మన్నెం హరిబాబు, కోటినాగులు, దూళిపాళ్ల శేషగిరి, సంపతి శ్రీనివాసరావు, చింతల రామకృష్ణ, అచ్యుత్‌మోహన్ పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్‌తో పరిశ్రమలు మూతపడే అవకాశం

మార్టూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన టారిఫ్ కారణంగా మార్టూరు, చిలకలూరిపేట పరిధిలోని స్పిన్నింగ్ మిల్లులు మూతపడి కార్మికులు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి చెప్పారు. శనివారం ఆమె మార్టూరులోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పరిశ్రమలకు ఇవ్వాల్సిన రాయితీలు సక్రమంగా మంజూరు చేయకపోవడంతో నిర్వహణ కష్టతరమైందన్నారు. గ్రానైట్ పరిశ్రమల నిర్వహణలో సబ్సిడీ రాయితీలు రాకపోవడం, ధరలేకపోవడం, అమ్మకాలు లేకపోవడంతో పరిశ్రమలలో కార్మికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులను గుర్తించాలని, వారికి అన్నివిధాలా ప్రభుత్వపరంగా సహాయ సహకారాలను అందించాలని, అన్ని పరిశ్రమలు సక్రమంగా సాగేవిధంగా ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ గంగయ్య, బత్తుల హనుమంతరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిమళించిన మానవత్వం



గోమాతకు సపర్యలు చేస్తున్న విద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో మానవత్వం పరిమళించింది. శనివారం సాయంత్రం చీరాల ఏరియా వైద్యశాల సమీపంలో ఓ గోమాత రోడ్డు వెంబడి ఫెన్సింగ్ వేసి ఉన్న చెట్ల ఆకులు తినేందుకు వెళ్లింది.ఆక్రమంలో ప్రమాదవశాత్తు కుడికాలు ఫెన్సింగ్ తీగల్లో చిక్కుకుని అల్లాడుతుంది. అదే సమయంలో కళాశాల నుంచి ఇంటికి వెళుతున్న గౌతమీ విద్యాసంస్థల విద్యార్థులు ఆ గోమాత దీనస్థితిని గమనించారు. అక్కడికి వెళ్లి గోమాత కాలును ఇనుప తీగల నుంచి బయటకు జాగ్రత్తగా తీశారు. రక్త గాయం కావడంతో కట్టుకట్టి సపర్యలు చేయడంతో ప్రజలు వారి సేవను హర్షిస్తున్నారు.

మెగా డీఎస్సీలో పీడీ పోస్టుకు ఎంపికైన వారికి సత్కారం



ఎంపికైన వారిని సత్కరిస్తున్న రాష్ట్రఅసోసియేషన్ ప్రతినిధులు

పంగులూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో క్రీడలలో ప్రతిభ చాటిన వందలాదిమందిని స్పోర్ట్స్ కోటాలో వ్యాయామోపాధ్యాయులు(పీడీలు)గా ఎంపిక చేయడం అభినందనీయమని కేకేఎఫ్ఐ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సీతారామిరెడ్డి చెప్పారు. 2023లో గోవాలో నిర్వహించిన జాతీయ క్రీడలపోటీలలో పాల్గొని బ్రాంజ్‌మెడల్ సాధించిన రాష్ట్రఖోఖో జట్టు క్రీడాకారులు 11మందికి రాష్ట్రప్రభుత్వం పోటీ పరీక్షతో నిమిత్తం లేకుండా పీడీ పోస్టులకు ఎంపిక చేసింది. ఖోఖో క్రీడలో ప్రతిభచాటిన క్రీడాకారులను గుర్తించి క్రీడలకోటాలో మెగా డీఎస్సీలో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొనియాడుతూ పంగులూరులో శనివారం సాయంత్రం అభినందనసభ నిర్వహించారు. ఎంపికయిన 11మంది క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, ఆర్‌వీ సుబ్బారావు,కుర్రా వెంకటరావు పాల్గొన్నారు.





వెంకటాచలం : కసుమూరులో చిన్న గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న దర్గా ముజావర్లు

ముగిసిన సంబరం

కసుమూరు, ఏఎస్‌పేటకు తరలివచ్చిన భక్తులు

- వివరాలు 8లో..

మతిమరుపు ముంచేస్తుంది!

జిల్లాలో 90వేల మందికిపైగా వ్యాధిగ్రస్థులు

- వివరాలు 8లో..

జేసీగా మొగిలి వెంకటేశ్వర్లు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడున్న కొల్లాబత్తుల కార్తీక్ బదిలీ చేసి, ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, వెంకటేశ్వర్లు 2014లో బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దారుగా విధులు నిర్వహించారు.

తలకొక సిమ్..
రూ.కోట్లలో సొమ్ము!

- రీచార్జి కోసం ఏటా రూ.590 కోట్ల వ్యయం
- జిల్లా జనాభా 29.64 లక్షలు.. సిమ్‌ల సంఖ్య 22.47 లక్షలు
- సామాన్యుడి పాలిట తూటాలా మారిన డేటా!

రాము ఆఫీస్ సిమ్‌తోపాటు వ్యక్తిగత సిమ్ ఒకటి వాడు తున్నారు. ఈయన భార్య ఒక సిమ్. బీటెక్ చదువుతున్న కుమారుడు రెండు సిమ్‌లు, సీనియర్ ఇంటర్ చదువుతున్న కుమార్తె ఒక సిమ్ వాడుతోంది. అంటే ఈ ఒక్క కుటుంబంలోనే ఐదు సిమ్‌లను (ఆఫీస్ సిమ్ మినహాయిస్తే) వినియోగిస్తున్నారు. ఒక సిమ్‌కు 28 రోజులకుగాను సరాసరిన రూ.300 రీచార్జి చేసినా రూ.1500 అవుతుంది. అంటే ఏడాదికి సుమారు రూ.20వేల వరకు రాము కుటుంబం సిమ్ రీచార్జీలకే ఖర్చు చేస్తోంది.

సమాచార విప్లవం వెల్లివిరుస్తోంది. ఎంతలా అంటే జిల్లా జనాభా ఎంతమంది ఉంటే అన్ని సిమ్ కార్డులు వినియోగించే స్థాయిలో పెరిగిపోతోంది. మొబైల్ నెట్ కనెక్షన్‌లో ప్రజలు ఏం చూస్తున్నారు.. ఏ మేరకు ప్రయోజనం పొందుతున్నారు అనే మాటను పక్కనపెడితే సిమ్ కంపెనీలు మాత్రం బాగానే లాభపడుతున్నాయి. రీచార్జి పేరిట జిల్లావాసుల కష్టార్జితంలో ఏటా రూ.590 కోట్లకుపైగానే వసూలు చేసుకొంటున్నాయి. ఇది కనిష్ఠంగా వేసుకున్న లెక్క. అత్యధిక శాతం మంది నెలకు రూ.299 ప్యాకేజీనే వాడుతున్నారు. ఈ ప్యాకేజీతో లెక్కగడితే జిల్లా సెల్‌ఫోన్ వినియోగదారుల రీచార్జి ఖర్చు మరో రూ.250 కోట్లు పెరుగుతుంది. అంటే ఏడాదికి మొబైల్ ఫోన్ల రీచార్జి కోసం చేస్తున్న ఖర్చు సరాసరి రూ.850 కోట్లు అన్నమాట.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

జిల్లా జనాభా 29.64 లక్షలు. వీరిలో ఆరేళ్ల వయసులోపు ఉన్నవారు 3.04 లక్షల మంది. ఆ తర్వాత ఆరేళ్ల పైబడినవారి సంఖ్య 26లక్షల 60వేలు. జిల్లాలో వినియోగంలో ఉన్న సిమ్ కార్డులు 22.47 లక్షలు. అంటే ఆరేళ్ల పైబడిన జనాభాలో 85 శాతం మంది సిమ్ కార్డులు కలిగి ఉన్నారన్నమాట. అంటే దాదాపుగా ఊహతెలిసిన ప్రతి ఒక్కరి వద్ద ఒక్కో సిమ్ము కార్డు యాక్టివేషన్‌లో ఉందన్నమాట. అంటే ప్రతి నెల వాటికి రీచార్జి చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారుల సమాచారం మేరకు ఆ సంస్థకు చెందిన సిమ్ కనెక్షన్లు 2.36 లక్షలు. మొత్తం అన్ని కంపెనీల సిమ్‌కార్డుల్లో బీఎస్ఎన్ఎల్ వాటా 10.50 శాతంగా అధికారులు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ కనెక్షను 2.36 లక్షలు ఉంటే ఇంతకన్నా ఎక్కువ నెట్‌వర్క్ కలిగిన ఎయిర్‌టెల్, జియో తదితర కంపెనీల కనెక్షన్లు అన్నింటిని లెక్కకడితే జిల్లాలో 22,47,619 కనెక్షన్లు ఉన్నాయి.





● రీచార్జి ఖర్చు రూ.కోట్లలోనే..

ప్రస్తుతం డేటా ప్యాకేజీ లేని రీచార్జి దాదాపుగా ఏ కంపెనీలోనూ లేదు. అంతా డేటామయమే. రోజుకు 1.5, 2.0, 3.0, 5.0 జీబీ డేటా ప్యాకేజీలే. ప్రస్తుతం దాదాపుగా ఉన్నవన్నీ స్మార్ట్‌ఫోన్లే కాబట్టి వినియోగదారులు కూడా డేటా ప్యాకేజీని చూసే రిచార్జ్ చేసుకొంటున్నారు. ప్రస్తుతం ఒక ప్రధాన కంపెనీ 28 రోజులకు 2జీబీ డేటా ప్యాకేజీతో అన్ లిమిటెడ్ కాల్స్ సౌకర్యం కల్పిస్తోంది. 28 రోజుల కాలానికి రీచార్జి ఖరీదు రూ.199 రూపాయలు. జిల్లాలోని వినియోగదారలంతా ఈ తక్కువ ప్యాకేజీనే వాడుతున్నారని లెక్కగట్టినా నెలకు రూ.45.40 కోట్లు. ఏడాదికి (13 రీచార్జిలు) రూ.590.22 కోట్లు. కానీ ఎక్కువ శాతం మంది రోజుకు 1.5 జీబీ డేటా ప్యాకేజీనే తీసుకొంటున్నారు. దీని ఖరీదు నెలకు 299 రూపాయలు. ఈ మొత్తంతో లెక్కిస్తే ఏడాది రీచార్జి వ్యయం సుమారు రూ.850 కోట్ల వరకు ఉంటుంది.

● తాగడానికి, వాగడానికి భారీ వ్యయం

జిల్లా ప్రజలు ఏడాది కాలంలో ఎక్కువ ఖర్చు చేసే నిరర్థక ఆదాయ అవసరాల్లో మందు, మొబైల్ రీచార్జీల గురించే ప్రధానంగా చెప్పుకోవాలి. కానీ వీటికే జిల్లా ప్రజలు ఏటా సుమారు రూ.2500 కోట్లు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో మందుబాబులు రోజుకు సగటున 4కోట్ల రూపాయలకు తాగుతున్నారు. అంటే ఏడాదికి రూ.1700 కోట్లు మందు కోసం ఖర్చు పెడుతున్నారు. ఇది కొంతలో కొంత నయం. ఎందుకంటే ప్రభుత్వాలు నడవాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా మద్యం ఆదాయమే దిక్కు. ఈ క్రమంలో మందు కోసం చేసిన ఖర్చులో కొంతైనా తిరిగి పథకాల రూపంలో, అభివృద్ధి పనుల రూపంలో తిరిగి వస్తుంది. కానీ మొబైల్ రీచార్జీలకు చేసే వ్యయం గురించే ప్రజలు ఆలోచించాలి. రోజుకు సగటున 1.5 కోట్ల రూపాయలు రీచార్జిల కోసం ఖర్చు చేస్తున్నారు. ఏడాదికి రూ.600 నుంచి 850 కోట్ల వరకు వ్యయం చేస్తున్నారు.



ఆదివారం ప్రత్యేకం

డీసీఎంఎస్ మాజీ చైర్మన్

వీరి చలపతి అరెస్ట్

2023లో టీడీపీ నేత ఇల్లు ధ్వంసంపై కేసు నమోదు

వైసీపీలో కలకలం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావును పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారని, పంచాయతీ ఎన్నికల్లో ఎవరూ నిలబడక పోయినా జిల్లా ఉపాధ్యక్షుడిగా కరకటి మల్లికార్జున ముందుకు సాగుతున్న సమయంలో 2023 ఏప్రిల్ 22న ఆయన ఇల్లు, వాటర్ ప్లాంట్‌ను వీరి చలపతి ధ్వంసం చేశారని, ఆయనపై హత్యాయత్నం చేశారనే ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు రూరల్ పోలీసులు చలపతిని అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి తరలించి విచారించారు. ఇప్పటికే వీరి చలపతిపై కొడవలూరు, విడవలూరు, కోవూరు పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో నెలల తరబడి చలపతి పరారీలో ఉన్నారు. అయితే ఈనెల 19న ఓ కేసులో ముందస్తు బెయిల్ రావడంతో ఆయన నెల్లూరుకి చేరుకున్నారు. శనివారం రాజుపాలెంలో ఓ సమావేశం నిర్వహించి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించారు.ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సైతం హాజరయ్యారు. కాగా ఆదివారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి భారీ సంఖ్యలో జనసందోహంతో వెళ్లి బెయిల్ పత్రాలు అందించి రావాలని కార్యకర్తలకు చలపతి సూచించారు. అనంతరం అక్కడ నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి ఆయన ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అయితే చలపతి అరెస్ట్ అయ్యారన్న విషయం తెలుసుకున్న కోవూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి తరలివస్తారని పోలీసులు భావించి, భారీ బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేశారు.

అందరి లక్ష్యం గ్రీన్ ఏపీ కావాలి

● స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ శుక్లా



నాటిన మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరురూరల్, సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడేందుకు పచ్చదనం పెరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీవీనగర్ లోని పార్కులో జేసీ కార్తీక్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అందరి లక్ష్యం గ్రీన్ ఏపీ కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గడిచిన 8 నెలలుగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని వెల్లడించారు. నవంబరులో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ఇప్పుడే మొక్కలు నాటితే అప్పటికి బాగా పెరుగుతాయని తెలిపారు. ప్రతీ ఒక్కరు విధిగా ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డీసీ చెన్నుడు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



దగదర్తి విమానాశ్రయ భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

వచ్చే ఏడాది ఏప్రిల్‌కు రామాయపట్నం పోర్టు పూర్తి

- ఈలోపు పనులు వేగవంతం చేయండి
- అధికారులకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఆదేశం

గుడ్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను, మరింత వేగవంతంగా పూర్తిచేసే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ టి. కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. శనివారం పోర్టు నిర్మాణాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఇప్పటికే 71 శాతం పనులు పూర్తయ్యాయని, పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పనుల పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోర్టు నిర్మాణంతో పాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటులో చేవూరు గ్రామం కొత్తపారిశ్రామిక విప్లవానికి సాక్ష్యంగా మారుతుందన్నారు. చేవూరులో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు వేగవంతంగా భూసేకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ హబ్‌లో బీపీసీఎల్ వంటి ప్రధాన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వేలాది ఉద్యోగాలు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం పోర్టు, అనుబంధ పరిశ్రమల ఏర్పాట్లకు సంబంధించిన భూమి రికార్డు మ్యాప్‌లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ, గుడ్లూరు తహసీల్దారు విజయ భాస్కర్, పోర్టు ప్రతినిధులు తధితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో విమానాశ్రయం

దగదర్తి మండలం దామవరంలో గతంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆయన పరిశీలించి, తహసీల్దారు కృష్ణ ద్వారా వివరాలు సేకరించారు. పీపీపీ విధానంలో ఈ విమానాశ్రయం నిర్మించనున్నారని, నవంబరులోపు దరఖాస్తులు దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తాయని తెలిపారు. డిసెంబరు నాటికి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. 2 సంవత్సరాల్లో విమానాశ్రయం పూర్తి అవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

● ఫిషింగ్‌హార్బర్‌లో త్వరలో ఎగుమతులు

బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నెలోని ఫిషింగ్ హార్బర్‌ను స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు శనివారం పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ హిమాన్షు శుక్లా, కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, ఆర్డీవో వంశీకృష్ణ తదితరులు ఉన్నారు. పనుల ప్రగతిని అర్చించిన అనంతరం కృష్ణబాబు మత్స్యకారులతో మాట్లాడారు. త్వరలో ఫిషింగ్ హార్బర్‌లో ఎగుమతులు దిగుమతలు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

వాహనమా.. ఇప్పుడు వద్దులే!



వాహనాల కొనుగోలుపై పండుగలు, ఇతర సందర్భాలు లేకున్నా ఆఫర్లు మాత్రం అంబరాన్ని అంటుతున్నాయి. అయినా వాహనాలు కొనుగోలుకు మాత్రం ప్రజలు ముందుకు రావడం లేదు. అడ్వాన్సు, డౌన్‌పేమెంట్ కూడా అవసరం లేదు. ఫైనాన్స్‌లో వాహనాన్ని తీసుకెళ్లండి అంటున్నా ససేమీరా అంటున్నారు. ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం, ఒక్కటైతే దసరా ఆఫర్లు మరో కారణం. నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ రేట్లను రెండు శ్లాబులకు తగ్గించేలా కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 22వ తేదీన నూతనవిధానం అమల్లోకి వస్తుంది. ప్రతిపాదనల ప్రకారం ప్రస్తుతం 5, 12, 18, 28 శ్లాబులు ఉండగా, ఇకపై 5, 18 శ్లాబులు మాత్రమే ఉంటాయి. కేంద్రం నిర్ణయంతో వాహన ధరలు భారీగా తగ్గనున్నాయి. సుమారు రూ.50 వేల నుంచి 2 లక్షల వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయి. అంతేగాక దసరా సందర్భంగా వివిధ కంపెనీలు ఆఫర్లు కూడా ప్రకటిస్తాయి. వీటన్నిటి దృష్ట్యా ప్రస్తుతం వాహనాల కొనుగోలు ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

పెరిగి.. తగ్గి..
పెరిగిన వరద

- 'సోమశిల'కు 37,212 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల




అనంతసాగరం సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. శుక్రవారం 25,449 క్యూసెక్కులు వస్తుండగా శనివారం ఉదయం 6 గంటకు 37,212 క్యూసెక్కులు నమోదవగా 11 గంటలకు 22,524 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో డ్యాంలో నీటి నిల్వ 73.378 టీఎంసీలుగా నమోదైంది. దిగువ డెల్టాకు 5, 6, 7 గేట్లు ఎత్తి 27,750, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● ఆదినిమ్మాయపల్లి గేజి వద్ద పెరిగిన వరద

కడప జిల్లా ఆదినిమ్మాయపల్లి వద్ద పెన్నానదికి వరద పెరుగుతోంది. పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉపనదుల నుంచి పెన్నాలోకి వరద చేరుతున్నట్లు అధికారులు గుర్తించారు. 50 నుంచి 60 వేల క్యూసెక్కులు నమోదవుతున్నట్లు వారు వెల్లడించగా ఈ ప్రవాహం ఆదివారం ఉదయం నాటికి సోమశిలకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో ముందస్తుగా దిగువకు వదులుతున్న నీటి ప్రవాహాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ మేరకు తీరగ్రామాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జయవర్ధన్ పిలుపునిచ్చారు.

● 'సంగం' నుంచి నీటి విడుదల

సంగం, (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం తగ్గి శనివారం మళ్లీ పెరిగింది. బ్యారేజ్ వద్ద ఉదయం 4 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, నీటిమట్టం 10 అడుగులు ఉన్నది. అయితే శుక్రవారం సోమశిల నుంచి అంచెలంచెలుగా నీటి విడుదలను 26 వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ నీరు సంగం బ్యారేజ్‌కి చేరడంతో క్రమేణా నీటి ప్రవాహం పెరిగింది. దీంతో వచ్చిన నీరు వచ్చినట్టే బ్యారేజీలో 26 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. దిగువన నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



సంగం బ్యారేజ్ దిగువకు వెళ్తున్న నీటి ప్రవాహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

ఈవోపీఆర్డీ, ఏవోల బదిలీ

అల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరు మండల ఈవోపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న పెంచల వీరేంద్ర, ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లులు బదిలీ అయ్యారు. పెంచల వీరేంద్ర ఎంపీడీవోగా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లా యాదమరికి, వెంకటేశ్వర్లు ఎంపీడీవోగా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లా, వి.కోటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వారికి సన్మానించి అభినందనలు తెలపగా టీడీపీ నాయకులైన ఇస్కపల్లి పంచాయతీ సర్పంచ్ పాటి రంజిత్ కుమార్, ఉపసర్పంచ్ పాపన బోయిన జగన్మోహన్‌రావు, వార్డు సభ్యుడు రవ్వా హరికుమార్‌లు వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఈవోపీఆర్డీ, ఏవోలను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం 9 అడుగులు

లింగసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 9 అడుగులకు చేరింది. వరదనీరు ప్రాజెక్టులోకి చేరడంతో నీటిమట్టం 2.3 అడుగులు పెరిగింది. వర్షాలకు ముందు 6.9 అడుగుల మేర నీటిమట్టం ఉండేది. అయితే మరో మూడు, నాలుగు అడుగుల మేర నీరు వస్తే, ప్రాజెక్టులోని పచ్చని కలుషిత నీటి సమస్య తీరే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిలో నుండి మంచినీటి పథకాలకు ప్రతిరోజూ 7 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నట్లు ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు చెప్పారు.

భక్తులు నుదుట బొట్టు పెట్టాలి


భక్తులకు నుదుట బొట్టుపెట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీ చంద్రశేఖర్

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అర్చకులు బొట్టు పెట్టడం వల్ల ఆధ్యాత్మికత సంతరించుకుంటుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శనివారం దర్శనానికి వేళ్లే భక్తులకు నుదుట బొట్టుపెట్టే కార్యక్రమాన్ని డీసీ చంద్రశేఖర్ ప్రారంబించారు. భక్తులు ఆలయంలోకి ప్రవేశించి, దర్శనానికి వెళ్లే ముందు అర్చకులచే నుదుట బొట్టు పెడితే భక్తుల్లో విశ్వాసం, భక్తితత్పరత పెంపొందుతాయని డీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

టీసీపాలెంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్


ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హైమావతి

బిట్రగుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో ప్రభుత్వ వైద్యులు రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు కే గిరిబాబు, నాగులవరం పీఏసీఎస్ డైరెక్టర్ వీ సుధాకర్, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, స్థానికులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు జడ్పీ బాలికల ఎంపిక


రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన బాలికలతో హెచ్‌ఎం

బిట్రగుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాధరావుపేట జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని పలువురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌రావు శనివారం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన క్రీడా ఉపాధ్యాయులను అభినందించారు.

వరవ కాలువలో మట్టి తొలగింపు


వరవ కాలువలో తొలగించిన నీటి పారుదలకు అడ్డుగా ఉన్న మట్టి

కావలి, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కావలి అన్నపుగుంట నుంచి వరవ కాలువకు వెళ్లే మురుగునీటి ప్రవాహానికి గతంలో అడ్డుగా వేసిన మట్టి కట్ట ఆటంకంగా మారటంతో శనివారం ఆమట్టిని తొలగించారు. మున్సిపల్ అధికారులు ఎక్సకవేటర్‌తో వరవ కాలువలోని మట్టిని తొలగించడంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం తొలగింది.

ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారుల అవస్థలు

కావలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమాహాల్ రోడ్డులోని పెండెంవారి వీధిలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అక్కడ ఉన్న హోల్‌సేల్ దుకాణాల కారణంగా వేళాపాళలు లేకుండా లారీలకు లోడింగ్ అన్‌లోడింగ్ జరుగుతుండటంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. శనివారం ఉదయం సినిమాహాల్ రోడ్డులో నుంచి పెండెం వారి వీధిలోకి ఒక లారీ రివర్స్ అవుతున్న సమయంలో అక్కడ ఇరుక్కుని సుమారు గంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. అసలే రోడ్డు ఇరుకుగా ఉండటం దాని ముందే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినా ట్రాఫిక్ స్తంభిస్తోంది. వాస్తవంగా కావలి పట్టణంలో ఉదయం 8గంటల లోపు రాత్రి 10 గంటల తర్వాత మాత్రమే లోడింగ్ అన్‌లోడింగ్ లారీలను అనుమతించాలి.


సినిమా హల్ రోడ్డులో లారీ ఇరుక్కుని స్తంభించిన ట్రాఫిక్

కానీ పోలీసులు పగటిపూట లోడింగ్ అన్‌లోడింగ్ జరుగుతున్న వాహనాలను కట్టడి చేయలేక పోతున్నారు. దీంతో అక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటంతో ప్రజలు వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పగటి పూట లోడింగ్, అన్‌లోడింగ్ వాహనాలను కట్టడి చేయాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


వీవీపాలెం : మొక్క నాటుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత


కొండాపురం : మొక్క నాటుతున్న ఎంపీడీవో, కమిషనర్ తదితరులు


కావలి టౌన్ : మొక్క నాటుతున్న అధ్యాపకులు విద్యార్థులు

అల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అల్లూరు ఎంపీడీవో రజనీకాంత్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ పరిధిలో కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యాసంస్థల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయాల ఆవరణలు, ప్రభుత్వ లేఅవుట్లలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, డిడిఓ వరప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కాకుటూరులో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యాయురాలు సుకన్య, కార్యకర్తలు హైమావతి, వేంకటేశ్వరమ్మ, రమాదేవి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ అన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో బాగంగా శనివారం మండలంలోని గుడవళ్లూరు పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు లలలలలలలలనాటారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-1 కె.రవికుమార్, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పీ.చంద్రబాబునాయుడు, పీ. రమేష్, సర్పంచ్ మాచర్ల, ప్రధానోపాధ్యాయుడు వి.రాధాక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కావలి (టౌన్) : జేబీ డిగ్రీ కళాశాలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కావలి ఫారెస్ట్ డివిజనల్ అధికారిణి అరుణ సౌజన్యంతో కళాశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి : స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నాగసముద్రం సచివాలయ ఆవరణలో సర్పంచ్ డమ్ము శ్రీనివాసులు ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ వెలుగోటి మధు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా మానవాళి మనుగడకు చెట్లు అవసరమని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి సురేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటి సరఫరాకు చర్యలు

- రూ. 2.50 లక్షలతో మోటార్లు, ప్యానెల్ బోర్డు, సిలిండరు కొనుగోలు
- ఏఈఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో మరమ్మతులు

లింగసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాళ్లపాడు ప్రాజెక్టులో నీరు అడుగంటిపోయింది. పచ్చ రంగులో కలుషితమైన నీరు మంచినీటి పథకాల ద్వారా సరఫరా అవుతుండడంతో ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కలుషిత తాగునీటికి సంబంధించిన వార్తకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పందించారు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నవకిశోర్ ఆదేశాల మేరకు శనివారం మండల ఏఈఈ సీహెచ్ రాజశేఖర్, రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకాన్ని సందర్శించారు. 1 హెచ్‌పీ మోటార్లు 4, ప్యానెల్ బోర్డులు, వైరింగ్, స్విచ్ బోర్డులు కొత్తవి ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న 100 కేజీల గ్యాస్ సిలెండరు స్థానంలో 900 కేజీల నూతన గ్యాస్ సిలెండరును ఏర్పాటు చేశారు. దాని నుండి 2 పాయింట్ల బదులు 4 పాయింట్ల గ్యాస్‌ను విడుదల చేసి క్లోరినేషన్ చేయించారు. సెలిమెంటేషన్ ట్యాంకులో చక్రానికి మరమ్మతులు చేయించి నీటిలో ఆటలంను కలిపారు. అనంతరం తాగునీటిని సరఫరా చేశారు. ఇందుకు సుమారు రూ.2.50 లక్షలు ఖర్చు అయిందని, ప్రస్తుతం 50 శాతం తాగునీరు శుభ్రంగా వస్తున్నట్లు ఏఈ రాజశేఖర్ చెప్పారు. వాటర్ ప్లాంటులోని ఫిల్టర్ బెడ్‌లను శుభ్రం చేసి, వారం రోజుల లోపు వంద శాతం పరిశుభ్రమైన నీరు అందిస్తామన్నారు. ఏఈఈ వెంట మంచినీటి పథకం నిర్వహకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



కలుషిత నీటి బాటిళ్లను చూపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్

రూ. 3 కోట్ల సబ్ ప్లాన్ నిధుల విడుదల

కందుకూరు,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు నియోజకవర్గానికి రూ. 3 కోట్ల సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన కందుకూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ఎస్సీ కాలనీల రూపురేఖలు మారుస్తామన్నారు. రోడ్లు, కాలువలు వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ కాలనీలకు నిధులు కేటాయించకుండా కేవలం నినాదాలతో సరిపుచ్చిందని విమర్శించారు. కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రోడ్ల విస్తరణ, సెంట్రల్ డివైడర్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అధునాతన యంత్రాలతో ఏ రోజు చెత్తను ఆ రోజే రీసైక్లింగ్ చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు.


నూతన కంపాక్టర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మొక్కల పెంపకాన్ని ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని క్లబ్ రోడ్డులో శనివారం ఉదయం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలంతా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఏపీగా మార్చాలన్న సీఎం చంద్రబాబు సంకల్పానికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో 'స్వస్థ నారి - స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ రోడ్డులో రూ. 18 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, స్టెల్లా కారుణ్య, రమాప్రియ, ధర్మతేజ, బీజేపీ నాయకులు జీ. హరిబాబు, ఎం. వరప్రసాదరావు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పోకూరి రాంబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి, కొడాలి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కందుకూరు మున్సిపాలిటీలో చెత్త తరలింపు కోసం రూ. 1.16 కోట్లతో నూతనంగా కొనుగోలు చేసిన కంపాక్టర్ వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభించారు. పట్టణంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కందుకూరు మున్సిపాలిటీలోని పలు వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అనూష, మున్సిపల్ మాజీవైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం


పోషకాహారం గురించి వివరిస్తున్న సీడీపీవో

కలిగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ పద్మజా కుమారి పేర్కొన్నారు. మండలంలోని పెద అన్నలూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ మాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యదశ నుండి చిన్నారుల ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్థూలకాయ నివారణ తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు మహేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త పి సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కమిటీ ఎన్నిక

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఐటీయూ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా సాధు చెన్నకేశవులు కో కన్వీనర్‌గా మిట్టనోసల సుబాను ఎంపిక య్యారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం శాసనసభలో కార్మికుల పనిగంటలను 8 నుండి 13 గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం వల్ల కార్మికులపై తీవ్రమైన పనిభారం పడుతుందన్నారు.

కొనసాగిన డాక్యుమెంట్ రైటర్స్ నిరసన

కావలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లలో పాత విధానం కొనసాగించాలని కోరుతూ కావలిలో శనివారం డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్ పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తంచేశారు. ఎలాంటి డాక్యుమెంట్లు రాయకుండా, స్టాంప్‌లు ఇవ్వకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చలంచర్ల నాగరాజు, పీడీఎం ప్రసాద్, స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషయ్య, డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు కూర్చుని నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

కొండాపురం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం అని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు పేర్కొన్నారు. మండలంలో శనివారం జరిగిన క్లస్టర్ సమావేశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలన్నారు. క్లస్టర్ సమావేశాల ద్వారా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఆన్‌లైన్లో శిక్షణ ఇస్తామన్నారు. మండలకేంద్రంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశాలను తనిఖీచేసిన ఆయన ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-1 కె రవికుమార్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వీ రాధాక్రిష్ణ, ఐ.రామమోహన్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

కావలి (టౌన్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే డీ. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్‌లోని ప్రైవేట్ పాఠశాల సమావేశ మందిరంలో ఏబీవీపీ విభాగ్ అభ్యాస వర్గ్ సమావేశం అనంతరం శోభాయాత్ర జరిగింది. ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ గంగాధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏబీవీపీ క్రమశిక్షణ, దేశభక్తికి మారుపేరన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాము, కావలి ఏఎంసీ ఛైర్‌పర్సన్ పి అలేఖ్య, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వినయ్, మహిళా కన్వీనర్ డింపుల్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు రత్నం, దామోదర్‌నాయుడు, బ్రహ్మానందం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కావలిలో ఏబీవీపీ శోభాయాత్ర

యాక్సెస్ బ్యాంకు ఆలోచన విరమించుకోవాలి

కావలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల బ్యాంకు ఖాతాలన్నీ యాక్సెస్ బ్యాంకులోనే పెట్టాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. ఈమేరకు శనివారం కావలి మున్సిపల్ కమిషనర్‌కు స్థానిక యూనియన్ నాయకులతో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ ప్రయివేట్ కార్మికులకు జిల్లాకలెక్టర్ నూతనంగా విడుదల చేసిన జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, టీ. వెంకటేష్, వై. నారాయణ, పీ. సుబ్బరాయుడు, బీ. శ్రీను, గుర్రం వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తదితరులు

పోరుబాటకు టీచర్లు సిద్ధం కావాలి

కావలి (టౌన్) సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరగనున్న పోరుబాటకు ఉపాధ్యాయులు సమాయత్తం కావాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ కంచర్ల మధుసూదన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ వెంగళరావునగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలు, గోడపత్రికలు ఆవిష్కరించారు. మధుసూదన్‌రావు మాట్లాడుతూ అక్టోబరు 7న విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న ఉపాధ్యాయుల ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు ఎస్‌కె ముజీబ్, ఐహెచ్‌ఎల్ ప్రసాద్, వి వెంకటేశ్వర్లు, ఎ మంజువాణి తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

లింగసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా మానిటరింగ్ అధికారి బి సుధీర్‌బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని పెదపవని జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను తనిఖీ చేశారు. ఎఫ్ఎల్ఎన్‌ను ఉపయోగించి బోధించాలన్నారు. సమావేశాలలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో కొండాపురం ఎంఈవో కె రవికుమార్, ప్రధానోపాధ్యాయులు టి శ్రీనివాసులు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకాతో పశుసంపదను కాపాడుకోవాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయించి, పశుసంపదను కాపాడుకోవాలని మాజీ ఎంపీటీసీ పొడపాటి నరసింహం తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, చుండి, కాకర్లపాలెం గ్రామాల్లో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేశారు. బడేవారిపాలెంలో పశువులకు ఆయన టీకా వేసి కార్యక్రమం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాదికారి సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కావలిలో బిహార్ వాసి మృతి

కావలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మద్దూరుపాడు లక్ష్మీట్రేడర్స్ రైస్‌మిల్లు వద్ద శుక్రవారం రాత్రి బిహారు రాష్ట్రం ఈస్ట్ చంప్రాన్ జిల్లా చందాలి గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ యాదవ్ (32) మృతి చెందారు. రంజిత్‌కుమార్ తన బంధువులైన ఉమాశంకర్, గౌరీ శంకర్, కుమార్, చందూజీలతో కలిసి మిర్యాలగూడకు చెందిన మాధవరావు లారీలకు డ్రైవర్లగా, హెల్పర్లగా పనిచేస్తుంటారు. ఆ లారీలు తెలంగాణా, ఆంధ్రలో రైస్‌మిల్లుల నుంచి వరి పొట్టు తీసుకుని క్రిష్ణపట్నం పోర్టుకు తీసుకెళుతుంటాయి. ఈనేపథ్యంలో శుక్రవారం వరి పొట్టుకోసం మద్దూరుపాడు రైస్ మిల్లు వద్దకు రాగా లారీ దగ్గర రంజిత్‌కుమార్ యాదవ్ కింద పడి ఉండటంతో ఆయనను వెంటనే కావలి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. గుండెపోటుతో మృతి చెందాడా లేక ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా అనే అనుమానంతో మృతదేహాన్ని శనివారం కావలి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రభుత్వ నిర్ణయంతోనే
కార్మిక సంక్షేమ పథకానికి మోక్షం

● విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి ఉపకమిషనర్

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అమలులో ఉన్న వివిధ కార్మిక చట్టాలు, కార్మిక సంక్షేమ పథకాలు గురించి జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి ఉపకమిషనర్ సీహెచ్.విజయకుమార్‌రెడ్డి వివరించారు. తన కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో ముఖాముఖిగా మాట్లాడారు.

? భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకం అమలవుతుందా.

! భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 1996లో ప్రభుత్వ చట్టం చేసింది. అది 2005 నుంచి అమలులోకి తెచ్చింది.

? జిల్లాలో ఎంతమంది భవన నిర్మాణ కార్మికులు నమోదు చేసుకున్నారు.

! 2005 నుంచి 1,32,000 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 2025లో ఆగస్టు వరకు 206 మంది రిజిస్టర్ చేసుకున్నారు.

? కార్మికులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయా.

! 2021లో అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిలిపివేసింది. ప్రస్తుతం భవన నిర్మాణ సంక్షేమ ఫలాలకు ఎలాంటి దరఖాస్తులు తీసుకోవడంలేదు.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు ప్రభుత్వం నిర్ణయం మీదే ఉంది.

? ఈ శ్రమ్ పథకం గురించి తెలపండి

! ఈ శ్రమ్ పథకాన్ని అసంఘటిత కార్మికుల గణన కోసం కేంద్రం ప్రవేశ పెట్టింది. దరఖాస్తు చేసుకున్న ప్రతీ అసంఘటిత కార్మికునికి కార్డు ఇస్తుంది. 2021 నుంచి ఈ పథకం అమలులో ఉంది. ఈ శ్రమ్ కార్డుదారులకు 12 సంక్షేమ పథకాలు అమలు చేయాలని కేంద్రం ఆలోచనలో ఉంది.

? బాలకార్మిక నిరోధక చట్టానికి ఎలా అమలు చేస్తున్నారు.

! ప్రతీ 3నెలలుకి బాల కార్మిక చట్టంపై ప్రత్యేక డ్రైవ్‌లు చేస్తున్నాం.

? భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధికి సెస్సు ఎంత వసూలైంది

! భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధికి ఈ నెలవరకు జిల్లాలో రూ.16.40వేలు వసూలైంది.

? కార్మిక చట్టాలు ఎలా

! ఈ సంవత్సరం ఇప్పటివరకు కార్మిక నష్ట పరిహార చట్టం కింద 12కేసుల్లో రూ.29లక్షలు కార్మికులకు ఇప్పించాం. కార్మికులు - యజమానులకు వచ్చిన వివాదాలపై జాయింట్ కమిటీ సమావేశాల్లో 36 మందికి రూ.23.77వేల పరిహారం ఇప్పించాం.

హైవే నిర్వహణ ఇలాగేనా...!?



ముంబాయి హైవేకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న ఇసుక

నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి నిర్వాహణ ఏజెన్సీ రోడ్డు నిర్వహణను గాలికి వదిలేసింది. రహదారిలో ద్విచక్ర వాహనాలు, బాటసారులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మార్జిన్‌లో ఎటు చూసినా ఇసుక చేరి ప్రమాదకరంగా ఉంది. అసలే ఇరుకైన రహదారిలో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే పక్కన ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. రోడ్డుకు ఇరువైపులా ఇసుక, మట్టి ఉండటంతో పట్టుజారి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన ఏజెన్సీ బాధ్యులు చేతులెత్తేశారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



- సంగం, (ఆంధ్రజ్యోతి)

స్త్రీశక్తి.. ప్రయాణంపై ఆసక్తి !

ఉదయగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమల్లో భాగంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. బస్సుల్లో అక్యుపెన్సీ శాతం పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందుతోంది.ఆగస్టు 15న స్త్రీశక్తి పథకం ప్రారంభం అయ్యింది. నిత్యం నెల్లూరు రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో గతంలో రోజుకు 40 వేలు మంది ప్రయాణించేవారు, స్త్రీశక్తి పథకం అమలు చేసిన తరువాత 70 వేల మంది ప్రయాణిస్తున్నారు. అందులో 60 శాతం మంది మహిళలే ఉన్నారు. ప్రధానంగా నెల్లూరు-1,2 గూడూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి డిపోల పరిధిలో ఆక్యుపెన్సీ బాగా పెరిగింది. గతంలో రీజియన్ పరిధిలో ఆక్యుపెన్సీ 68 ఉండగా ప్రస్తుతం అది 81కి చేరింది.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు

ఆక్యుపెన్సీ శాతం పెరిగింది...

స్త్రీశక్తి పథకం అమలుతో రీజియన్ పరిధిలో ఆక్యుపెన్సీ శాతం బాగా పెరిగింది. గతంలో 68 ఉండగా స్త్రీశక్తి పథకం అమలు చేసిన తరువాత 81కి చేరింది. యంలో అదనపు సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపడతాం.

- షేక్ షమీమ్, ఆర్ఎం

జీవితం జ్ఞాపకాల దొంతర అంటారు. గడిచిన కాలంలోని మధుర ఘట్టాలను స్మరించుకోవాలంటే జ్ఞాపకశక్తి ఉండాలి. అయితే వయసు మళ్లేకొద్దీ మతిమరుపు అనే వ్యాధి జ్ఞాపకశక్తి హరిస్తుంటుంది. ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. కొన్నిసార్లు ప్రమాదాలకు హేతువు కూడా అవుతుంది. కొంతకాలానికి శారీరక వ్యవస్థ మీద నియంత్రణ కోల్పోయి జీవితం అస్తవ్యస్తం అవుతుంది. ఇలా జ్ఞాపకశక్తిని కోల్పోవటమే వైద్య పరి భాషలో అల్జీమర్స్ (మతిమరుపు) అంటారు. జ్ఞాపకశక్తి క్రమేపి తగ్గిపోయి (డెమెన్షియా) వ్యాధికి గురై బంధువులు, స్నేహితులతోపాటు కుటుంబ సభ్యులను కూడా గుర్తుపట్టలేని స్థితికి చేరుకోవ డమే అల్జీమర్స్. ఈ వ్యాధిగ్రస్థులకు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరం. వ్యాధి నిర్లక్ష్యం చేస్తే మంచా నికే పరిమితమయ్యే పరిస్థితి వస్తుంది. - నెల్లూరు(వైద్యం),(ఆంధ్రజ్యోతి)

మతిమరుపు.. ముంచేస్తుంది!

నేడు ప్రపంచ అల్జీమర్స్ డే



- అల్జీమర్స్ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు
- కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరం
- 60ఏళ్లు దాటితే జాగ్రత్త అంటున్న వైద్యులు
- జిల్లాలో 90వేల మందికిపైగా వ్యాధిగ్రస్థులు

అల్జీమర్స్ వ్యాధిగ్రస్థులు జిల్లావ్యాప్తంగా 90 వేల మందికిపైగా ఉన్నారు. 60 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వయసులో ఉన్న వారిలో 10శాతం మంది, 85 ఏళ్ల పైబడిన వారిలో 50 శాతం మంది ఈ వ్యాధికి గురవుతున్నట్లు వైద్యులు తెలియజేస్తున్నారు. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారే ఈ వ్యాధికి గురవుతున్నారు.

వేల సంఖ్యలో బాధితులు

మానసిక ఒత్తిడికి అల్జీమర్స్‌కు అవినాభావ సంబంధం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనిషి ఒత్తిడికి గురయినప్పుడు మెదడులో విషయగ్రహణ చర్యను అడ్డుకునే అల్లోప్రెగనోలోన్ అనే స్టెరాయిడ్స్ స్థాయిలు అధికమవుతాయి. ఇది ఎక్కువ కాలం కొనసాగితే అల్జీమర్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. అల్జీమర్స్ వ్యాధితో మెదడు కణాలు దెబ్బతింటాయి. అందుకని ఒత్తిడిని బాగా తగ్గించుకోవాలి.

జ్ఞాపకశక్తి క్రమేపీ తగ్గిపోయి (డెమెన్షియా), తెలివి(మెమోరీ) తగ్గి బంధువులు, స్నేహితులతోపా టు కుటుంబ సభ్యులను మరిచిపోయే స్థాయికి చేరుకోవడం అల్జీమ ర్స్ వ్యాధి లక్షణం. ఈవ్యాధిని నిర్లక్ష్యం చేస్తే వ్యాధిగ్రస్థుడు మంచాని కే పరిమితం కావాల్సిందే. తద్వారా కు టుంబ సభ్యుల అనాదరణకు గురవుతా రు. 60 ఏళ్ల నుంచే మతిమరుపు వ్యాధి ప్రారంభమై 80 ఏళ్లకు తీవ్ర దశకు చేరుతుంది. ఈ వ్యాధి కారణంగా కొంతమంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోతారు. వ్యాధి వచ్చిన వారిని ఒంటరిగా వదలకూడదు.

● మొదట్లోనే జాగ్రత్త పడాలి

మొదటిదశలోనే అల్జీమర్స్‌ను గుర్తిస్తే వ్యాధితీవ్రత నియంత్రించవచ్చు. ఒకసారి వ్యాధికి గురైతే పూర్తిగా నివారణ వీలుకాదు. నియంత్రణ మాత్రమే చేయవచ్చు. వయసు మీరక పోయినా, తలలో రక్తం గడ్డకట్టడం, తలకు తీవ్ర గాయం అయినప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తే అల్జీమర్స్ వ్యాధిగా నిర్ధారించరాదు. రక్తంలో సోడియం, క్రియాటీన్, థైరాయిడ్ మోతాదు తగ్గితే అల్జీమర్స్ వ్యాధి లక్షణాలు బయటపడతాయి. సాధారణ రక్తపరీక్షల ద్వారా వీటి మోతాదును తెలుసుకోవచ్చు, ఎంఆర్ఐ, సిటీస్కాన్ చేయటం ద్వారా కూడా నిర్ధారణ చేయవచ్చు. వెన్నులోని కొంత నీరు తీసుకుని సీఎస్ఎఫ్ పరీక్ష ద్వారా వ్యాధిని కనుక్కోవచ్చు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చు. వైద్యుల పర్యవేక్షణలో 3 నుంచి 6 నెలల్లో వ్యాధిని నియంత్రించుకునే అవకాశం ఉంది. రోగి రోజూ చేసే పనులను గుర్తుచేసుకునేలా కుటుంబ సభ్యులు సహకారం అందించాలి.

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు



అల్జీమర్స్ నియంత్రణకు ఆధునిక మందులు అందుబాటులోకి ఉన్నాయి. మోనోక్లోమా యాంటిబాడీస్ వంటి మందుల ద్వారా వ్యాధిని నియంత్రించే వీలుంది. ఎంఆర్ఐ, పెట్‌స్కాన్‌ల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. ముందుగా మెదడులో ఏ ప్రాంతం దెబ్బతిన్నదో తెలుసుకోవాలి. అప్పుడే సరైన వైద్యం అందించవచ్చు. ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వహించాలి.

- డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరోఫిజీషియన్, నారాయణ ఆసుపత్రి

జాగ్రత్తగా ఉండాలి



నిత్యం కటుంబ సభ్యులు వారి దినచర్యను గమనిస్తూనే ఉండాలి. ప్రత్యేక పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి చికిత్స అందించాలి. ఆ దిశగా చికిత్స ఇస్తున్నాం. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే నయం చేసే వీలుంటుంది. వ్యాధి మూడో దశకు చేరితే నివారణకు మందులు లేవు. ధూమపానం మానేయాలి. వ్యాయామం చేయాలి.

- డాక్టర్ దీక్షాంతి నారాయణ్, న్యూరాలజిస్ట్, మెడికవర్ ఆసుపత్రి

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లాస్థాయి సమావేశం ఈనెల 22వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు నెల్లూరు నగరంలోని టౌన్‌హాల్లో నిర్వహించనున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, కార్యదర్శి పి.వెంకయ్య ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో డీఏ, పీఆర్సీ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అందరూ తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలోని ఇస్కపల్లి సచివాలయం వద్ద శనివారం రిజర్వ్ బ్యాంక్ డీఈఏ సహకారంతో ఫండ్, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సంస్థ ద్వారా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు పలు పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కెనరాబ్యాంక్ మేనేజరు గౌతమ్, సీఎఫ్ఐ కౌన్సిలర్ సభ్యులు సయ్యద్ నయాబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంబరం
కసుమూరు, ఏఎస్‌పేటకు తరలివచ్చిన భక్తులు



ఏఎస్‌పేట : స్వామి వారి జపమాల ప్రదర్శిస్తున్న దర్గా ఈవో

వెంకటాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి గంధమహోత్సవం సందర్భంగా చివరిరోజు శనివారం చిన్న గంధం (తహలీల్ ఫాతేహ) వైభవంగా జరిగింది. స్థానిక చందన్ మహల్ (బంగళా) నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత మస్తాన్ స్వామి వారి సమాధికి గంధం లేపాన్ని పూశారు. అనంతరం దర్గా ముజావర్లకు గంధం బిందెను అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో కసుమూరు కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు స్వామివారం గంధాన్ని పంచిపెట్టారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

● **ఏఎస్‌పేట :** శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవంలో భాగంగా చివరి రోజు శనివారం భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ పఠనం చేసి భక్తులకు వివరించారు. ఫకీర్ల కీర్తనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. నాయబ్ రసూల్ స్వామి స్వయంగా ఉపయోగించిన జపమాలను దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ ప్రదర్శించారు.

ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి స్థల పరిశీలన



ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ అధికారులు

సంగం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది నుంచి బుచ్చికి తాగునీటిని సరఫరా చేసేందుకు నిర్మించనున్న ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని శనివారం ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్, పబ్లిక్ హెల్త్ ఈఈ గిరిధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృత్ -2 పథకంలో బుచ్చికి రూ. 85 కోట్లతో తాగునీటి పథకం మంజూరు కాగా, సంగం పెన్నానది నుంచి నీటి తరలించే పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. సంగంలో ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి స్థలం కావాలని పబ్లిక్ హెల్త్ అధికారులు కోరగా, కోరిన చోట స్థలం కేటాయించేందుకు పరిశీలించామన్నారు. పనుల్లో భాగంగా బుచ్చిలో ఇప్పటికే ఐదు ట్యాంకులకు శ్లాబులు పూర్తయాయన్నారు. మిగిలిన మూడు ట్యాంకులు పనులు జరుగుతున్నాయన్నారు. సంగం తిరుమనతిప్పలో నీటిని శుద్ధి చేసే ప్లాంట్ పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. పట్టణంలో కూడ అంతర్గత పైపులైన్ల పనులు 60 శాతం పూర్తయిందన్నారు. మరో ఏడు నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డీఈ జానికీరామిరెడ్డి, ఏఈ జీవన్, కాంట్రాక్టర్ ఆనందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం



రిలే దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యుత్ జేఏసీ నేత తలమంచి శ్రీనివాసులు హెచ్చరించారు. నెల్లూరులోని జిల్లా సర్కిల్ కార్యాలయం వద్ద శనివారం విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆరవ రోజు రిలే దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. తమ కార్యచరణలో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద శాంతియుత ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు పీ దామోదర్, శ్రీనివాసులు, నజీర్ ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, నవాబ్ జాన్, కాంట్రాక్ట్ యూనియన్ నేతలు షేక్ హజరత్ వలి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.5,77,144

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల నుండి రూ. 5,77,144 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,300, కుంకుమార్చన ద్వారా రూ. 15,080, తలనీలాల ద్వారా రూ. 21,100, వాహనపూజల ద్వారా రూ. 2,100, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 1,13,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 600, గదుల అద్దెల ద్వారా రూ. 28,360, కవర్ల ద్వారా రూ. 8 వేలు, లడ్డూప్రసాదం ద్వారా రూ. 1,80,620, అన్నదానం ద్వారా రూ. 1,51,084, అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 50 వేల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

అంతరాలయ దర్శనం టిక్కెట్ రూ. 500

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నుండి అంతరాలయ దర్శనం టిక్కెట్లను అధికారులు అమల్లోకి తీసుకొచ్చారు. అంతరాలయ దర్శనాలకు వెళ్లే భక్తులకు రూ. 500 టిక్కెట్లను విక్రయించారు. వంద రూపాయల టిక్కెట్ ద్వారా భక్తులు ప్రత్యేక క్యూలో వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. రూ. 500 అంతరాలయ టిక్కెట్ ద్వారా ప్రత్యేక క్యూ ద్వారా స్వామి గర్భగుడిలోకి వెళ్లే భక్తులకు గోత్రనామాలు చదివి, ప్రత్యేక పూజలు చేయిస్తారు.

వేరుశనగకు నోడల్ ఏజెన్సీనే మార్కెటింగ్ కల్పించాలి



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి, పక్కన శాస్త్రవేత్తలు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి: కోత దశలో ఉన్న వేరుశనగ పంటకు నోడల్ ఏజెన్సీ ద్వారానే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం ముత్తుకూరు రోడ్డులోని వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఎస్)లో శిక్షణ, సందర్శన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ ఆహార నూనె గింజల పథకంపై జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పథకం కింద 2025-26 సంవత్సరానికి జిల్లాకు రెండు యూనిట్లు వేరుశనగ, మరో రెండు యూనిట్లు నువ్వులు లక్ష్యం కేటాయించారని చెప్పారు. రైతు ఉత్పాదక సంఘాల బలోపేతం కోసం మార్గదర్శకాల ప్రకారం చైతన్య జ్యోతి (కలిగిరి)ని నోడల్ ఏజెన్సీగా ఎంపిక చేశారన్నారు. వింజమూరు, పొదలకూరు సబ్‌డివిజన్లలో మినుము పంటకు ప్రత్యామ్నాయంగా జొన్న పంటను సాగు చేయవచ్చని సూచించారు. అనంతరం జిల్లాలో యూరియా పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా పంట కోత ప్రయోగాలు, పంటల బీమా తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.వెంకటేశ్వర్లు, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ లలితాశివజ్యోతి, పొదలకూరు ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్న రాజేష్, ఏడీఏ నర్సోజీరావు, సుజాత, సీపీవో లక్ష్మీ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పంట 'పడింది'

- వర్షాలతో నేలకొరిగిన ఎడగారు వరి
- దిగుబడులు పెరిగినా దక్కని సంతోషం
- ఎకరం కోతకు 2 గంటల సమయం
- పెట్టుబడులు పెరిగి నష్టాలు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఎడగారులో సాగు చేసిన వరి గతం కంటే బాగా పండింది. అయితే రైతుల దురదృష్టమో ఏమోగానీ కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోత దశలో ఉన్న వరి పైరు నేలకొరిగింది. దీంతో ధాన్యం నాణ్యత కోల్పోవడమేకాక ఎకరం కోతకు రెట్టింపు సమయం పడుతుండడంతో పెట్టుబడులు పెరుగుతోన్నాయి. ఫలితంగా అధిక దిగుబడులు వచ్చినా నష్టాలే మిగులుతోన్నాయి. ఈసారి ఎడగారుకు సాగునీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో రైతులు పూర్తి విస్తీర్ణంలో వరి సాగు చేశారు. రబీలో పండించే సన్న రకాలను తిరిగి ఎడగారులోనూ సాగు చేశారు. ఎడగారు వ్యవసాయ సీజన్‌లో ధాన్యం దిగుబడి రెండున్నర పుట్లకు మించదు. అలాంటిది ఈసారి మూడున్నర పుట్ల వరకు వస్తోంది. కొన్ని చోట్ల అంతకు మించి కూడా దిగుబడి చేతికందుతోంది. రైతులు ఆశించిన దానికంటే పుట్టి ధాన్యం ఎక్కువగా దిగుబడులు వస్తున్నా వారిలో ఆనందం కపించడం లేదు. నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తున్న సమయంలో కొద్ది రోజులుగా వర్షాలు పడుతున్నాయి. దీంతో కోతకు సిద్ధమైన పైరు నేలకొరిగింది. అక్కడక్కడ నీట మునుగుతుండడంతో చేతికందిన వరి పంట చేజారి రైతు ఆరుగాలం కష్టం 'నైరుతి' పాలైందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరొకపక్క ఎకరం వరి కోతకు సాధారణంగా గంట సమయం సరిపోతోంది. కానీ పైరు నేలకొరగడంతో కోత కోసేయంత్రానికి ఎకరా 2 గంటల వరకు పడుతోంది. ప్రస్తుతం ఎకరం కోతకు యంత్ర నిర్వహకులు రూ.2,600లు వసూళ్లు చేస్తుండగా రెండు గంటలు సమయానికి రూ.5,200లు తీసుకుంటున్నారు. చేతికందిన దిగుబడుల ఆదాయం కాస్త మిషన్ కోత అదనపు సమయానికి సరిపోతోంది. పైగా ధాన్యం తడిచిందంటూ పొలాల్లోనే వడ్లను కొనుగోలు చేసే దళారులు కొర్రీలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లోని ధాన్యం బయటకు తీసుకువచ్చేందుకు ట్రాక్టర్లకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇవన్నీ వెరసి ఖర్చులు భారీగా పెరగడంతో అదనపు దిగుబడి వచ్చిన సంతోషం లేదని, తీవ్ర నష్టాలు మిగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ధరలు తగ్గడంతో రైతుల్లో ఆనందం కనిపించడం లేదు.